


ఎన్నికల్లో అధికార పార్టీ నేతల పక్షాన దోపిడీ నిధులు వరదలా వచ్చి పడుతున్నాయి. ఐదేళ్ళుగా అధికారాన్ని అడ్డుపెట్టుకుని యధేచ్ఛగా వనరులు కొల్లగొట్టిన వైసీపీ నేతలు టోకున రూ. వేల కోట్లు పోగేసుకున్నారు. కొన్ని చోట్ల వనరుల దోపిడీకి తోడు అదనంగా వసూళ్ళు, కమిషన్లు, ఇతర దందాల ద్వారా అక్రమార్జన చేకూరింది. విచ్చలవిడిగా వచ్చిపడిన ఆ డబ్బును ఇపుడు అధికార పార్టీ నేతలు ఎన్నికల్లో వెదజల్లుతున్నారు. ఓటుకు రూ. 2 వేల నుంచీ రూ. 3 వేలు దాకా పంపిణీ అవుతోంది. ఒక చోట నగదుకు తోడు చీరలు, ముక్కుపుల్లలు, వెండి మెట్టెలు వంటివి అందజేస్తున్నారు. మరో చోట రెండో విడత నగదు పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇసుక, సిలికా, క్వార్ట్జ్, గ్రావెల్, మట్టి, భూములు వంటి వాటి దోపిడీ ద్వారా సమకూరిన నిధులు ఈ ఎన్నికల్లో వైసీపీ గెలుపునకు ఆ పార్టీ నేతలు వరదలా ఖర్చు చేస్తున్న తీరు ప్రజలను నివ్వెరపరుస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఐదేళ్ళుగా వనరులు కొల్లగొట్టిన వైసీపీ నేతలు
విచ్చలవిడిగా సంపాదించిన డబ్బును వెదజల్లుతున్న వైనం
ఓటుకు రూ 2 వేల నుంచీ రూ. 3 వేలు
కొన్ని చోట్ల రెండో విడత పంపిణీకి సన్నద్ధం

వరదలా పారుతున్న దోపిడీ నిధులు

సత్యవేడును దోచేసిన బడానేత స్వల్ప విదిలింపు

సత్యవేడు నియోజకవర్గంలో దళిత ఎమ్మెల్యే నిస్సహాయతను అడ్డం పెట్టుకుని అన్ని వనరులూ దోచేసిన అధికార పార్టీ బడా నేత ఈ ఎన్నికల్లో తన అక్రమార్జనలో స్వల్ప భాగం విదిలిస్తున్నారు. సత్యవేడు, నాగలాపురం, వరదయ్యపాలెం, నారాయణవనం, బీఎన్‌కండ్రిగ, పిచ్చాటూరు మండలాల్లో 33 గ్రావెల్ క్వారీలు నడుస్తుంటే పలు క్వారీలు పరిధికి మించి ప్రభుత్వ, అటవీ భూముల్లోనూ తవ్వకాలు జరుపుతున్నాయి.నారాయణవనం మండలం ఎరికంబట్టు గ్రామంలో గ్రావెల్ తవ్వకాలతో సగం గుట్ట కరిగిపోయింది. సత్యవేడు మండలం ఏఎం వరం, కన్నవరం, జడేరి, అల్లప్పగుంట గ్రామాల్లో కొండలన్నీ తవ్వేశారు. ఆ మండలంలోనే బాలకృష్ణాపురంలో వంద ఎకరాల పశువుల మేత భూముల్లో గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. గ్రామస్తులు సుప్రీం కోర్టు దాకా పోరాడి ఆపగలిగారు. నాగలాపురం మండలం వజ్జావారి కండ్రిగలో గుట్ట ఖాళీ అయింది. వరదయ్యపాలెం మండలం బత్తలవల్లంలోని డీకేటీ భూముల్లో భారీగా తవ్వకాలు జరిగాయి. నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో అరుణా నదిలో భారీగా ఇసుక దోపిడీ జరిగింది. నాగలాపురం మండలం సురుటుపల్లి, నందనం గ్రామాల్లో ఇసుక తవ్వకాలను ఆపేందుకు గ్రామస్తులు గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. అక్రమార్కులకు ట్రిబ్యునల్ భారీ జరిమానా విధించింది. బీఎన్ కండ్రిగ కాళంగి నదిలో విచ్చలవిడి తవ్వకాలు జరిగాయి. సత్యవేడు మండలం పీవీపురంలో, బీఎన్ కండ్రిగ మండలాల్లో కంకర క్వారీలు అటవీ భూముల్లో కూడా తవ్వకాలు జరిగాయి. మొత్తం మీద నియోజకవర్గంలో రూ. 2-3 వేల కోట్ల దోపిడీ జరిగిందని అంచనా. ఇదంతా ఉమ్మడి జిల్లాకు చెందిన వైసీపీ బడా నేత మనుషులే చేపట్టారని, ఇపుడు ఆ అక్రమార్జనలో కొంత శాతం ఎన్నికల్లో ధారాళంగా ఖర్చు పెడుతున్నారనే ఆరోపణలున్నాయి.

శ్రీకాళహస్తిలో కరెన్సీ నోట్ల ప్రవాహం

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు కరెన్సీ నోట్లను నీళ్ళలా ఖర్చు చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో ప్రవహిస్తున్న స్వర్ణముఖి నదిలో ఇసుకను ఐదేళ్ళ పాటు యదేచ్ఛగా కొల్లగొట్టేశారు. శ్రీకాళహస్తి, ఏర్పేడు, రేణిగుంట, తొట్టంబేడు మండలాల్లో మట్టి తవ్వకాలతోనే రూ. 300 కోట్లు దోచేశారనే ఆరోపణలున్నాయి. అలాగే ఈ నాలుగు మండలాల్లో రూ. వందల కోట్ల విలువైన గ్రావెల్ తవ్వకాలు భారీగా చేపట్టారు. ఏర్పేడు, రేణిగుంట మండలాల్లో ప్రభుత్వ భూములు పెద్దఎత్తున కబ్జా అయ్యాయి. వాటి విలువా రూ. వందల కోట్లలోనే. అదే విధంగా నాలుగు మండలాల్లో పరిశ్రమల యాజమాన్యాల నుంచీ కూడా భారీగా వసూళ్ళకు పాల్పడినట్టు ఆరోపణలున్నాయి. ఈ వనరుల దోపిడీతో భారీగా ఆర్జించినందునే వైసీపీ నేతలు ఓటర్లకు రూ. 2 వేల నుంచీ రూ. 3 వేల వంతున నగదు ఇచ్చి అదనంగా మహిళలకు బంగారు ముక్కుపుడక, వెండి మెట్టెలు, చీరలు ఇవ్వగలుగుతున్నారనే టాక్ ప్రజలనుంచీ వినిపిస్తోంది.

సూళ్ళూరుపేటలో నానా రకాల దందాలు

సూళ్ళూరుపేట నియోజకవర్గంలో నానా రకాల దందాలు సాగించి వైసీపీ నేతలు అక్రమంగా డబ్బు పోగేసుకున్నారనే ప్రచారముంది. పెళ్ళకూరులో అక్రమ గ్రావెల్ తవ్వకాలతో శిరసనంబేడు కొండను కరిగించేశారు. తడ మండలం మాంబట్టు వద్ద గ్రావెల్ కొల్లగొట్టారు. సూళ్ళూరుపేట మండలం మన్నారుపోలూరు వద్ద గ్రావెల్ కోసం గుట్టలాంటి మట్టి దిబ్బను మాయం చేశారు. సూళ్ళూరుపేట, నాయుడుపేట, దొరవారిసత్రం మండలాల్లో మట్టి తవ్వకాలు భారీఎత్తున సాగాయి. పెళ్ళకూరు మండలంలో ఇసుక తవ్వకాలు కోర్టు మెట్లెక్కే దాకా సాగాయి. రేషన్ బియ్యం, గుట్కా, గంజాయి వంటి అక్రమ దందాలకు అంతే లేదు. పార్టీ వర్గాల నుంచీ వచ్చిన డబ్బును ఓటర్లకు పంచుతున్న అధికార పార్టీ నేతలు ఈ అక్రమ దందాలతో వచ్చి పడిన డబ్బును ప్రచారాలకు, అసమ్మతి నేతలను బుజ్జగించేందుకు వాడుతున్నట్టు చెబుతున్నారు.

చంద్రగిరిలో చరిత్ర సృష్టించిన వనరుల దోపిడీ

చంద్రగిరి నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల వనరుల దోపిడీ చరిత్ర సృష్టించింది. చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల్లో స్వర్ణముఖి నదిలో భారీగా ఇసుక కొల్లగొడుతున్నారు. కేవలం ఇసుకతోనే రూ. 500 కోట్లకు పైగా దోపిడీ జరిగిందని అంచనా. రామచంద్రాపురం, చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల్లో ఎర్రమట్టి తవ్వకాలు కూడా వైసీపీ నేతలకు భారీ ఆదాయాన్నిచ్చాయనే ప్రచారం వుంది. ఇక తిరుపతి రూరల్, రామచంద్రాపురం, చంద్రగిరి మండలాల్లో రూ.వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు, మఠం భూములు కాజేశారనే ఆరోపణలున్నాయి. దీనికి తోడు శ్రీవారి దర్శనాల రూపంలో బడా పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, ప్రవాసాంధ్రుల నుంచీ భారీగా విరాళాలు వచ్చి పడుతున్నాయనే ప్రచారముంది. ఈ నిధుల నుంచీ ఎన్నికల్లో వారు పెడుతున్న కొంత శాతం ఖర్చుకే ప్రత్యర్థులు బెంబేలెత్తిపోతున్న పరిస్థితి.

తిరుపతిలో అక్రమ నిధుల వరద

తిరుపతి నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు అక్రమంగా సమకూర్చుకున్న నిదులను ఎన్నికల్లో వరదలా పారిస్తున్నారు. గత ఐదేళ్ళుగా వైసీపీ నేతలు కబ్జాలు, భూముల సెటిల్‌మెంట్లతో భారీగా అక్రమార్జనకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. దీనికి తోడు నగరంలో వ్యాపారుల వంటి కొన్ని వర్గాల నుంచీ నిర్బంధ వసూళ్ళకు పాల్పడ్డారనే ప్రచారముంది.మున్సిపల్ కార్పొరేషన్, టీటీడీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో కమీషన్ల రూపంలో కూడా రూ. వందల కోట్లు పోగేసుకున్నట్టు ఆయా వర్గాలు చెబుతున్నాయి. ఇక దర్శనాల రూపంలో వస్తున్న ఆదాయానికి అంతూపొంతూ వుండడం లేదని సమాచారం. టీడీఆర్ బాండ్లలో అవినీతి విశ్వరూపం అందరికీ తెలిసిందే. ప్రభుత్వమే వాటిని నిలుపుదల చేసే స్థాయిలో అవినీతి జరిగింది. ఇలా వివిధ మార్గాల్లో పోగేసుకున్న అక్రమార్జన నుంచీ స్వల్ప శాతం నిధులనే ఎన్నికల్లో వరదలా పారిస్తున్నారు.

వెంకటగిరి, గూడూరుల్లోనూ అవే పరిస్థితులు

వెంకటగిరి నియోజకవర్గం సైదాపురం మండలంలో ఐదేళ్ళుగా జరిగిన క్వార్ట్జ్ ఖనిజ దోపిడీతో ఆ పార్టీ నేతలు రూ. కోట్లకు పడగలెత్తారు. ఆ నిధుల్లో కొంత మేరకు ప్రస్తుత ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. జిల్లాలోనే అత్యధికంగా ఓటుకు రూ. 3500 ఇచ్చేందుకు సన్నద్ధమవుతున్నట్టు సమాచారం. గూడూరు విషయానికొస్తే కోట, చిల్లకూరు మండలాల్లో సిలికా దోపిడీ జరిగింది.వాకాడు, చిట్టమూరు మండలాల్లో ఇసుక దందా భారీస్థాయిలో కొనసాగింది. గూడూరు మండలంలో గ్రావెల్, క్వార్ట్జ్ తవ్వకాలు పెద్దఎత్తున జరిగాయి. అయితే ఈ దందాలో సీఎం జగన్ సన్నిహితుల ప్రత్యక్ష ప్రమేయం వుందని సమాచారం. అభ్యర్థి కొత్తవారైనా పార్టీ వర్గాలు చేస్తున్న ఎన్నికల ఖర్చులో మాత్రం సింహభాగం ఈ అక్రమార్జన లోనిదేనన్న ఆరోపణలున్నాయి.



శ్రీవారి ఆలయం బయట భక్తులకు బాబు పలకరింపు

చిత్తూరులో శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం ముగించిన టీడీపీ అధినేత చంద్రబాబు రాత్రి తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.వైకుంఠం క్యూకాంప్లెక్సు గుండా ఆలయానికి చేరుకున్న ఆయన మహా లఘుదర్శనంలో స్వామివారిని దర్శించుకున్నారు.

ముగిసిన ప్రచారం

- గత ఎన్నికల్లో ఫ్యాన్ హోరు
- ఈసారి వైసీపీ పరిస్థితి తారుమారు
- పట్టు కోల్పోతున్నా బింకం వీడని వైసీపీ
- ప్రలోభాలు, తాయిలాలతో విజయంపై ధీమా
- జనంలో మార్పుపై కూటమి పార్టీల విశ్వాసం

తిరుపతి, మే 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగిసింది. సోమవారం పోలింగ్ జరగనుంది. ప్రచారం ముగియడంతో పోలింగ్ సరళి, జయాపజయాలపై అటు ప్రధాన పార్టీల్లోనూ, ఇటు ప్రజానీకంలోనూ చర్చ మొదలైంది. గత ఎన్నికల్లో జిల్లాలో ఫ్యాన్ హోరు స్పష్టంగా వినిపించింది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానాల్లో వైసీపీ అభ్యర్థులే విజయం సాధించారు. అందరూ భారీ మెజారిటీతో గెలుపొందగా తిరుపతిలో మాత్రం అత్యల్ప మెజారిటీతో గట్టున పడ్డారు. అయితే ప్రస్తుత ఎన్నికల్లో వైసీపీ పరిస్థితి తారుమారైనట్టు కనిపిస్తోంది. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గంలోనూ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఈ ఐదేళ్ళలో ఎలాంటి అభివృద్ధి పనులూ జరగలేదు.చెప్పుకోదగిన సంస్థలు రాలేదు. పరిశ్రమలూ ఏర్పాటు కాలేదు. సాగునీటి ప్రాజెక్టులు అతీగతీ లేకుండా పోయాయి. ప్రధాన రహదారులు సైతం బాగుపడలేదు. పేదలకు పక్కా ఇళ్ళు కూడా పూర్తి కాలేదు.ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగాయి.అధికార పార్టీ నేతల అవినీతి, అక్రమాలు పెచ్చుమీరాయి. దీనికి తోడు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పేద, మధ్యతరగతి వర్గాల దైనందిన జీవితాలు ఇబ్బందుల్లో పడ్డాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు ఇలా ప్రభుత్వ వేతనాలు అందుకునే వేలాది కుటుంబాలు అధికార పార్టీకి వ్యతిరేకంగా మారాయి. ఈ పరిణామాలకు తోడు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడడంతో అన్ని నియోజకవర్గాల్లో మిత్రపక్షాల బలం టీడీపీకి అనుకూల పరిస్థితులు కల్పిస్తోంది. సాధారణ కార్యకర్తల నుంచీ నియోజకవర్గ స్థాయి నాయకుల వరకూ పెద్దసంఖ్యలో అధికార పార్టీని వీడి టీడీపీలో చేరడం రోజువారీ కార్యక్రమంగా మారింది. దీంతో నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులు ప్రజల్లోనూ, శ్రేణుల్లోనూ పట్టు కోల్పోతున్న వైనం స్పష్టంగా కళ్ళకు కడుతోంది. అయితే అభ్యర్థులు బింకం వదలడం లేదు. ఓటర్లకు నగదు పంపకాలు, ఇతర ప్రలోభాలను నమ్ముకుని విజయం తమదేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పట్ల, అధికార పార్టీ పట్ల ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతతో పాటు ఐదేళ్ళ పాటు ప్రజాక్షేత్రంలో నిలిచి పోరాడిన తమకు ఓటరు మద్దతుగా నిలుస్తాడన్న విశ్వాసం కూటమి పార్టీల్లో వ్యక్తమవుతోంది.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
UMFB (శ్రీనివాసం కాంప్లెక్స్ బ్రాంచ్) తిరుపతి. ఫోన్: 83698 53860

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 యొక్క రూల్ 8(1))

ఇందుమూలముగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, UMFB (శ్రీనివాసం కాంప్లెక్స్ బ్రాంచ్) తిరుపతి, తిరుమల బైపాస్ రోడ్, TMR కళ్యాణ మండలం ప్రక్కన, మండపం, తిరుపతి, తిరుపతి జిల్లా, యొక్క అధీకృత అధికారిగా ఉన్న దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (రెండవ) యాక్ట్ 2002 (2002లో చట్టం 54) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదివే సదరు సెక్షన్ 13(12) ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ 01-03-2024 న డిమాండ్ నోటీసు జారీచేయటమైనది.

ఋణగ్రహీత : మెస్సర్స్ ఐద్రి ఇండస్ట్రీస్, ప్రొప్రైట్రిక్స్: శ్రీమతి టి. రెడ్డమ్మ మరియు శ్రీమతి టి.రెడ్డమ్మ, భర్త : టి. సూరి బాబు.
హామీదారు (లు) : శ్రీ టి. సూరి బాబు, తండ్రి : టి. కాలప్ప మరియు శ్రీమతి ఇ. కాలమ్మ, భర్త : ఇ.సుబ్బయ్య.

వార్లను నోటీసులో తెలియజేయబడిన తేది.29-02-2024 నాటికి రూ.1,39,13,033.19 (అక్షరాల ఒక్క కోటి ముప్పై తొమ్మిది లక్షల పదమూడు వేల ముప్పై మూడు రూపాయల పంతొమ్మిది పైసలు మాత్రమే) అంగీకరించిన రేటు ప్రకారం వర్తించు వడ్డీతో సహా నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించాల్సిందిగా కోరడమైనది.

ఋణగ్రహీతలు సదరు మొత్తమును తిరిగి చెల్లించక విఫలమైనందున సదరు రూల్స్ లోని రూల్ 8తో చదవబడే సదరు చట్టంలో సెక్షన్ 13(4) క్రింద దిగువ సంతకందారు తనకు సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ తెలిపిన ఆస్తులను తేది.08-05-2024 న స్వాధీనం చేసుకున్నారని ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయటమైనది.

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి మరియు ఋణగ్రహీతలకు హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎటువంటి లావాదేవీలు అయినా ఋణగ్రహీతల బకాయి తేది.30.04.2024 నాటికి రూ.1,40,15,569.48/- (అక్షరాలా ఒక్క కోటి నలభై లక్షల పదిహేను వేల ఐదు వందల అరవై తొమ్మిది రూపాయల నలభై ఎనిమిది పైసలు మాత్రమే) మరియు వడ్డీతో సహా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఛార్జీకి లోబడి ఉంటాయని తెలియజేయటమైనది.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తులను విడిపించుకొనుటకు గల సమయం గురించి, సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8)లో నిబంధనలను పరిశీలించవలెను.

స్థిరాస్తుల వివరములు

ఆస్తి నెం.1: తిరుపతి జిల్లా,తిరుపతి రూరల్, తిరుచానూరు గ్రామ పంచాయతీ, వార్డు నెం-9, వార్డ నుండి మోహెట్స్ రోడ్ రెసిడెన్షియల్ ఏరియా,సర్వే నెం-77/3ఎ, ప్లాట్ నెం. 26లో, విస్తీర్ణం-1650 చ.అడుగులు షెడ్‌తో కూడిన స్థలం టి.సూరిబాబు గారికి చెందినది.
హద్దులు: తూర్పు: 3వ రోడ్డు (30 అడుగుల వెడల్పు రోడ్డు), పడమర: ప్లాట్ నెం-32, ఉత్తరం: ప్లాట్ నెం-25, దక్షిణం: ప్లాట్ నెం.27.
ఆస్తి నెం.2 : తిరుపతి జిల్లా, రేణిగుంట సబ్ జిల్లా, రేణిగుంట మండలం, నెం-21 యర్రమరెడ్డి పాలెం గ్రామ ఖాతాలో, నెం-11 తిరుచానూరు గ్రూపు (Roc.1252/G1/2007 in L.P.No.41/G1/2007,Dated: 03-01-2008) సర్వే నెం-558/3, ప్లాట్ నెం-295లో విస్తీర్ణం 2457.75 చ.అడుగులు లేదా 273.08 చదరపు గజాలు షెడ్‌తో కూడిన స్థలం ఇ. కాలమ్మ గారికి చెందినది.
హద్దులు: తూర్పు: వాగు, పడమర: ప్లాట్ నెం.294 చెందిన ఖాళీ స్థలం, ఉత్తరం : 40 అడుగుల వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం.298 చెందిన ఖాళీ స్థలం.

తేది : 08-05-2024
స్థలం : తిరుపతి
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
SME తిరుముడివాక్కమ్ (12931)

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ బి. సంత రాజు మొబైల్ నం.9445860395 ;
CMP No:1, SIDCO ఇండస్ట్రియల్ ఎస్టేట్, తిరుముడివాక్కమ్, చెన్నై - 600044. టెలి:48622202, ఇ-మెయిల్:sbi.12931@sbi.co.in

స్థిరాస్తి అమ్మకం కొరకు విక్రయ ప్రకటన (ప్రొవిజన్ రూల్ 8(6) చూడగలరు)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల విక్రయానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టబడిన దిగువ వివరించిన స్థిరాస్తులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అధీకృత అధికారిచే లాంఛనప్రాయ స్వాధీనం చేసుకొనబడినట్టి మరియు (1) రూ.1,75,04,484.00 (రూపాయలు ఒక కోటి డెబ్బై ఐదు లక్షల నాలుగువేల నాలుగు వందల ఎనభైనాలుగు మాత్రమే) టర్మ్ లోన్ ఖాతా - 38567196359 (2) రూ.3,91,25,742.00 (రూపాయలు మూడుకోట్ల తొంభై ఒక్క లక్షల ఇరవై ఐదు వేల ఏడు వందల నలభై రెండు మా త్రమే), (3) జిఇసిఎల్ ఖాతా - 39366344506 రూ. 13,77,693.00 (రూపాయలు పదమూడు లక్షల డెబ్బై ఏడు వేల ఆరువందల తొంభై మూడు మాత్రమే), (4) జిఇసిఎల్ ఎక్స్‌టెన్షన్ ఖాతా - 40608115914, రూ.89,97,537.00 (రూపాయలు ఎనభై తొమ్మిది లక్షల తొంభై ఏడువేల ఐదు వందల ముప్పై ఏడు మాత్రమే) దిగువ తెలిపిన ఋణగ్రహీత నుండి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్ఎమ్ఇ తిరుముడివాక్కమ్ నుండి బకాయిలు, దానిపై ఖర్చులు మరియు వ్యయాలు + భవిష్యత్‌లోని వడ్డీ మరియు 02.05.2024 నాటికి మొత్తం రూ.6,70,05,456/- (రూపాయలు ఆరు కోట్ల డెబ్బై ఐదు లక్షల ఐదు వేల నాలుగు వందల యాభై ఆరు మాత్రమే) మరియు క్యాష్ క్రెడిట్ ఖాతా 40158110540 యొక్క రికవరీ కొరకు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా", "అక్కడ ఏది ఉంటే అది మరియు అక్కడ ఏది ఉంటే అదే" ప్రాతిపదికన 25-06-2024న సెక్యూర్డ్ క్రెడిటార్‌చే విక్రయించబడతాయని ఇందుమూలంగా సాధారణ ప్రజలకు, ముఖ్యంగా ఋణగ్రహీతలకు మరియు హామీదారులకు తెలియజేయడమైనది.

(1) మెసర్స్ సంప్రా ఇండస్ట్రీస్ (ఫ్యాక్టరీ చిరునామా) ప్లాట్.నం.06, ఇండస్ట్రియల్ పార్క్, గుంటకిందపల్లి గ్రామం, శ్రీకాళహస్తి, ఆంధ్రప్రదేశ్-517641. (2) మెసర్స్ సంప్రా ఇండస్ట్రీస్, బ్లాక్ నం.13, డి.నం.TE జైన్ నక్షత్ర, నం.82, యూనియన్ రోడ్, చిన్న నోలంబూర్, మధురవోయల్, చెన్నై-600095. (3) శ్రీ సంతోష్ కుమార్ (యాజమాని&హామీదారు మెసర్స్ సంప్రా ఇండస్ట్రీస్) బ్లాక్ నం.13, డి.నం.TE జైన్ నక్షత్ర, నం.82, యూనియన్ రోడ్, చిన్న నోలంబూర్, మధురవోయల్, చెన్నై-600095. 4) శ్రీమతి వాసంతి జె., (హామీదారు మెసర్స్ సంప్రా ఇండస్ట్రీస్) బ్లాక్ నం.13, డి.నం.TE జైన్ నక్షత్ర, నం.82, యూనియన్ రోడ్, చిన్న నోలంబూర్, మధురవోయల్, చెన్నై-600095. (5) శ్రీ జనార్దన్ ఎస్, (హామీదారు మెసర్స్ సంప్రా ఇండస్ట్రీస్) బ్లాక్ నం.13, డి.నం.TE జైన్ నక్షత్ర, నం.82, యూనియన్ రోడ్, చిన్న నోలంబూర్, మధురవోయల్, చెన్నై-600095. 26.09.2023న సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ ప్రకటన జారీచేశారు. 20.12.2023న సెక్షన్ 13(4) క్రింద స్వాధీనతా ప్రకటన జారీ చేశారు.

స్థిరాస్తుల వివరణ

ఆస్తి-1 : శ్రీమతి జె.వాసంతి పేరున గల 3090 చ.అ.లు భూమి విస్తీర్ణంలో కొలతలు గల చెంగల్‌పేట్ తాలూకా, సెంగుండ్రం గ్రామం, కొత్త సర్వే నం.489/9, పాత సర్వే నం.489/1లోని చంగల్‌పేట్-603209 మరైమలై నగర్, పూమ్‌పూహార్ నగర్, ప్లాట్ నం.23 గల ఖాళీ భూమి, ఆస్తి యావత్తు. సరిహద్దులు : ఉత్తరం : 30 అ. వెడల్పు ఎర్రైన్‌రోడ్, దక్షిణం : ఖాళీ ప్లాట్‌నం.44, తూర్పు : ఖాళీ ప్లాట్ నం.24, పశ్చిమం : 30 అ.ల బిటుమినస్ రోడ్, కొలతలు : ఉత్తరం నుండి దక్షిణం : పై తూర్పు నుండి పశ్చిమం : 60 అ.లు, తూర్పు నుండి పశ్చిమం పై ఉత్తరం : 52 అ.లు, తూర్పు నుండి పశ్చిమం : దానిపై దక్షిణం : 51 అ.లు, చెంగల్‌పేట్ రిజిస్ట్రేషన్ జిల్లా మరియు చెంగల్‌పేట్, జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా వద్దగలవి.

రిజర్వు ధర రూ. 36,00,000/-	బయానా రూ. 3,60,000/-	బిడ్ పెరుగుదల రూ. 25,000/-

ఆస్తి-2 : శ్రీ యస్. జనార్ధన్ పేరున గల తిరువల్లూర్ జిల్లా, అంబత్తూర్ తాలూకా, నోలంబూర్ గ్రామం, సర్వే నం.లు 156/1, 156/2, 157, 158/1ఎ, 158/1బి1, 158/2ఎ, 158/2బి1, 163/1ఎ మరియు 167/1 లోని 333098.87 చ.అ.లు (138.79 గ్రౌండ్స్) లోని 613.98 చ.అ.లు భూమి విస్తర్ణం మొత్తం అవిభాజ్య వాటాతో కార్ పార్కింగ్ నెం.26, 1 కవర్ చేయబడిన తో కలిపి ఓపెన్ టెర్రస్ 208 చ.అ.లతో 3వ అంతస్తు లోని కామన్ ఏరియా, 982 చ.అ.లు, మరియు 140 చ.అ.లు, బిల్టప్ ఏరియా కలిగిన చెన్నై - 600095, నోలంబూర్, యూనియన్ రోడ్, జైయిన్ నక్షత్ర అపార్ట్‌మెంట్, 13వ బ్లాక్, 3వ అంతస్తు, ఫ్లాట్ నం.టిఇ, వద్దగల నివాసిత ఫ్లాట్. సరిహద్దులు : ఉత్తరం : సర్వే నం.లు 154, 155 మరియు 159, దక్షిణం : రోడ్, తూర్పు : సర్వే నం.159, 163/1బి మరియు 158/2బి2, పశ్చిమం : సర్వే నం.153 మరియు 167/3, మరియు విల్లివక్కం జాయింట్-2 సబ్‌రిజిస్ట్రార్ సబ్‌రిజిస్ట్రేషన్ జిల్లా మరియు సెంట్రల్ చెన్నై సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా వద్ద గలవి.

రిజర్వు ధర రూ. 52,00,000/-	బయానా రూ. 5,20,000/-	బిడ్ పెరుగుదల రూ. 25,000/-

ఆస్తి-3 : శ్రీ ఎస్ జనార్ధన్ పేరున గల ఎగ్మోర్ తాలూకా, పులియూర్ గ్రామం, బ్లాక్ నం.9, టిఎస్ నం.15/11 భాగంలో కలిగిన భూమి. 344 చ.అ.లు, అవిభాజ్య విస్తీర్ణంతో 603 చ.అ.లు, ప్లింత్ ఏరియా కలిగిన కొలతలు గల చెన్నై-600024 కొడంబాక్కం, శివన్‌కోయిల్ సౌత్ స్ట్రీట్, సి బ్లాక్, హెచ్‌ఐజి గ్రౌండ్ ఫ్లోర్, నం.3/2 రకంగల నివాసిత ఫ్లాట్. సరిహద్దులు : ఉత్తరం : బ్లాక్ నం.సి-4, దక్షిణం : ఫ్లాట్ నం.సి-3/1, తూర్పు : ప్రస్తుత రోడ్, పశ్చిమం : బ్లాక్ నం.సి-8 మరియు చెన్నై సెంట్రల్ రిజిస్ట్రేషన్ జిల్లా మరియు కొడంబాక్కం సబ్‌రిజిస్ట్రేషన్‌లో గలవి.

రిజర్వు ధర రూ. 24,30,000/-	బయానా రూ. 2,43,000/-	బిడ్ పెరుగుదల రూ. 25,000/-

ఇ-వేలం అమ్మకం వివరాలు

ఇ-వేలం తేది & సమయం: **25.06.2024** - మ.03.00 మరియు మ.05.00 గం.ల మధ్య
ప్రతి బిడ్ కొరకు 10 నిమిషాల అపరిమిత ఆటో విస్తరణతో, బిడ్ కొనసాగితే విక్రయం ముగిసే వరకు

EMD రెమిటెన్స్: బిడ్డర్లు స్వంత వాలెట్ MSTC Ltd.,తో దాని ఇ-వేలం సైట్‌లో https://www.mstcecommerce.com/aucionhome/ibapi/index.jsp, NEFT ద్వారా నమోదు చేయబడింది.

ఆస్తుల తనిఖీ తేది మరియు సమయం: 08.06.2024న ఉ.11.00 నుండి సాయంత్రం 04.00గం.ల మధ్య సంప్రదించవలసిన వ్యక్తి: శ్రీ డి. జ్ఞానరాజ్-9884412593.

బ్యాంకుకు తెలిసినంత మేరకు రాకట్టు రుణబారాలు: లేవు.
బ్యాంకు ఆమోదించిన సర్వీస్ ప్రొవైడర్ https://www.mstcecommerce.com/aucionhome/ibapi/index.jsp, ద్వారా వేలం ఆన్‌లైన్‌లో నిర్వహించబడుతుంది.
ఇ-వేలం విక్రయం యొక్క వివరాణాత్మక నిబంధనలు నియమాల కొరకు మరియు ఆన్‌లైన్ ఇ-వేలం బిడ్ ఫారం, డిక్లరేషన్ మొదలైన వీటిని కలిగి ఉన్న ఇ-వేలం టెండరు డాక్యుమెంట్ కొరకు దయచేసి www.bank.sbi. మరియు https://www.mstcecommerce.com/auctionhome/ibapi/index.jsp, అందించిన లింక్‌ను చూడగలరు.
అధీకృత అధికారికి ఆమోదయోగ్యం కానట్లయితే ఏదైనా బిడ్డను ఆమోదించడానికి లేదా తిరస్కరించడానికి లేదా ఏసమయంలోనైనా ఎటువంటి కారణం చెప్పకుండా వేలం యొక్క నిబంధనలను వాయిదా వేయడానికి/రద్దుచేయడానికి/వాయిదా/మార్చడానికి హక్కును కలిగి ఉంటారు మరియు అతనిదే అంతిమ నిర్ణయం ఉంటుంది.
ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసే లోపు MSTCలో ప్రీ-బిడ్ బయానాను డిపాజిట్ చేయవచ్చును.MSTC బ్యాంక్ యొక్క ఖాతాలో చెల్లింపు రసీదు మరియు ఇ-వేలం వెబ్‌సైట్‌లో అటువంటి సమాచారాన్ని నవీకరించిన తర్వాత మాత్రమే ప్రీ-బిడ్ బయానా యొక్క క్రెడిట్ బిడ్డరుకు ఇవ్వబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియ ప్రకారం దీనికి కొంత సమయం పట్టవచ్చును మరియు బిడ్డరు వారి స్వంత ఆసక్తి మేరకు చివరి నిముషంలో ఏదైనా సమస్యను నివారించడానికి ప్రీ-బిడ్ బయానా మొత్తం అందువలన సమర్పించమని సూచించడమైనది.
ఈ విక్రయ ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 194-1ఎ తెలుపుతుంది.
తేది:08.05.2024, ప్రదేశం : చెన్నై.
చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, ఎస్ఎమ్ఇ తిరుముడివాక్కం.

పోలింగ్‌కు విస్తృత ఏర్పాట్లు

● 26 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలతో బందోబస్తు


పెద్దగొర్పాడులోని పోలింగ్ కేంద్రం

పాకాల, మే 11: ఎన్నికల నిర్వహణకు మండలంలోని 54 పోలింగ్ కేంద్రాల్లో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఆయా కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు, క్యూ లైన్ల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. గత ఎన్నికలను దృష్టిలో వుంచుకొని గొడవలు, అల్లర్లు జరిగిన పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రత్యేకదృష్టి సారించారు. వల్లివేడు, మద్దినాయనిపల్లె, మొగరాల, నేలదానిపల్లె, మొరవపల్లె, దామలచెరువు, ఊట్లవారిపల్లె, చిన్నగొర్పాడు, పంటపల్లె, ఇరంగారిపల్లె, గానుగపెంట, కె.వడ్డేపల్లె, పులివర్తివారిపల్లెలలో ఒక్కొక్క కేంద్రం, పాకాలలో ఎస్వీఎన్ పాఠశాలలో 3, ప్రభుత్వ హైస్కూల్‌లో 3, చెన్నుగారిపల్లెలో 2, సామిరెడ్డిపల్లెలో 2 కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

కేంద్రంలో, రాష్ట్రంలో వచ్చేది ఎన్డీఏ ప్రభుత్వాలే

చంద్రగిరి, మే 11: కేంద్రంలో, రాష్ట్రంలో వచ్చేది ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలే అని చంద్రగిరి మండలం బుచ్చినాయుడుపల్లికి చెందిన జ్యోతిష్కుడు నాయుడుస్వామి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు దంపతులకు గ్రహాలు అనుకూలంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. టీడీపీకి 120 అసెంబ్లీ సీట్లు, జనసేనకు 17 నుంచి 18 వరకు, బీజేపీకి 8 సీట్లు వచ్చే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా టీడీపీకి 16 నుంచి 17, జనసేనకు 2, బీజేపీకి 5 పార్లమెంటు స్థానాలు వచ్చే అవకాశం ఉందన్నారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం


ఉప్పరపల్లెలో టీడీపీ ఎన్నికల ప్రచారం

పాకాల, మే 11: మండలంలోని ఉప్పరపల్లె పంచాయతీ పరిధిలోని సూరినేనిపల్లె, ఊట్లవారిపల్లె, అగ్రహారం, రామిరెడ్డిగారి ఇండ్లు, ఉప్పరపల్లెలో శనివారం బెంగళూరు హొసకోట్ బీజేపీ కార్పొరేటర్ నితిన్ శ్రీనివాస్ స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. టీడీపీ అమలు చేయనున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, పులివర్తి నానీని ఎమ్మెల్యేగా, దగ్గుమళ్ల ప్రసాదరావును ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ నాయకులు కె.బాలాజీ, మదన్‌మోహన్ చౌదరి, చంద్రశేఖర్ నాయుడు, కృష్ణమూర్తి, దామోదర నాయుడు, రవి, నాగరాజ్, భరత్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నానీకి ఒక అవకాశం ఇవ్వండి


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎంపీపీ బిందుమాధవి

రామచంద్రాపురం, మే 11: రానున్న ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీకి ఒక్క అవకాశం ఇవ్వాలని మాజీ ఎంపీపీ బిందుమాధవి అనుపల్లెలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాయలచెరువుపేటలో మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, మాధవయ్య, నాగభూషణం, నాదమునియాదవ్, నెత్తకుప్పంలో జిల్లా కార్యదర్శి జేడీ జగన్, చిట్టత్తూరులో చిరంజీవిరెడ్డి, రామానాయుడుకండ్రిగలో జిల్లా కార్యదర్శి కోలా హరిప్రసాద్, సురేంద్ర నాయుడు, పద్మవల్లిపురంలో బాబుయాదవ్, గంగిరెడ్డిపల్లెలో ఢిల్లీనాథరెడ్డి, గురుప్రసాద్, కమ్మకండ్రిగలో జనార్థన్‌చౌదరి, అర్జున్ నాయుడు, వేణుగోపాల్ నాయుడు, గంగమాంబపురంలో విజయకుమార్, రామాపురంలో మాజీ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, మునిరామిరెడ్డి, ధనంజయరెడ్డి, రవి, నెన్నూరులో మాజీవైస్ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రావిళ్లవారిపల్లెలో గిరి నాయుడు, సొరకాయలపాలెంలో నాదమునియాదవ్, సుబ్రహ్మణ్యంయాదవ్ నానీని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.

నరసింగాపురంలో ప్రీతమ్‌రెడ్డి ప్రచారం



చంద్రగిరి, మే 11: చంద్రగిరి మండలం, నరసింగాపురంలో మాజీ ఎమ్మెల్యే రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డి తనయుడు, ప్రముఖ వ్యాపారవేత్త రెడ్డివారి ప్రీతమ్‌రెడ్డి శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ గెలిస్తేనే అభివృద్ధి, యువతకు ఉద్యోగాలు, ఉపాధి లభిస్తుందన్నారు. చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని, చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం గ్రామస్తులు, టీడీపీ నాయకులు ఆయన్ను ఘనంగా సత్కరించారు.

ఆర్‌సీపురంలో మోస్తరు వర్షం



రామచంద్రాపురం, మే 11: మండల కేంద్రమైన ఆర్‌సీపురంలో శనివారం మధ్యాహ్నం అరగంట పాటు మోస్తరు వర్షం కురిసింది. గత వారం వ్యవధిలో మూడు దఫాలుగా వర్షం కురవడంతో ఎండవేడిమికి కొంత ఉపశమనం కలిగింది. వర్షం సమయంలో హోరుగాలి వీస్తుండటంతో వరి, మామిడి పంటలకు నష్టం వాటిల్లుతోంది. ఈ వర్షం చెరకుతోటలకు మేలు చేకూర్చిందని రైతులు అంటున్నారు. గంగిరెడ్డిపల్లి వద్ద ఇటుకలు తడిసిముద్దయ్యాయి.

టీచర్ నాగభూషణమ్మకు నివాళి


నాగభూషణమ్మ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఆరణి జగన్

తిరుపతి(ఆటోనగర్), మే 11: తిరుపతి జిల్లా బండారుపల్లిలో ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తున్న వి.నాగభూషణమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం దొడ్డాపురం వీధిలో ఆమె మృతదేహానికి పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. వారిలో తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు తనయుడు ఆరణి జగన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు ఆర్‌సి మునికృష్ణ, పొన్నాల చంద్ర, టౌన్ బ్యాంక్ మాజీ ఛైర్మన్ పులుగోరు మురళీకృష్ణారెడ్డిలతోపాటు పలుపార్టీల నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్‌లో వైసీపీ అక్రమాలను దీటుగా ఎదుర్కొంటాం: జనసేన


గ్లాజుగ్లాసు ఫ్లకార్డులను చూపిస్తున్న కిరణ్ రాయల్ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 11: తిరుపతిలో ఓటు దొంగలున్నారు జాగ్రత్త.. ఓటర్లు త్వరగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జనసేన నేత కిరణ్ రాయల్ విజ్ఞప్తి చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉదయం నిద్ర లేవగానే ఓటు వేసేందుకు వెళ్లాలనీ, ఆలస్యం చేస్తే వైసీపీ నాయకులు దొంగ ఓట్లు వేసే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. ఎన్నికల సందర్భంగా 13వ తేదీన తిరుపతిలోని అన్ని పోలింగ్ బూత్‌లవద్ద జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులు ఐక్యంగా వైసీపీ దౌర్జన్యాలను ప్రతిఘటిస్తామని పేర్కొన్నారు. కూటమి అసెంబ్లీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, పార్లమెంటు అభ్యర్థి వరప్రసాదరావుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు వరుస సంఖ్య-3లో ఓటు వేయాలని ఫ్లకార్డులు ప్రదర్శించారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు ఆకేపాటి సుభాషిణి, కోట వినూత, చంద్రబాబు, సుమన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు తీవ్రంగా కలచివేసింది!

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు

ఫటాఫట్ !

తెలుగుదేశం పార్టీ అన్నా.. అధినేత చంద్రబాబు అన్నా ఆయనకు ఎనలేని ప్రేమాభిమానాలు. వ్యాపారాలతో ఊపిరిసలపనంత బిజీగా వున్నా.. అవకాశం, తీరిక దొరికినప్పుడల్లా టీడీపీ కార్యక్రమాలకు హాజరు కావడం, కష్టపడి సంపాదించిన డబ్బులో కొంత సంతోషంగా పార్టీకి ఖర్చు పెట్టడం ఆయనకు అలవాటు. అయితే రాజకీయ కక్షతో తన అభిమాన నేతను ప్రభుత్వం అరెస్టు చేయించడం ఆయన్ను తీవ్రంగా కలచివేసింది. ఆ క్షణం నుంచే పార్టీయే సర్వస్వంగా పూర్తికాలం పనిచేయడం మొదలుపెట్టిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావుతో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ..



? బిల్డర్, వ్యాపారవేత్త అయిన మీరు చంద్రగిరి టీడీపీ రాజకీయాల్లోకి ఎందుకొచ్చారు.

! చంద్రబాబు విజన్ వున్న నేత. ఉమ్మడి రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. ప్రపంచ దేశాల పాలకుల ప్రశంసలు అందుకున్నారు. అలాంటి గొప్ప వ్యక్తి కుట్రపూరితంగా అరెస్టు కావడం కలచివేసింది. ముందే రాజకీయాలతో అనుబంధమున్నా ఈ ఘటనతో పూర్తిస్థాయిలో ఆయన వెంట నడవాలని నిర్ణయించుకున్నా. విజన్ ఉన్న బాబుతోనే అభివృద్ధి సాధ్యం. ఏపీ భవిష్యత్ బాగుంటుంది. పరిశ్రమలు పెట్టి యువతకు ఉద్యోగాలు కల్పించడం, అభివృద్ధి పరచడం బాబుకు మాత్రమే తెలుసు.

? చంద్రగిరిలో టీడీపీ పరిస్థితి ఎలా ఉంది.

! వైసీపీని రెండుసార్లు గెలిపించి తప్పు చేశామని ప్రజలు భావిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఆ తప్పు సరిదిద్దుకోవాలని ప్రజలు నిర్ణయించుకున్నారు. పులివర్తి నానీని ఎమ్మెల్యేగా, చంద్రబాబును సీఎంగా గెలిపించేందుకు అందరూ సిద్ధంగా ఉన్నారు. అభివృద్ధి చేసేవాళ్లను గతంలో ఎన్నుకోలేకపోయామనే బాధ ప్రజల్లో కనిపిస్తోంది.

? చంద్రబాబు, అరుణకుమారి వంటి వారు ప్రాతినిధ్యం వహించిన చంద్రగిరి.. అభివృద్ధిలో వెనుకబడటానికి కారణం.

! 2014-2019 మధ్య కూడా చంద్రగిరిలో అభివృద్ధి జరిగింది. నిధుల కొరత వున్నా టీడీపీ ప్రభుత్వం చెప్పుకోదగిన అభివృద్ధి చేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాకే నిధులివ్వక అభివృద్ధి స్తంభించింది. ఇక్కడి ఎమ్మెల్యేకి అభివృద్ధి చేయడం చేతకాలేదు. అందుకే తాయిలాలతో ప్రజల మద్దతు పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. చంద్రగిరి అభివృద్ధి టీడీపీతోనే వీలవుతుంది.

? చంద్రగిరిలో ఇసుక దోపిడీ, ప్రభుత్వ భూముల కబ్జాలు, గంజాయి దందా వంటివి జరగడానికి కారకులు ఎవరు.

! ఇంకెవరు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డే! ఆయన అనుచరులు, వైసీపీ నేతలు ఇష్టానుసారం ఇసుక దోపిడీకి పాల్పడ్డారు. ఎమ్మెల్యే అండదండలతోనే విలువైన ప్రభుత్వ భూములు, మఠం భూములు కబ్జాలు జరుగుతున్నాయి. వైసీపీ నాయకులు గంజాయి దందా మొదలు పెట్టడంతో చంద్రగిరిలో యువత భవిష్యత్ నాశనమవుతోంది.

? చంద్రగిరిలో ఎమ్మెల్యే చెవిరెడ్డిని ఎలా ఎదుర్కొంటారు?

చంద్రగిరి ప్రజలు ఒకసారి అవకాశమిచ్చారు. ప్రభుత్వం లేదని చెప్పుకుని ఐదేళ్లు గడిపేశారు. రెండోసారి కూడా జనం చాన్సు ఇచ్చారు. ఇపుడు అధికారం వున్నా చంద్రగిరికి ఏమీ చేయలేకపోయారు.కానీ తన కుటుంబానికి మాత్రం రూ.5వేల కోట్లు సంపాదించుకున్నారు. మూడోసారి అవకాశం ఇవ్వడానికి చంద్రగిరి ప్రజలు సిద్ధంగా లేరు.

? చంద్రగిరి పూర్వవైభవానికి, అభివృద్ధి చెందడానికీ అవకాశముందా.

! ఖచ్చితంగా ఉంది. ఈసారి 40వేల ఓట్ల మెజార్టీతో పులివర్తి నానీని గెలిపించాలని ప్రజలు నిర్ణయించుకునేశారు. చంద్రగిరి ప్రజల్లో స్వయంగా తిరిగిన అనుభవంతో చెబుతున్నా. ఎన్డీఏ ప్రభుత్వంలో చంద్రగిరికి పూర్వ వైభవం వస్తుంది. అభివృద్ధి జోరందుకుంటుంది. వైసీపీ నేతల అక్రమాలపై విచారణ, చర్యలు తప్పవు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అరాచక పాలనకు స్వస్తి చెబుదాం

● సైకిల్ గుర్తుకు ఓటు వేసి టీడీపీని గెలిపిద్దాం: పులివర్తి నాని


కొత్తశానంబట్లలో పులివర్తి నాని ప్రచారం, చంద్రగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

చంద్రగిరి, మే 11: చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని కూటమి నేతలతో కలిసి శనివారం ముమ్మరంగా ప్రచారం చేశారు. చంద్రగిరి మండలం, పాత శానంబట్ల, కొత్త శానంబట్ల గ్రామాల్లో టీడీపీ నాయకులు ముడిపల్లి సురేష్ రెడ్డి, తులసీశ్వర్‌రెడ్డి, దేవేంద్రరెడ్డి, శంకర్‌రాయల్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నానీ మాట్లాడుతూ ఓటు అనే ఆయుధంతో ఎమ్మెల్యే చెవిరెడ్డి అరాచక, దౌర్జన్య, దుర్మార్గపు పాలనకు స్వస్తి చెప్పాలని పిలుపునిచ్చారు. రెండు గ్రామాల్లో సమస్యలు గుర్తించానని, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శానంబట్ల పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు పులివర్తి నాని సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వైస్ సర్పంచ్ అరగొండ నాథమునిరెడ్డి, వార్డు మెంబర్లు గంజి బుజ్జమ్మ, ఎల్లయ్య, నాయకులు ఈశ్వర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, గుణశేఖర్, రాజ్యం మునిశేఖర్‌రెడ్డి తదితరులు పార్టీలో చేరారు. వారు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా పంచాయతీ అభివృద్ధిని విస్మరించారని ఎమ్మెల్యేపై మండిపడ్డారు. పులివర్తి నానీ మెజార్టీకి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

చంద్రగిరిలో టీడీపీ భారీ ర్యాలీ...

చంద్రగిరిలో శనివారం ఉదయం టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. పులివర్తి నానీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. చంద్రగిరిలో మూలస్థానఎల్లమ్మ ఆలయం నుంచి టవర్ క్లాక్ మీదుగా కొత్తపేట, దాసరివీధి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. చంద్రగిరి అభివృద్ధి చెందాలంటే నానీ గెలవాలని నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయం

భాకరాపేట: చంద్రగిరి నియోజకవర్గ సమగ్రాభివృద్ధే తన ధ్యేయమని టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటలో శనివారం ఆయన ఎన్నికల సభ నిర్వహించి, తన ప్రచారాన్ని ముగించారు. నానీకి భాకరాపేట కల్యాణ మండపం నుంచి గాంధీ విగ్రహం వరకు మేళతాళాలు, మంగళవాయిద్యాలు, పూల వర్షంతో ఘన స్వాగతం పలికి, ర్యాలీ నిర్వహించారు. క్రేన్‌తో గజమాల వేసి సన్మానించారు. అనంతరం భాకరాపేటలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల అభివృద్ధి కోసం పల్ప్ ప్రాసెసింగ్ యూనిట్, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేస్తామన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా కృషిచేస్తానన్నారు. వైసీపీ ప్రభుత్వం వస్తే ప్రజల భూములు కూడా ప్రజల చేతుల్లో ఉండవని, ల్యాండ్ టైట్లింగ్ జీవో ప్రతులను చించివేశారు. కార్యక్రమంలోబడి సుధాయాదవ్, దేవర మనోహర, టీడీపీ నాయకులు బెల్లంకొండ మురళీ, శివకుమార్, వైఎస్-ఎంపీపీ సునీత దామోదరం, మదన మోహన, చిట్టెమ్మ, సుజాత మోహన్, రెడ్డిసుబ్రహ్మణ్యం, ఆర్వీ రమణారెడ్డి, మునస్వామి నాయుడు, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, చంద్రమోహన్‌రెడ్డి, వెంకటరత్నం, లోకనాథం, తులసీరాయల్, మల్లిఖార్జునరెడ్డి, రెడ్డిసుబ్రహ్మణ్యం, సహదేవరెడ్డి, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.


భాకరాపేటలో మాట్లాడుతున్న పులివర్తి నాని

బంగారు తిరుచ్చిపై వెంకన్న



చంద్రగిరి, మే 11: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ నాలుగు మాడ వీధుల్లో శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. వారోత్సవాల సందర్భంగా సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు ఊంజల్ సేవను కన్నుల పండువగా నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

నారా లోకేశ్‌కు అభినందన


నారా లోకేశ్‌ను సన్మానిస్తున్న డాలర్స్ దివాకర్‌రెడ్డి

తిరుపతి రూరల్, మే 11: తిరుపతి పర్యటనకు వచ్చిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను ఆపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి శనివారం తిరుపతి ఎయిర్‌పోర్టులో మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువాతో అభినందించారు. ఈనెల13న జరిగే ఎన్నికల్లో చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీ గెలుపునకు ఐక్యంగా పనిచేస్తున్నట్లు వివరించినట్లు తెలిపారు.

కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం


ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి(కపిలతీర్థం), మే 11: తిరుపతి పార్లమెంట్ పరిధిలో అభివృద్ధికి కారణమైన కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చింతా మోహన్‌కు ప్రజలు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలించాలని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు యార్లపల్లి గోపీ అన్నారు. రాజీవ్‌గాంధీ కాలనీ పరిసర ప్రాంతాల్లో ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి శనివారం ఎన్నికల ప్రచారం చేసి, భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు భానుప్రకాష్, నాగరాజు, షేక్ జావేద్, శాంతి యాదవ్, మునిశోభ, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


అన్నపూర్ణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 11: ఎస్వీయూ హిస్టరీ పరిశోధకురాలు సి. అన్నపూర్ణ డాక్టరేట్ పొందారు. ఎమెర్జెన్స్ ఆఫ్ రీజినల్ పార్టీస్ ఇన్ ఇండియా ఎ కేస్ స్టడీ ఆఫ్ తెలుగుదేశం అనే అంశంపై ప్రొఫెసర్ విజయకుమార్‌రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు సీతః దామ్లా నాయక్ తెలిపారు.

నానీని ఎమ్మెల్యేగా గెలిపించడమే ధ్యేయం


ఐతేపల్లెలో ప్రచారం చేస్తున్న ఏవీ రమణమూర్తి

చంద్రగిరి, మే 11: రానున్న ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమని, చంద్రగిరి నియోజకవర్గంలో పులివర్తి నానీని ఎమ్మెల్యేగా గెలిపించుకోవటమే తమ ధ్యేయమని మండలంలోని ఐతేపల్లికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, టీడీపీ నేత ఏవి రమణమూర్తి తెలిపారు. తన వ్యాపారాలను పక్కనపెట్టి స్వగ్రామంలోనే తిష్ట వేసిన ఆయన ప్రతిరోజూ తన అనుచరులు, టీడీపీ కార్యకర్తలతో పంచాయతీలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. శనివారం ఐతేపల్లిలో ఆయన చేపట్టిన ఇంటింటి ప్రచారానికి ప్రజలు స్వచ్ఛందంగా పోటెత్తారు. ప్రతి ఇంటా రమణమూర్తికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. మీ వెంట మేమున్నాం అంటూ ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలు నా బాధ్యతలను మరింత పెంచుతున్నాయని, వారికి ఎల్లవేళలా అండగా ఉంటానని రమణమూర్తి తెలిపారు. సోమవారం జరుగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పులివర్తి నానీకి, ఎంపీగా దగ్గుమళ్ల ప్రసాదరావులకు సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. విజయోత్సవ సంబరాలకు సంసిద్ధమవటమే ఆలస్యమని జోస్యం చెప్పారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు విశ్వనాథం, వెంకటముని, మునిచంద్ర యాదవ్, లతీష్, రవిరావు, ఏవీఆర్ యువసేన, మహిళలు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల ముందు మందుబాబుల తోపులాట

- పోలీసుల పర్యవేక్షణలో విక్రయాలు



పాకాలలో మద్యం దుకాణాల వద్ద మందుబాబులను నియంత్రిస్తున్న పోలీసులు

పాకాల, మే 11: మండలంలోని మద్యం దుకాణాల వద్ద మద్యం కోసం రద్దీ ఎక్కువ కావడంతో తమ వరకు వస్తుందో రాదోనని మందుబాబులు ఒక్కసారిగా ఎగబడ్డారు. దీంతో పలు దుకాణాల వద్ద తోపులాట జరిగింది. పోలీసులు రంగప్రవేశం చేసి క్యూలైన్లలో వెళ్లి కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టారు. సాయంత్రం 6 గంటల వరకు ఉండాల్సి వున్నా మధ్యాహ్నానికే స్టాక్ అయిపోవడంతో మద్యం దుకాణాన్ని మూసివేశారు.

భూమనకు ఓటుతో బుద్ధి చెప్పండి

● టీడీపీ, జనసేన, బీజేపీ నేతల పిలుపు


మాట్లాడుతున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 11: భూమన అవినీతి, అక్రమ, అరాచకాలకు తిరుపతి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని కూటమి నేతలు కోరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం బీజేపీ నేత భానుప్రకాష్ రెడ్డి, టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, జనసేన నేతలు ఏఎం రత్నం, పసుపులేటి హరిప్రసాద్ తదితరులు మీడియాతో మాట్లాడుతూ.. కూటమిగెలుపుతోనే తిరుపతిలో ప్రశాంత వాతావరణం ఏర్పడుతుందని స్పష్టం చేశారు. తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్, పద్మావతిపురం ప్యాలెస్‌లో భూమన కూర్చొని ప్రజాస్వామ్యాన్ని నాశనం చేశారని విమర్శించారు. తిరుపతిని వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి అన్నివిధాలుగా నాశనం చేశారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో అడ్డదారులు తొక్కితే వైసీపీ నాయకులపై ప్రజలు తిరగబడటానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. తిరుపతి అభివృద్ధిపై వైసీపీ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. తిరుపతిలో 34 వేల దొంగ ఓట్లు సృష్టించి దొంగదారిలో గెలిచేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అసెంబ్లీ, పార్లమెంటు అభ్యర్థులు ఆరణి శ్రీనివాసులు, వరప్రసాదరావును గెలిపించి భూమన అరాచకానికి అడ్డుకట్ట వేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును ఉపయోగించుకోవాలన్నారు. సమావేశంలో కూటమి నాయకులు పొనగంటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి


టీడీపీ శ్రేణులతో కలిసి ర్యాలీగా వస్తున్న ఊకా విజయ్‌కుమార్

తిరుపతి, మే11 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శనివారం ఎన్డీఏ నేతలు జేపీ నడ్డా, నారా లోకేశ్, నాగబాబు నిర్వహించిన రోడ్‌షోకు టీడీపీ సీనియర్ నేత ఊకా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున కార్యకర్తలతో ర్యాలీగా తరలి వెళ్లి హాజరయ్యారు. ఎన్డీఏ కూటమి నుంచి జనసేన తరఫున తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆరణి శ్రీనివాసులును, బీజేపీ తరఫున ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న వరప్రసాదరావును భారీ మెజారిటీతో గెలిపించాలని నినదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదవ కృష్ణ, కట్టా జయరామ్ యాదవ్, జంగం శ్రీనివాస్, మునికృష్ణ, బాలయ్య, జాఫర్, రాజయ్య, అశోక్ పాల్గొన్నారు.


తిరుపతిలో శనివారం జరిగిన రోడ్‌షోలో పాల్గొన్న టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి

హైవేలో 33 కేవీ విద్యుత్ కేబుళ్ల ధ్వంసం

- 24 గంటలు విద్యుత్ సరఫరా అస్తవ్యస్తం

తిరుపతి(ఆటోనగర్), మే 11: తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలో హైవే రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న సమయంలో రెండు 33 కేవీ విద్యుత్ కేబుళ్లు శుక్రవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో కట్ అయ్యాయి. ఈ కారణంగా గాజులమండ్యం విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సరఫరా నిలిచిపోయింది. దీంతో గాజులమండ్యం గ్రామంతో పాటు పారిశ్రామికవాడ, పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సమాచారం తెలుసుకున్న విద్యుత్ అధికారులు సంఘటనా స్థలాలకు చేరుకొని, ప్రత్యామ్నాయ మార్గంలో రాత్రి 1.30 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. పుత్తూరు డివిజన్ నుంచి వడమాలపేట మీదుగా గాజులమండ్యం సబ్‌స్టేషన్‌కు తాత్కాలికంగా సరఫరా చేశారు. శనివారం రాత్రికి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని ఈఈ కె.వాసుదేవరెడ్డి తెలిపారు. ● అలాగే తిరుపతిలో అక్కారాంపల్లి, చైతన్యపురంలో వున్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరా నిరంతరాయంగా వుండే విధంగా అన్ని చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరా నిరంతరాయంగా వుండే విధంగా ఏర్పాట్లు చేశామని ఈఈ వాసుదేవరెడ్డి తెలిపారు.

తిరుపతిని సమస్యాత్మక కేంద్రంగా మార్చిన వైసీపీ


మాట్లాడుతున్న టీడీపీ నగరాధ్యక్షుడు చినబాబు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 11: తిరుపతి పుణ్యక్షేత్రాన్ని సమస్యాత్మక కేంద్రంగా వైసీపీ మార్చిందని టీడీపీ నగర అధ్యక్షుడు చినబాబు (వట్టికుంట శంకరనారాయణ) ఆరోపించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తిరుపతిలో వైసీపీ నాయకులు దొంగ ఓట్లు విపరీతంగా చేర్చారని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ అత్యధిక దొంగ ఓట్లు కల్గిన ప్రాంతంగా తిరుపతిని గుర్తించిందని, ఎన్నికల సందర్భంగా ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా కెమెరాలు, కేంద్ర పోలీసు బలగాలను ఏర్పాటు చేసిందని చెప్పారు. దీంతో పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ నాయకుల ఆగడాలకు అడ్డుకట్ట పడుందన్నారు. తిరుపతి ప్రజలందరూ కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుపతి

'కూటమి' ప్రభుత్వంతోనే అభివృద్ధి

ఎన్డీఏ రోడ్ షోకి ర్యాలీగా వచ్చిన పులుగోరు మురళి



తిరుపతి, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ సీనియర్ నేత, టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పులుగోరు మురళీకృష్ణా రెడ్డి అన్నారు. తిరుపతిలో శనివారం ఎన్డీఏ నేతలు జేపీ నడ్డా, నారా లోకేశ్, నాగబాబు నిర్వహించిన రోడ్‌షోకు పులుగోరు ఆధ్వర్యంలో భారీగా ర్యాలీగా వచ్చి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావులను గెలిపించాలంటూ కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఊతమాకుల హేమంత్ యాదవ్, కంకణాల రజినీకాంత్, దొడ్డారెడ్డి రామకృష్ణా రెడ్డి, గెంజి సుధాకర్ రెడ్డి, ఎస్కేడీ నగర్ విజయ్, శంకర్, జగదీష్, లోకేశ్ యాదవ్, డిల్లీబాబు పాల్గొన్నారు.

ఐదుగురు సీఐలకు అనంతపురం జిల్లాలో విధులు

తిరుపతి(నేరవిభాగం), మే 11: ఐదుగురు సీఐలు జగన్మోహన్‌రెడ్డి, అమరనాథరెడ్డి, అంజుయాదవ్, వినోద్ కుమార్, శ్రీనివాసులుకు అనంతపురం జిల్లాలో ఎన్నికల బందోబస్తు విధులను కేటాయించారు. వీరంతా తిరుపతిలో వైసీపీతో అంటకాగుతున్నారని ప్రతిపక్షాల ఫిర్యాదుల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

కోదండరామాలయంలో పుష్పయాగానికి అంకురార్పణ

తిరుపతి (కల్చరల్), మే 11: కోదండరామాలయంలో ఆదివారం జరిగే పుష్పయాగానికి శనివారం సాయంత్రం అంకురార్పణ జరిగింది. ఉదయం 9 గంటలకు ఆచార్య రుత్విక్ వరణం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు సేనాపతి ఉత్సవం, 7 గంటలకు మేదినీ పూజ, మత్స్యంగ్రహణం, అంకురార్పణ జరిగింది. మే 12 ఆదివారం ఉదయం 10 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య పుష్పయాగం నిర్వహిస్తారు. ఈ వేడుకలో గృహస్తులు ఇద్దరు రూ.వేయి టికెట్టు కొని పాల్గొనవచ్చు.

తిరుపతి-కాట్పాడి మధ్య విల్లుపురం ఎక్స్‌ప్రెస్ రద్దు

తిరుపతి(సెంట్రల్), మే 11: తిరుపతి - విల్లుపురం మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు (16853-16854)ను ఈనెల 14 నుంచి 31వ తేదీ వరకు కాట్పాడి - తిరుపతిల మధ్య రాకపోకలను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయడానికి తాత్కాలికంగా రద్దు చేశామన్నారు. ప్రయాణికులు గుర్తించాలని వారు విజ్ఞప్తి చేశారు.

తిరుమలలో నేడు
భాష్యకార్ల సాత్తుమొర

తిరుమల, మే 11 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆలయంలో ఆదివారం భాష్యకార్ల సాత్తుమొర జరుగనుంది. ఈ ఉత్సవం సందర్భంగా ఈనెల మూడో తేదీ నుంచే ఉభయం సమర్పణ మొదలైంది. ఇది ఈనెల 21వ తేదీ వరకు జరుగుతుంది. రామానుజాచార్యులు జన్మించిన వైశాఖ మాస ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం సహస్రదీపాలంకారసేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఓ తిరుచ్చిపై, భాష్యకార్లవారిని మరో తిరుచ్చిపై ఆలయ నాలుగుమాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయంలో విమాన ప్రకారం చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. రాత్రి 7.30 నుంచి 9.30 గంటల వరకు భాష్యకార్ల వారి సన్నిధిలో సాత్తుమొర నిర్వహిస్తారు. ప్రత్యేక ఆభరణాలతో సళ్లింపు చేపడతారు. జీయర్‌స్వాములు, ఏకాంగులు తదితరులు పాల్గొంటారు.

అసమానతలు తొలగిపోవాలని కోరా

బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా



శ్రీవారి ఆలయం ముందు జేపీ నడ్డా

తిరుమల, మే 11 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అసమానతలు తొలగిపోయి దేశం అభివృద్ధి పథంలో పయనించాలని, ప్రజలందరూ సంతోషంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్టు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తెలిపారు. శ్రీవారిని శనివారం ఆయన దర్శించుకున్నారు. ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో శుక్రవారం ఆయన తన అనుచరులతోపాటు తిరుపతి విమానాశ్రయంలో శ్రీవాణిట్రస్టు టికెట్లను కొనుగోలుచేసి ఆలయంలోకి వెళ్లారు. దర్శనానంతరం ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో సమృద్ధ్ భారత్, సురక్షిత్ భారత్ దిశగా దేశం ప్రయాణిస్తోందన్నారు. భగవంతుడి దయ వల్ల మోదీ వంటి నాయకుడు మనకు దొరికారన్నారు. ఆయన పాలనలో దేశం మరింత సుభిక్షంగా మారాలని శ్రీవారిని కోరుకున్నట్టు చెప్పారు. అలాగే తమిళనాడు మంత్రి గణేషన్ కూడా స్వామివారిని దర్శించుకున్నారు.

భూమనా.. ఇవి నిజాలు కావా?



దివంగత ఎమ్మెల్యే వెంకటరమణ 2014లో టీడీపీ నుంచి పోటీచేసి విజయం సాధించారు. భర్త మరణానంతరం 2015లో జరిగిన ఉప ఎన్నికలో సుగుణమ్మ లక్షకుపైగా ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2019లో మళ్లీ టీడీపీ నుంచి పోటీచేసి చివరి రౌండ్ వరకు ప్రత్యర్థి కరుణాకర రెడ్డిపై ఆధిక్యత చూపి.. పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో 708 ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. అప్పటినుంచి ఐదేళ్లపాటు తిరుపతి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా వైసీపీ ప్రజా వ్యతిరేక కార్యక్రమాల పట్ల పోరాటం చేశారు. పొత్తులో భాగంగా తిరుపతి ఎమ్మెల్యే సీటు మిత్ర పక్షం జనసేనకు కేటాయించడంతో కాస్త అసంతృప్తి చెందారు. ఇరు పార్టీల అధినేతల దిశానిర్దేశంతో కొంగు బిగించి.. సమర శంఖం పూరించారు. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గెలుపు కోసం గాజు గ్లాసు చేతబట్టి గడపగడపకు తిరిగారు. కూటమిని గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచార క్రతువు ముగిసి పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టిపెడుతున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

● నా భర్తపై దాడి నిజం కాదా

1999లో ఓ సినీ నిర్మాతకు బాకీ ఇవ్వలేదన్న నెపంతో మౌర్య హోటల్లో వున్న నా భర్త వెంకటరమణపై దాడికి తెగపడింది నిజం కాదా? కరుణాకర రెడ్డిపై కేసు (ఎఫ్ఐఆర్ నెం:358/98) నమోదైంది నిజం కాదా? సెక్షన్ 147, 448, 427, 323, 506, 365ల కింద అరెస్ట్ చేసి, పోలీసులు జైలుకు పంపలేదా? 2014 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నా భర్త దివంగత వెంకటరమణ, వైసీపీఅభ్యర్థిగా భూమనకరుణాకరరెడ్డి బరిలో ఉన్నారు. జీవకోన పోలింగ్ బూత్‌లో నా భర్తపై కరుణాకరరెడ్డి దాడిచేయలేదా? మీడియాలో వార్తలు ప్రసారం కావడంతో ఆ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశాం.

● చిరంజీవిపై దాష్టీకాలు తిరుపతి ప్రజలు మరిచారనుకున్నారా

2009 ఎన్నికల్లో తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రజారాజ్యం పార్టీ తరఫున పోటీచేసిన మెగాస్టార్ చిరంజీవిపై దాష్టీకాలు తిరుపతి ప్రజలు మరిచారనుకున్నారా? పోలింగ్ ముందు రోజు కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకుని కెన్సెస్ నుంచి చిరంజీవి తిరుగుప్రయాణమవుతుండగా.. కరుణాకర రెడ్డి అనుచరులు హోటల్ ముందు నానా యాగీచేశారు. హోటల్ గదినుంచి కదలనివ్వకుండా తనిఖీల పేరుతో ఇబ్బంది పెట్టారు. దీంతో చిరంజీవి తన ప్రయాణాన్ని రద్దుచేసుకుని పోలింగ్ రోజు తిరుపతికే పరిమితమయ్యారు. దీనివల్ల కరుణాకరరెడ్డి ఫలితాల్లో భారీ మూల్యం చెల్లించుకోలేదా?

● తిరుపతిలో ఫేక్ ఎన్నికలుగా మార్చలేదా

2019లో కరుణాకర రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తిరుపతిలో జరిగిన ప్రతి ఎన్నికనూ అపహాస్యం చేయలేదా? రచ్చలు, రావిళ్లతో రాష్ట్రం ముక్కున వేలేసుకునేలా చేసింది మీరు కాదా? కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార బలంతో రౌడీమూకను దించి నామినేషన్లు వేయనీయకుండా దారుణంగా అడ్డుకోలేదా? అభ్యర్థుల బతుకుపై కొట్టి లొంగదీసుకోలేదా? నేను మున్సిపల్ కార్యాలయానికి వెళుతుంటే అందరూ చూస్తుండగానే నోటికొచ్చినట్టు దుర్భాషలాడించలేదా? నామినేషన్ పత్రాలు చించలేదా? టౌన్‌బ్యాంకు ఎన్నికల్లో ఖాతాదారులైన ఓటర్లను రానీయకుండా ఇష్టారాజ్యంగా ఓట్లేసుకుని అన్ని స్థానాలు తామే గెలిచినట్టు చంకలు గుద్దుకుని సంబరాలు చేసుకోవడం మరిచిపోయారా? తిరుపతి ఉప ఎన్నిక అయితే దొంగ ఓట్లతో పెద్ద జాతరే చేశారు. తమిళనాడు, చిత్తూరునుంచి బస్సుల్లో యాత్రకు తీసుకొచ్చినట్టు దొంగ ఓటర్లను దించి మెజారిటీ చూపించుకున్నది నిజం కాదా?. కొంతకాలం తర్వాత దొంగ ఓట్ల కుంభకోణం బయటపడడంతో దేశం మొత్తం తిరుపతి అంటే విలువలేకుండా చేసి, ఎన్నికల్లో రాళ్లదాడులకు కారణమైంది నిజం కాదా? కాలేజీ మెట్లెక్కని వైసీపీ కార్పొరేటర్లు కూడా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు వేసేలా చేసి.. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది మీరు కాదా? ఎన్ని కుయుక్తులు పన్నినా విద్యావంతులు తగిన గుణపాఠం చెప్పడంతో తోక ముడుచుకోలేదా?



శనివారం తిరుపతిలో జరిగిన ఎన్డీఏ రోడ్‌షోలో పాల్గొన్న సుగుణమ్మ తదితరులు

● వెబ్‌కాస్టింగ్‌కి మీరు కారణం కాదా

వంద శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటుకు కారణం ఎవరు? కేంద్ర సాయుధ బలగాలతో ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది? వీటన్నింటికీ కారకులు ఎమ్మెల్యే భూమన, ఆయన తనయుడు అభినయ్‌లే కదా! తిరుపతిలో గూండాలను, రౌడీలను పెంచి పోషిస్తున్నది భూమన కాదా? ఎమ్మెల్యే అంటే పదిమందికీ ఆదర్శంగా వుండాలి తప్ప ఆదాయం కోసం అడ్డదారులు తొక్కేలా వుండకూడదు. ఇలాంటి వ్యక్తులతో తిరుపతిలో ప్రజాస్వామ్యం నిలబడుతుందా? ప్రజలే ఆలోచించాలి.

● పాత్రికేయులపై దిగజారుడు వ్యాఖ్యలేంటి?

ఆంధ్రజ్యోతి, ఈనాడు పాత్రికేయులపై బహిరంగ సభల్లో టీటీడీ చైర్మన్ హోదాలో ఆయన చేసిన వ్యాఖ్యలు దిగజారుడుతనానికి నిదర్శనం. ఓటమి భయంతో ఫ్రస్టేషన్లో పాత్రికేయుల ఆత్మవిశ్వాసాన్ని, నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసే కుట్రగా కనిపిస్తోంది. అధికారంలోకి వస్తే వాళ్ల అంతు చూస్తామని బెదిరించడమేంటి. తిరుపతిలో ఇలాంటి సంప్రదాయం ఎప్పుడైనా ఉందా?

● వాటర్ ట్యాంకులు నిర్వీర్యం చేయలేదా?

గత ప్రభుత్వంలో తిరుపతిలో తాగునీటి సమస్య లేకుండా అమృత్ పథకం కింద ఏర్పాటైన వాటర్ ట్యాంకులు మరో నెలలో అందుబాటులోకి రాబోతుండగా అధికారం మారడంతో వాటిని గాలికి వదిలేయలేదా. అవి అందుబాటులోకి వచ్చివుంటే తాగునీటికి భవిష్యత్‌లో కూడా కొరత ఉండేది కాదు కదా! కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే వాటిని తిరిగి అందుబాటులోకి తీసుకొస్తాం. తిరుమల స్థానికుల సమస్యలను తీర్చడమే కూటమి ప్రధాన అజెండా.

● కూటమి అభ్యర్థులను గెలిపించండి

తిరుపతి ప్రజలను ఒక్కటే కోరుతున్నా. టీడీపీ, బీజేపీ బలరుస్తున్న జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు గాజుగ్లాసు గుర్తుపైన, ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావుకు కమలం గుర్తుపైన ఓటు వేసి గెలిపించండి. అరాచక పాలనను పారదోలండి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

చంద్రబాబును కలిసిన టీడీపీ నేతలు



తిరుపతి, మే 11 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానంతరం తిరుగుప్రయాణమైన టీడీపీ అధినేత నారా చంద్రబాబును శనివారం తిరుపతి విమానాశ్రయంలో టీడీపీ నాయకులు కలిసి వీడ్కోలు పలికారు. వీరిలో నాయకులు పనబాక లక్ష్మి, సుగుణమ్మ, నరసింహ యాదవ్, రవినాయుడు తదితరులున్నారు.

ఆరణిని కలిసిన డీఏ శ్రీనివాసులు



తిరుపతి, మే11(ఆంధ్రజ్యోతి): టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును టీటీడీ మాజీ చైర్మన్ డీకే ఆదికేశవుల నాయుడు కుమారుడు డీఏ శ్రీనివాసులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయం సాధించాలని ఆకాంక్షించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.53 కోట్లు


తిరుమల, మే 11 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.53 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 60,545 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 32,527 మంది తలనీలాలు సమర్పించారు.

ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నెంబర్లు

తిరుపతి అర్బన్: ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు ఎదురైనా టోల్ ఫ్రీ నెంబర్లకు ఫిర్యాదు చేయొచ్చని తిరుపతి నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి (ఆర్వో) అదితిసింగ్ పేర్కొన్నారు. ఇందుకోసం 18004253416, 18004253417, 18004253418 నెంబర్లను కేటాయించారని తెలిపారు. ఇవి సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం పోలింగ్ ముగిసే వరకు అందుబాటులో ఉంటాయన్నారు.

అలరించిన నగర సంకీర్తన

తిరుపతి (కల్చరల్): రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గోపినాథరెడ్డి ఆధ్వర్యంలో నగరంలో శనివారం ఉదయం 5 నుంచి 7 గంటల వరకు గోవిందరాజ స్వామి ఆలయ మాడవీధుల్లో నగర సంకీర్తన చేశారు. కె.ఎన్. రాజ, శాంబోలు హరనాథ్, నరసింహారెడ్డి, ముద్దుకృష్ణారెడ్డి, మునిరత్నమాచారి, విక్రమ్, కన్నారెడ్డి, వాసురెడ్డి, చెంగారెడ్డి, తిరుపాలాచారి, దనమ్మ, జయమ్మ, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.



భక్తులనూ బాదేశారు

"మేల్‌చాట్ వస్త్రాన్ని రూ.50 కాదు రూ.లక్ష చేయండి. అభిషేకం, వస్త్రం టికెట్లు డబుల్ కాదు ట్రిబుల్ చేయండి. నన్ను అడిగితే ఫోర్‌టైమ్స్ పెంచినా ఇబ్బంది లేదు. సుప్రభాతం రూ.2 వేలు చేయండి. తోమాల, అర్చన సేవలను రూ.5 వేలు చేయండి, కల్యాణోత్సవం కూడా రూ.2,500 నుంచి రూ.3 వేలు చేయండి. వేదాశీర్వచనం కూడా రూ.10 వేలు చేయండి, ఏం కాదు"

తిరుపతి
ఆంధ్రజ్యోతి

మార్కెట్‌లో వేలంపాటలా విని పిస్తున్న ఈ మాటలు అన్నది సాక్షాత్తూ తిరుమల తిరుపతి దేవస్థానాల చైర్మన్. 2022 ఫిబ్రవరిలో జరిగిన టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో ధరలు పెంపుపై ప్రతిపాదనను ఈవో ధర్మారెడ్డి చదివి వినిపిస్తుండగా జోక్యం చేసుకున్న అప్పటి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఉదారంగా అన్న మాటలు ఇవి. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక తిరుమల ఆధ్యాత్మిక క్షేత్రాన్ని వ్యాపారనిలయంగా మార్చేసిన తీరుకు ఇదే సాక్ష్యం. జంబో పాలకమండలిని ప్రకటించి, కోర్టు మొట్టికాయలు తిన్న తీరు అందరికీ ఎరుకే. రాజకీయ పునరావస కేంద్రంగా, ఆదాయవనరుగా టీటీడీని మార్చేశారు. ఇబ్బడిముబ్బడిగా నాయకుల పీఆర్వోలు దళారీలుగా కొండమీద దర్శనాల మార్కెట్ నడుపుతుంటారనే ఆరోపణలు ఈ ఐదేళ్లు పెరిగిపోయాయి. ఈవో ధర్మారెడ్డి అయితే అధికారిగా కన్నా వైసీపీ నాయకుడిలా వ్యవహరిస్తుంటారనే విమర్శలు హోరెత్తాయి. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి రెండోసారి చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్నాక టీటీడీ నిధులను తిరుపతికి మళ్లించిన విధానం మీదా, ఆగమేఘాలపై రూ.1500 కోట్లకు పైగా పనులకు ఆమోదం తెలపడం మీదా ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. సాధారణ భక్తులను గాలి కొదిలేసి వీఐపీలసేవలో టీటీడీ తరిస్తోంది. జగన్ గద్దెనెక్కక ముందూ, తర్వాతా టీటీడీ నిర్ణయాల్లో వచ్చిన మార్పులు.. ఎన్నికల వేళ జనంలో చర్చగా మారాయి. జగన్ బాదుడే బాదుడు కార్యక్రమాన్ని టీటీడీలోనూ కొనసాగించారు. అదెలాగో మీరే చూడండి...

వివాదాల శ్రీవాణి

శ్రీవాణి (శ్రీవేంకటేశ్వర ఆలయ నిర్మాణ ట్రస్టు) పేరుతో వీఐపీ బ్రేక్ దర్శనాన్ని కల్పించే విధానాన్ని జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 నవంబరు నుంచి ప్రారంభించారు. రోజుకు వెయ్యి నుంచి పదిహేను వందల టికెట్లు కేటాయిస్తారు. అంటే దాదాపు కోటిన్నర రూపాయలు ఈ ఒక్క దర్శనం టికెట్ల నుంచే టీటీడీకి లభిస్తోందన్నమాట. శ్రీవాణి పేరుతో గోల్‌మాల్ జరుగుతోందంటూ ప్రతిపక్షాలు తీవ్ర ఆరోపణలు చేశాయి. విచిత్రంగా నిజనిర్ధారణ కమిటీ పేరుతో తిరుపతి ప్రెస్‌క్లబ్ ఈ ట్రస్టు నిధులు సద్వినియోగం అవుతున్నాయని ఒక సర్టిఫికెట్ ఇవ్వడం విశేషం.

చంద్రబాబు పాలనలో: వీఐపీ బ్రేక్ ధర. రూ. 500. రెండు లడ్డూలు ఉచితం.

జగన్ పాలనలో: వీఐపీ బ్రేక్ రూ.500. అయితే శ్రీవాణి భక్తులకు మాత్రం అదనంగా రూ.10,000. ఒక లడ్డూ ఉచితం.

లక్ష నుంచి కోటికి ఉదయాస్తమానసేవ

ఉదయాస్తమాన సేవ అని సుప్రభాతం నుంచీ రాత్రి ఏకాంతసేవ దాకా అన్ని సేవల్లోనూ ఒక్కరోజు పాల్గొనే అవకాశం ఉండేది. 1981లో ప్రారంభించిన ఈ ఆర్జిత సేవను 1995లో ఆపేసినా అధికారికంగా రద్దు చేస్తున్నట్టు 2006లో ప్రకటించారు. అయితే మిగిలిపోయిన 531 టికెట్లను 2022 ఫిబ్రవరిలో విడుదల చేశారు. ఆ ధరలు ఎంత పెంచారో చూడండి..

చంద్రబాబు పాలనలో: టికెట్ ధర రూ. లక్ష. శుక్రవారం మాత్రం రూ. 5లక్షలు.

జగన్ పాలనలో: ఒక టికెట్టు ధర రూ. కోటి. శుక్రవారం అయితే రూ. 1.5 కోట్లు.

కల్యాణోత్సవం

చంద్రబాబు పాలనలో: రూ.1000. ఉత్తరీయం, రవిక, ఒక పెద్దలడ్డూ, వడ ఉచితంగా ఇచ్చేవారు.

జగన్ పాలనలో: రూ.1000. అయితే ఉత్తరీయం, రవిక, పెద్దలడ్డూ, వడ రద్దు చేశారు. ఒక సాధారణ లడ్డూ మాత్రమే ఇస్తారు.



వేదాశీర్వచనం

చంద్రబాబు పాలనలో: రూ.1,500.

జగన్ పాలనలో: రూ. 3000.



లడ్డూ ధరలనూ పెంచేశారు

తిరుమల భక్తులు అత్యంత పవిత్రంగా భావించి తీసుకువెళ్లేది లడ్డూ. దర్శనం తర్వాత తమ ఊళ్లకు వెళ్లి బంధుమిత్రులకు లడ్డూ ప్రసాదం పంచుతారు. ఈ ధరలను కూడా జగన్ ప్రభుత్వం పెంచేసింది.

చంద్రబాబు పాలనలో: సర్వదర్శనానికి వెళ్లే భక్తులకు రూ.10 ధరతో రెండు లడ్డూలు ఇచ్చేవారు. అదనపు లడ్డూలు కావాలంటే ఒక్కో లడ్డూ రూ.25 లెక్కన విక్రయించేవారు. అలాగే వీఐపీ బ్రేక్, రూ.300 దర్శనానికి వెళ్లేవారికి, ఆర్జితసేవలకు వెళ్లే భక్తులకు రెండు లడ్డూలు ఉచితంగా ఇచ్చేవారు. నడకమార్గంలో వెళ్లిన భక్తులకు ఒక లడ్డూ ఉచితంగా అందజేశారు. వడ ధర రూ.25. కళ్యాణం లడ్డూ ధర రూ.100, తిరుప్పావై సేవ జిలేబీ రూ.100 ఉండేది.

జగన్ పాలనలో: 2020 జనవరి 20 నుంచి టీటీడీ లడ్డూలపై సబ్సిడీని రద్దు చేశారు. దీనికి బదులుగా శ్రీవారిని దర్శించుకునే ప్రతి ఒక్కరికీ ఒక ఉచిత లడ్డూ ఇచ్చే విధానాన్ని ప్రారంభించారు. లడ్డూ ధరను రూ.25 నుంచి రూ.50కు పెంచారు. ఇతర అన్ని దర్శనాలకూ ఒక లడ్డూ మాత్రమే ఉచితం చేశారు. వడ ధర రూ100. కళ్యాణం లడ్డూ ధర రూ.200, తిరుప్పావై సేవ జిలేబీ రూ.500 చేసేశారు.

టోల్ వలిచేస్తున్నారు

తిరుమలకు ముఖద్వారమైన అలిపిరిలో టోల్‌గేట్ల ధరలను కూడా భారీగా పెంచారు. దీని కోసం 2020లో టీటీడీ బోర్డు తీర్మానం కూడా చేసింది.

చంద్రబాబు పాలనలో: కారుకు రూ.15లు. టాక్సీకి రూ.25. మిని లారీ, మినీ బస్సులకు రూ.50.

జగన్ పాలనలో: కారుకు, టాక్సీకి రూ.50, మినిలారీ, మినీ బస్సులకు రూ.100.

లాడ్జీలతో పోటీ పడేలా కాటేజీల అద్దెలు

తిరుమలకు వచ్చే భక్తులకు వసతి కల్పించడం ఒక భాగ్యంగా టీటీడీ గతంలో భావించేది. వారికి సౌకర్యాల కోసం లాభనష్టాల లెక్కలు వేయకుండా ఎంతో వెచ్చించేది. జగన్ అధికారంలోకి వచ్చాక వసతి గదుల ధరలు దారుణంగా పెంచేశారు.

చంద్రబాబు పాలనలో: పాంచజన్య, కౌస్తుభంలోని గదులు రూ.500, నందకంలో రూ. 600 ఉండేది. ఏసీ గదులు రూ. 1000. నారాయణగిరి 1,2,3 సముదాయాల్లో రూ.150. నారాయణగిరి-4లో రూ.750. కార్నర్ గదులు. రూ. 200లుండేవి. స్పెషల్‌టైప్ కాటేజీల అద్దె రూ.200 ఉండేది. అందులోనే కార్నర్ సూట్ అద్దె రూ.1,500. వీవీజీహెచ్ విశ్రాంతి భవనాల్లో గది అద్దె రూ.1,500. సామాన్య భక్తులు బస చేసే గదుల అద్దె రూ.150, రూ.200.

జగన్ పాలనలో: పాంచజన్య, కౌస్తుభం, నందకం గదులు రూ.1000కి పెంచేశారు. ఏసీ గదులు రూ.1500. నారాయణగిరి 1,2,3 సముదాయాల్లో రూ.1700.నారాయణగిరి-4లో రూ.1700. కార్నర్ గదులను ఏకంగా రూ.2,200 చేశారు. స్పెషల్ టైప్ కాటేజీల అద్దె రూ.2,200కు పెంచారు. కార్నర్ సూట్ అద్దె రూ.2,600. వీవీజీహెచ్ విశ్రాంతి భవనాల్లో గది అద్దె రూ.2,220. సామాన్య భక్తులు బస చేసే గదుల అద్దె .1,500, రూ.2,200 చేశారు.



పేదలకు పెళ్లిమండపం దూరం

టీటీడీ కల్యాణమండపాల్లో పెళ్లి చేసుకోవడం అంటే శ్రీవారి సన్నిధిలో చేసుకున్నంత పవిత్రంగా భక్తులు భావిస్తారు. అందుకు తగ్గట్టే టీటీడీ వీటి అద్దెలు కూడా అందరికీ అందుబాటులో ఉండేవిధంగా నిర్ణయించేది. తిరుచానూరుకు సమీపంలో శ్రీనివాస కల్యాణమండపాలు నాలుగు, పద్మావతీ కల్యాణమండపాలు మూడు ఉన్నాయి. జగన్ అధికారంలోకి వచ్చాక పేదలకు ఇవి అందనంతగా ధరలు పెంచేశారు. మరమ్మతులు పేరుతో, ఏసీలు పెట్టామనే పేరుతో బాదేశారు.

చంద్రబాబు పాలనలో: శ్రీనివాస కల్యాణమండపంలో 1,2 మండపాల్లో అద్దె రూ.6,490. 3,4 మండపాల్లో రూ.7,640 ఉండేవి. పద్మావతి కల్యాణ మండపాల్లో కూడా రూ.7,640 మాత్రమే అద్దె వసూలు చేసేవారు.

జగన్ పాలనలో: శ్రీనివాసలో 1,2 మండపాల అద్దెను రూ.1.18 లక్షలు చేశారు. 3,4 మండపాల అద్దెను రూ.1.41 లక్షలు చేశారు. పద్మావతిలో అద్దె రూ.1.35 లక్షలు చేశారు.



తిరుచానూరులోనూ..

తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలోనూ ఆర్జితసేవల ధరలను అమాంతం పెంచేశారు. సుప్రభాతం రూ.25 నుంచి రూ.50 చేశారు. రూ.25లున్న సహస్రనామార్చన రూ.100 చేశారు. ఏకాంత సేవను రూ.25 నుంచి రూ.50కి పెంచారు. రూ.600 ఉన్న తిరుప్పావడసేవను రూ.వెయ్యికి పెంచారు. అభిషేకానంతర దర్శనం రూ.20 నుంచి రూ.250కి పెంచేశారు.

తిరుపతిలో ఏజెంట్లకు స్థలాభావం

● అందరినీ లోపల కూర్చోబెట్టలేం: కలెక్టర్ ● బోగస్ ఓట్లు వేస్తే జైలుకు పంపుతాం: ఎస్పీ



కలెక్టర్‌లోని వెబ్‌కాస్టింగ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

తిరుపతి(కలెక్టరేట్), మే 11: తిరుపతి అసెంబ్లీ బరిలో అత్యధికంగా 46మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ అన్ని పార్టీల ఏజెంట్లు కూర్చోవడానికి స్థలాభావం ఉంటుంది. అందువల్ల జాతీయ పార్టీలు, గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీల అభ్యర్థుల ఏజెంట్లను మాత్రమే కేంద్రంలో కూర్చోబెడతాం. మిగిలినవారు వెలుపల కూర్చొనేలా ఏర్పాట్లు చేస్తున్నాం. దీనికి అభ్యర్థులందరూ సహకరించాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లో శనివారం ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. సోమవారం జిల్లాలోని 2,140 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటు హక్కు సజావుగా వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చంద్రగిరి, తిరుపతిలో వందశాతం వెబ్‌కాస్టింగ్ ఉంటుంది. మిగిలిన నియోజకవర్గాల్లో అత్యంత సమస్యాత్మకమైన 1,401 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నాం. 888 కేంద్రాల్లో వీడియోగ్రఫీ ఆధ్వర్యంలో పోలింగ్ ప్రక్రియ జరుగుతుంది. 964 మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తారు. బయటప్రాంతాల నుంచి ఎన్నికల ప్రచారానికి వచ్చిన నేతలు జిల్లా వదిలి వెళ్లిపోవాలి. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు ఎన్నికల సిబ్బంది అడిగినప్పుడు దర్శన టికెట్లు చూపించి, సహకరించాలి. పోలింగ్ రోజు సాయంత్రం ఆరు గంటల వరకు ఎవరైతే క్యూలో ఉంటారో ఆఖరు వ్యక్తి వరకు ఓటు వేసేలా చూస్తాం. ఓటరు లిస్టులో పేరుండి స్లిప్ అందని వారు ఎపిక్ కార్డు లేదా ఎన్నికల కమిషన్ సూచించిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదైనా తీసుకొచ్చి ఓటు వేయవచ్చు. పోలింగ్ ముగిశాక ఈవీఎంలను పద్మావతి మహిళా వర్సిటీ స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరుస్తాం. ఫిర్యాదులుంటే 1950 టోల్‌ఫ్రీకి ఫిర్యాదు చేయాలని కలెక్టర్ వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ కేంద్ర బలగాలతోపాటు ఐదువేలమంది రాష్ట్ర పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. రాజకీయ పార్టీల నేతల మాటలు విని యువత బోగస్ ఓట్లు వేయడానికి ప్రయత్నించినా, శాంతి భద్రతలకు విఘాతం కల్గించినా జైలుకు పంపుతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లోని వెబ్‌కాస్టింగ్ కంట్రోల్ రూమ్ పరిశీలించారు. సమావేశంలో డీఆర్వో పెంచలకిషోర్, ఎన్నికల సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అంతటా 144 సెక్షన్

ప్రచారపర్వం శనివారం సాయంత్రంతో ముగిసింది. జిల్లా అంతటా 144 సెక్షన్ అమల్లోకి వచ్చింది. 18,12,980 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. తిరుపతి పార్లమెంటుకు 23మంది, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 133మంది బరిలో ఉన్నారు. పోలింగ్ విధుల్లో 14,769 మంది పీవో, ఏపీవోలు, సిబ్బంది ఉన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం నుంచి పోలింగ్ ముగిసే సోమవారం సాయంత్రం మద్యం అమ్మకాలను నిషేధించారు. దీంతో బార్లు, మద్యం దుకాణాలు మూతపడ్డాయి.

రాజకీయ పార్టీలు సహకరించాలి

జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ కోరారు. శనివారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీలప్రతినిధులు, అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఆదివారం ఉదయంకల్లా సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో విధుల్లో హాజరు కావాలన్నారు. హాజరు కానివారికి క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేంద్ర బలగాల నీడలో తిరుపతి ఎన్నికలు

తిరుపతి(నేరవిభాగం), మే 11: తిరుపతిలో వారం క్రితమే భారీ ఎత్తున బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్ బలగాలు ఎన్నికల విధుల్లో మోహరించాయి. తాజాగా తమిళనాడు నుంచి ఐదుగురు ఎస్ఐలు, దాదాపు 40 మంది పోలీసులు, వీరితో పాటు అప్పాలో శిక్షణ పొందుతున్న డీఎస్పీ రాజసింహ, శిక్షణ ఎస్ఐలను ఎన్నికల విధులకు రప్పించారు. అడ్డదారుల్లో బోగస్ ఓట్లు వేయడానికి వస్తే వీరు వెంటనే గుర్తించి అరెస్టు చేస్తారు. తొలిసారిగా తిరుపతి నియోజకవర్గాన్ని సమస్యాత్మకంగా కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించడంతో సీఆర్‌పీఎఫ్ బలగాల మధ్య ఎన్నికలు జరుగనున్నాయి.

శ్రీకాళహస్తిలో కానరాని పోలింగ్ ఏర్పాట్లు

శ్రీకాళహస్తి, మే 11: శ్రీకాళహస్తి పట్టణంలో శనివారం రాత్రి వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు కనబడలేదు. రెండు రోజుల ముందే అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాల్సి ఉంది. శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలో 68 పోలింగ్ కేంద్రాలున్నాయి. 46వ నెంబర్ పోలింగ్ కేంద్రం నుంచి 113 వరకు మున్సిపల్ పరిధిలో ఉన్నాయి. పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి. అలాగే పకడ్బందీగా సౌకర్యాలను కూడా కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఇందుకోసం పెద్దఎత్తున నిధులను కూడా ముందుగానే విడుదల చేస్తుంటారు. మూడు రోజుల ముందు నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను చేపట్టాలి. ఇందులో భాగంగా ప్రధానంగా పోలింగ్ కేంద్రం వద్ద వాహనాలు నిలిపేందుకు 200 మీటర్ల దూరంలో మార్కింగ్. ఆ తర్వాత ఓటర్లు మాత్రమే లోపలికి ప్రవేశించేలా వంద మీటర్ల దూరంలో మరో మార్కింగ్ చేయాలి. ఇక స్థానికులు రాకపోకలు సాగించేందుకు వీలుగా ప్రత్యేక మార్గాన్ని కేటాయించాలి. ఓటర్లు రాకపోకలు సాగించేందుకు, అల్లర్లు జరగకుండా బారికేడ్లు పకడ్బందీగా ఏర్పాటు చేయాలి. పోలింగ్ కేంద్రం లోపల ఉద్యోగులు ముందు రోజు రాత్రి బస చేసేందుకు వీలుగా వసతి, తాగునీరు, మరుగుదొడ్లు, గదులు కల్పించాలి. పోలింగ్ విధుల్లో ఉన్న ఉద్యోగులు అనారోగ్యానికి గురికాకుండా పరిశుద్ధమైన నీరు, మంచి నాణ్యమైన ఆహారం ఏర్పాటు చేయాలి. అలాగే పోలింగ్ కేంద్రంలో సమృద్ధిగా గాలి, వెలుతురు ఉండేలా ఫ్యాన్లు, లైట్లు సరిచూసుకోవాలి. కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. వాటి పర్యవేక్షణ కోసం వైఫై సిగ్నల్ సరిచూసుకొని పక్కాగా సెట్ చేసుకోవాలి. మహిళలు, పురుషుల ఓటర్లు వేర్వేరుగా ప్రవేశించేలా విధిగా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలి. ఎండ తీవ్రత దృష్ట్యా.. పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్యను బట్టి నీడ కల్పించేలా పందిర్లు ఏర్పాటు చేయాలి.పోలింగ్ కేంద్రం అవసరాన్ని ఏర్పాట్లు పక్కాగా ముందుగానే సిద్ధం చేసుకోవాలి. అయితే శ్రీకాళహస్తి పట్టణంలో చాలా పోలింగ్ కేంద్రాలు శనివారం రాత్రి కూడా కనీస ఏర్పాట్లు లేకుండానే దర్శనమిచ్చాయి.

'ఎన్డీఏ' రోడ్ షో సక్సెస్



తిరుపతి, మే 11 (ఆంధ్రజ్యోతి):ఎన్డీఏ కూటమి నేతలు శనివారం తిరుపతిలో చేపట్టిన రోడ్‌షో విజయవంతమైంది. జ్యోతిరావ్ పూలే విగ్రహం నుంచి ర్యాలీగా సాగిన రోడ్‌షో నాలుక్కాళ్ల మండపం వరకు చేరుకుంది. అక్కడ ప్రజలనుద్దేశించి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మాట్లాడుతూ తిరుపతిలో మీ ఉత్సాహం, ఆనందం చూస్తుంటే ఎన్డీఏ కూటమి విజయం తథ్యమనిపిస్తోందని చెప్పారు.ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌కు కమలం గుర్తుపై, ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మాట్లాడుతూ 2014లో నరేంద్ర మోదీ ప్రధానిగా, తాను ఐటీ మంత్రిగా ఉన్నప్పుడు అనేక ఐటీ కంపెనీలు తిరుపతికి తీసుకొచ్చానన్నారు. ఇదే తిరుపతి కేంద్రంగా 50వేల మంది ఇక్కడి పరిశ్రమల్లో పనిచేస్తున్నారని, 2019లో రాయలసీమ బిడ్డ అంటూ వచ్చిన జగన్ రెడ్డి అమరరాజ వంటి కంపెనీలను ఇబ్బంది పెట్టి కొత్త ప్రాజెక్టును తెలంగాణకు పంపించేశారన్నారు. భూమన కుటుంబానికి కమీషన్ ఇస్తే కానీ ఏ పని జరగని పరిస్థితి వుందని, పెద్ద దొంగ కన్నా చిన్నదొంగ ముదురు అన్నట్టు.. తిరుపతిలో చిన్నదొంగకు అధికారమిస్తే తిరుపతి, తిరుమలను అమ్మేస్తాడన్నారు.యువగళంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే బాధ్యత తనదేనన్నారు.జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు మాట్లాడుతూ తమ అవినీతిపై దమ్ముంటే విచారణ చేసుకోవచ్చని టీటీడీ చైర్మన్ కరుణాకర రెడ్డి, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అభినయ్ రెడ్డి ఆవేశపడుతూ చాలెంజ్‌లు విసురుతున్నారని, త్వరలోనే వారి ముచ్చట తీరుస్తామన్నారు. ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ అవినీతిపరుల అంతు చూస్తామన్నారు.కొండపైన తండ్రి, కింద కుమారుడు కమీషన్ల రూపంలో రూ.వేల కోట్లు నొక్కేశారన్నారు. ఒక్క టీడీఆర్ బాండ్లతోనే రూ.2వేల కోట్లు దోచేశారని ఆరోపించారు.పోలింగ్ ముందు రోజు రాత్రి వైసీపీ అనేక కుట్రలకు పాల్పడే అవకాశం ఉందన్న ఆయన చెప్పులతో కొట్టి తరమండని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తిరుపతి మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ దొడ్డారెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి బీజేపీలో చేరారు.టీడీపీ నేతలు సుగుణమ్మ, నరసింహ యాదవ్, బీజేపీ నేతలు బానుప్రకాష్ రెడ్డి, సామంచి శ్రీనివాస్, డాక్టర్ శ్రీహరిరావు, జనసేన నాయకులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జన కేతనం

ఒక బీరుపై ఐదేళ్లలో బాదింది రూ.1.80 లక్షలు

టీడీపీ హయాంలో గరిష్ఠంగా ఓ బీరు ధర (మంచి బ్రాండు) రూ.120 వరకు ఉండేది. ప్రస్తుతం బీరు రూ.220. అదీ నాసిరకం బ్రాండ్లు. అంటే రూ.వంద పెరిగింది. రోజుకు ఒక బీరు తాగే వారిపై నెలకు రూ.3 వేలు, ఏడాదికి రూ.36 వేలు, వైసీపీ అధికారంలో ఉన్న ఈ ఐదేళ్లలో రూ.1.80 లక్షలు గుంజేశారు. ఎక్కువ మంది యువకులు బీరు ప్రియులు. రెండు మూడు బీర్లు తాగేవాళ్లూ ఉంటారు. వీరి నుంచి మరింత అదనగా లాగేశారన్న మాట.

ఒక్కో శ్రమజీవి నుంచీ గుంజింది రూ.2.88 లక్షలు

కార్మికులు, కూలీలు.. ఇలా శ్రమ జీవులు ఎక్కువ మంది చీప్‌లిక్కర్ తాగుతుంటారు. టీడీపీ హయాంలో చీప్ లిక్కర్ ఓ క్వార్టర్ బాటిల్ రూ.50 ఉండగా.. ఇప్పుడది రూ.130కు పెరిగింది. అంటే రూ.80 పెంచారు. సగటున రెండు క్వార్టర్ల తాగుతారు. అంటే రోజుకు రూ.160 చొప్పున, నెలకు రూ.4,800, ఏడాదికి రూ.57,60 చొప్పున ఐదేళ్లలో రూ.2.88 లక్షలు అదనంగా జగన్ ప్రభుత్వం గుంజేసింది. రోజువారి కూలి సంపాదన రూ.600 రూ.800 మధ్యలో ఉంటుంది. అందులో సగం ఇలా నాసిరకం మద్యానికే పోతోంది. ఇలా శ్రమజీవుల కష్టాన్నీ దోచేశారు.


మధ్యతరగతినీ వదల్లేదు

మధ్యతరగతి వాళ్లు, ఉద్యోగుల్లోని మద్యం ప్రియులు .. సరదాగా మంచి బ్రాండ్లను సగటున రోజుకో క్వార్టర్ తాగేవాళ్లు ఉన్నారు. బ్లెండర్స్ ప్రైడ్, మ్యాన్షన్ హౌస్, కొరియర్ నెపోలియన్ వంటి బ్రాండ్లను ఎక్కువగా ఇష్టపడతారు. టీడీపీ హయాంలో వీటి ధరలు రూ.220, రూ.120, రూ.160.. చొప్పున ఉండేవి. ఇప్పుడవే ధరలు రూ.300, రూ.220, రూ.280గా ఉన్నాయి. అంటే ప్రతిదాని మీదా సగటున రూ.100 పెరిగింది. రోజుకు వంద చొప్పున నెలకు రూ.3 వేలు, ఏడాదికి రూ.36 వేలు.. ఈ ఐదేళ్లలో రూ.1.80 లక్షలు నష్టపోయారు.

- ఈ మూడు వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ఎంత లబ్ధి చేకూర్చిందో గానీ.. ఆ ఇళ్లల్లోని ఒక్కో మందుబాబు నుంచి మాత్రం రూ.లక్షకు పైగా లాగేసింది. ఈ ప్రభుత్వం వారికి చేసిన మేలెంత? చేటెంత? అనేది మందుబాబులు.. వారి కుటుంబాలే చెప్పాలి.

జగనన్న మద్యంతో ఇళ్లు.. ఒళ్లు గుల్ల

● చెప్పిందే రేటు.. ఇచ్చిందే బ్రాండు



అధికారంలోకి వచ్చాక జగన్ తీసుకొచ్చిన మద్యం పాలసీ మందుబాబుల ఇళ్లను.. ఒళ్లను గుల్ల చేస్తోంది. గతానికి భిన్నంగా ప్రభుత్వమే మద్యం దుకాణాలను ఏర్పాటు చేసింది. క్వాలిటీ బ్రాండ్లు కాదని.. కొత్త కొత్త పేర్లతో నాసిరకం మద్యాన్ని తీసుకొచ్చారు. వీటిని 'జే' బ్రాండ్లుగా ప్రతిపక్షాలు విమర్శిస్తుంటాయి. మరోవైపు మద్య వినియోగం తగ్గించేందుకని సాకు చెప్పి.. విపరీతంగా ధరలు పెంచారు. రానున్న 20 ఏళ్లలో మద్యం తాగేవారిపై వచ్చే ఆదాయాన్ని చూపి అప్పు తీసుకొచ్చారు. తాము చెప్పిందే రేటు.. ఇచ్చిందే మద్యం బ్రాండుగా వ్యవహరించారు. అన్ని వర్గాల ప్రజల్లాగే.. మందుబాబులనూ జగన్ బాదేశారు.

జిల్లాలో 113 ప్రభుత్వ మద్యం దుకాణాలు, పది బార్లు, రెండు ఎలైట్ స్టోర్లు ఉన్నాయి. నిత్యం రూ. 2 కోట్ల వరకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఏడాదికి రూ.700 కోట్లకుపైగా ఆదాయం వస్తోంది. దుకాణాల సంఖ్య తగ్గించిన ప్రభుత్వం ధరలు బాగా పెంచింది. గత టీడీపీ ప్రభుత్వంలో రూ.50 ఉన్న క్వార్టర్ మద్యం సీసా ధర ఏకంగా రూ.150కు పెంచేశారు. ఆదాయం పెంచాలనే ఉద్దేశంతో ఎక్సైజ్ శాఖ కూడా అనధికారికంగా బెల్టు షాపులను ప్రోత్సహించింది. చాలా గ్రామాల్లో చిల్లర దుకాణాలు, టీదుకాణాలు, కూల్ డ్రింక్ షాపుల్లో 24 గంటలూ మద్యం అందుబాటులో ఉంటోంది. వీటి వెనుక వైసీపీ నేతలు ఉన్నారు. వీరంతా మద్యం బెల్టు షాపులను అక్రమార్జనగా ఎంచుకున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లు వైసీపీ నేతలు సిఫార్సు చేసిన వారే కావడంతో బెల్టు షాపులకు కావాల్సినంత మద్యం సరఫరా చేస్తున్నారు. మద్యం దుకాణాలవద్ద సీసీ కెమెరాలు, డిజిటల్ పేమెంట్లు అలంకారప్రాయంగా ఉన్నాయి. మద్యం అమ్మకాలు పెరిగి ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూరుతుండటంతో ఎక్సైజ్, ఎస్‌ఈబీ అధికారులు బెల్టు షాపుల విషయంలో పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. కర్ణాటక, తమిళనాడు మద్యం విక్రయిస్తే మాత్రం చర్యలు తీసుకుంటున్నారు.

మద్యపానంపై అవగాహన కార్యక్రమాలేవి ?

మద్యం తాగడం వల్ల తలెత్తే అనర్థాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమలను ప్రభుత్వం చేపట్టలేదు. మద్యానికి బానిసలుగా మారిన వారికోసం.. మద్యం తాగే అలవాటు మాన్పించేందుకు డీ అడిక్షన్ కేంద్రాలు పెట్టలేదు.

- చిత్తూరు సిటీ

ఇదీ చంద్రబాబు మాట

గతంలోలాగే బ్రాండెడ్.. నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం. ధరలను తగ్గిస్తాం. మందుబాబులకు అవగాహన కార్యక్రమాలతో పాటు డీ అడిక్షన్ సెంటర్లను ప్రారంభిస్తాం.

ఓటెలా అడుగుతున్నావ్ జగన్..!

మూడు విడతల్లో మద్యం దుకాణాలు తగ్గించుకుంటూ పోతాం. మందు ముట్టుకుంటేనే షాక్ కొట్టేలా ధరలు పెంచుతాం. ఆపై పూర్తిగా మద్యాన్ని ఎత్తేస్తాం. మద్యపాన నిషేధం చేశాకే 2024లో ఓట్లు అడగతా.

- ఇది 2019 ఎన్నికల ప్రచారంలో అక్క చెల్లెమలకు ప్రతిపక్ష నేత జగన్ ఇచ్చిన హామీ.

అధికారంలోకి వచ్చాక..: మద్య నిషేధం చేయలేదు. తాము చెప్పింది మద్య నిషేధం కాదని.. నియంత్రణ అంటూ వైసీపీ నేతలు బుకాయించారు. క్షేత్రస్థాయిలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. ఎక్సైజ్, ఎస్‌ఈబీ అధికారులూ అమ్మకాల లెక్కలు చెప్పడం లేదు. టీడీపీ పాలనలో కన్నా ఇప్పుడే ఎక్కువ మద్యం వ్యాపారం జరిగిందనే విషయం బయటపడుతుందనే ఇలా చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

జే బ్రాండ్లతో పేదల బతుకులు ఛిద్రం

ఐదేళ్లలో 12508 మంది కాలేయ బాధితులు

వందలాది మంది మృత్యువాత

● చిత్తూరు రూరల్ మండలానికి చెందిన కస్తూరి భర్త కుమార్ పెయింటర్. వీరికి ఇద్దరు చిన్న పిల్లలు. మద్యానికి బానిసైన కుమార్ రెండేళ్ల కిందట ప్రాణాలు కోల్పోయాడు. దీంతో కుటుంబ పోషణ అమెపై పడింది. దీంతో తాపీ కూలిగా పనిచేస్తూ పిల్లలను చూసుకుంటోంది. నాసిరకం మద్యం అమె కుటుంబాన్ని రోడ్డున పడేయగా...ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదు.

● గుడిపాల మండలానికి చెందిన రోసి మూడేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకుంది. భర్త శ్యామ్ ప్లంబర్‌గా పనిచేసేవాడు. క్రమేణా శ్యామ్ మద్యానికి బానిసయ్యాడు. లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆరు నెలల కిందట మృతిచెందారు. వీరికి ఒకటిన్నరేళ్ల పాప ఉంది.

జగన్ ప్రభుత్వంలో వైసీపీ నేతలు సొంత బ్రాండ్లతో మద్యాన్ని తీసుకొచ్చారు. నాణ్యత పాటించకుండా.. నిరుపేదల ఆరోగ్యంతో ఆటలాడుతున్నారు. నాసిరకం మద్యానికి బలైపోయిన ఎన్నో కుటుంబాలు నేటికీ తేరుకోలేకపోతున్నాయి. ఒక్క చిత్తూరు నియోజకవర్గంలోనే పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున మరణాలు సంభవించినా వేరే కారణాలను చూపిస్తున్నారు.

ఐదేళ్లుగా కాలేయ, కిడ్నీ వ్యాధితో చికిత్స తీసుకున్న.. తీసుకుంటున్న వారి వివరాలు

సంవత్సరం	బాధితులు
2020	2550
2021	2700
2022	3200
2023	3700
2024 ఇప్పటి	వరకు358
మొత్తం	12508

పెరిగిన కాలేయ బాధితులు

నాసిరకం మద్యం కారణంగా ఆరోగ్యం దెబ్బతిని ఆస్పత్రులుకు వెళ్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఒక్క చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలోనే ఐదేళ్లలో 12508 మంది చికిత్స పొందారు. బాధితులు తొలుత జీర్ణకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. ఆపై పేగుల్లో పుండ్లు ఏర్పడుతున్నాయి. చివరిగా కాలేయం దెబ్బతిని మరణాలు సంభవిస్తున్నాయి. నాసిరకం మద్యం తాగినవారిలో సున్నితమైన కాలేయం గట్టిపడి పూర్తిగానిర్వీర్యమవుతోన్న కేసులు ఎక్కువగా వస్తున్నాయి. చికిత్స కోసం వేలాది రూపాయల ఖర్చులతో అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

ప్రాణాలు కోల్పోయే ప్రమాదం

'మద్యం తాగడం వల్ల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుంది. కల్తీ, నాసిరకం మద్యం తాగడం వల్ల పేగుల్లో పుండ్లు ఏర్పడుతున్నాయి. ఇలాంటి కేసులు ఇక్కడ చాలానే చూశాను. పుండ్లతో మొదలై క్రమంగా మిగిలిన అవయవాలైన కాలేయం, కిడ్నీ దెబ్బతినడమే కాకుండా గుండె పోటుకు గురయ్యే అవకాశం కూడా ఉంది' అని చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలోని ఓ వైద్యుడు తెలిపారు.

- చిత్తూరు రూరల్

వెల్లువలా కర్ణాటక మద్యం

● బెల్టు షాపులకు డోర్ డెలివరీ
● అధికార పార్టీ అండతో పేట్రేగిపోతున్న మాఫియా

మనకు నాణ్యమైన మద్యం బ్రాండ్లు లేకపోవడం.. అధిక ధరలు.. దీంతో సరిహద్దులోని మందుబాబులు కర్ణాటక మద్యానికి అలవాటు పడ్డారు. దీన్ని ఆసరాగా చేసుకుని వైసీపీ నేతలు, వారి మద్దతుదారులు కర్ణాటక నుంచి మద్యాన్ని తీసుకొచ్చి.. బెల్టు షాపులకు డోర్ డెలివరీ చేస్తున్నారు. ఇక్కడ అధిక ధరలకు (ఇక్కడి ధరలతో పోలిస్తే తక్కువ) విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల రామకుప్పం మండలానికి చెందిన అధికార పార్టీ నేత కారులో కర్ణాటక మద్యం బాక్సులను పోలీసులు పట్టుకున్నారు. చాలా కాలంగా వీరు బెల్టు దుకాణాలకు మద్యం డెలివరీ చేస్తున్నట్లు విచారణలో నిందితులు అంగీకరించారు. అధికార నేతను పోలీసులు రిమాండుకు తరలించారు. ఐదేళ్లలో వి.కోట అర్బన్ స్టేషన్‌లోనే ఏడాదికి 30కిపైగా మద్యం అక్రమ తరలింపు కేసులు నమోదు కావడం గమనార్హం. కార్లతో పాటు ద్విచక్ర వాహనాల్లోనూ తరలిస్తూ పట్టుబడిన వారు కొందరైతే, తప్పించుకున్న వారు మరెందరో?

పోలీసులు సీజ్ చేసిన అక్రమ మద్యం (ఫైల్ ఫోటో)



సరిహద్దులో 20కిపైగా మద్యం దుకాణాలు

వి.కోట మండలానికి మూడు వైపులా కర్ణాటక సరిహద్దు ఉంది. మన జిల్లాలో ఉన్న డిమాండుతో సరిహద్దుల్లో 20కి పైగా వైన్ షాపులు, బార్లు పుట్టగొడుగుల్లా పుటుకొచ్చాయి. ఆ రాష్ట్రంలోని మూలనున్న దుకాణాలను అధిక ధరలకు కొని.. వాటిని షిఫ్టింగ్ పేరిట వి.కోట సరిహద్దుల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఇలా పత్రపల్లె సమీపంలోని కేజీఎఫ్ మార్గంలో రెండు, కుప్పం మార్గంలో దాసార్లపల్లె వద్ద నాలుగు, ఇటుకరాళ్లపల్లె గ్రామీణ మార్గంలో ఓ బార్, గంధారమాకుల పల్లె సమీపంలో ఓ దుకాణం ఉంగా.. ఇటీవల మరో బార్ అండ్ రెస్టారెంట్ ప్రారంభమైంది. ఇక, తోటకనుమ పంచాయతీకి సమీపంలో ముళబాగల్ రోడ్డులో మన సరిహద్దులోనే రెండు బార్లు, మరో రెండు వైన్ షాపులు వెలిశాయి. కొంగాటం పంచాయతీకి అనుకుని రాజుపేటరోడ్డులో రెండు మద్యం షాపులు, మూడు బార్ అండ్ రెస్టారెంట్లు నడుస్తున్నాయి.

- వి.కోట

ఇదీ మందు



దేవుడిమీద ప్రమాణం చేసే..!

పంపకాలు మొదులైనప్పుటినింకా కుప్పంలో అతికార పార్టీ వోల్లు దేవుళ్ల పటాలు పెట్టుకోని తిరగతా వుండారంట. 'మాకే ఓటేస్తామని దేవుడిమింద ప్రెమాణం జెయ్యండి. అనాక కాసులు తీసుకోని ఎల్లండి' అని షరతు పెట్టావుండారంట. చేసేదే పాపం పని. ఇంగ దేవుడిని గూడా ఈ పాపంలోకి ఎందుకు లాగాల.. అనుకున్న ఓటర్లు శానామంది ప్రెమాణం చెయ్యకుండానే ఒట్టి చేతుల్తో ఎనక్కి ఎల్లిపోతావుండారంట. మిగిలినోల్లు మాత్తరం, 'అ.. ఎవురికేస్తే ఏంది? ఆ దేవుడు దిగొచ్చి చూడబోతాడా, లేకపోతే కొట్టబోతాడా?' అనేసి ప్రెమణాలు సేసేసి, కాసులు తీసుకుంటా వుండారంట.

- కుప్పం

'సగం' తంటాలు!

● ఎట్టెట్టా!

'ఈ సగం సగం బతుకులేంట్రా సామీ..' అంటా అధికార పార్టీ కార్యకర్తలు కుమిలిపోతా వుండారు కుప్పంలో. ఎందుకంటే.. ఓటుకు నాలుగు ఎయ్యిలు లెక్కన పక్కా లెక్కగట్టి ఇస్తావుండారు వోల్లు. నిన్నమొన్నటిదాకా అందరికీ అయిదు ఎయ్యిలు తక్కవ కాకుండా పంచతారని తెగ ప్రెచారం జరిగిపొయ్యింది. తీరా మొదులు పెట్టినాక నాలుగు ఎయ్యిలకు దిగింది. 'సరే లేప్పా.. ఎంతో అంత, ఇట్టా పారెయ్యి' అంటా జనం సర్దుకొనే టయానికి, ఆ ఇచ్చేది సగం మందికే అనే ఇసయం బయటపడి రచ్చరచ్చ అయిపోతా వుండాది. ఒగింట్లో ముగ్గురు మొనుసులుంటే మూడు పార్టీలల్ల తిరగతా వుండారాయె. అతికార పార్టీ ఆ ఇంటికి ఎల్లి తమ పార్టీ మనిషికే కాసులు ఇస్తామంటే ఇనడంలేదు మిగిలిన ఇద్దురూ. మొన్నటికిమొన్న కుప్పం మున్సిపాలిటీలో ఇద్దురు అన్నదమ్ములుంటే ఒకరికి కాసులిచ్చారంట. ఆ రొండో మనిషి అగ్గిమీద గుగ్గిలమైపొయ్యి ఆ వొచ్చినవోల్లపై తిరగబడినారంట. ఊరూవాడా ఇదే గొడవలు. ఓటింగు దగ్గర పడే కొందికీ, 'మనోడికి డిపాజిట్టు అయినా దక్కతాదో లేదో'నని వాల్ల నాయకులకు గుండిల్లో దిగులు పడిపాయె. ఇగ, ప్రెతిపెచ్చ పార్టీ పంచేది, అతికార పార్టీవోల్లు పంచే కాసుల్లో సగమే అయినా గొడవలు లేకుండా జరిగిపోతా వుండాది. ఈల్లు కనాకస్టం 70 నుంచి 80 పర్సంటు ఓటర్లకు పంచతా వుండారంట. 'పాపం.. అతికారంలో లేరు గదా..' అనేసి జనం గూడా ఏమనడం లేదు. సెంద్రబాబును గాకుండా ఇంగెవురిని గెలిపించుకున్నా ఈసారి మనకు పుట్టగతులుండవని, ఆ మిగిలిన మంది గూడా గమ్మున ఉండిపోతా వుండారంట.

- కుప్పం




ఓటు వేయాలంటే 'గుర్తింపు' తప్పనిసరి

● నోట్ దిస్ పాయింట్

పోలింగ్ కేంద్రాల్లో ఓటేయాలంటే ఓటరు స్లిప్పులతో పాటు గుర్తింపు కార్డును ఓటర్లు చూపాలి. ఓటరు గుర్తుంపు కార్డు ఉంటే సరిపోతుంది. లేదంటే పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేదా ప్రభుత్వ రంగ సంస్థలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు, ఆయా సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు జారీచేసిన ఫోటో గుర్తింపు కార్డులు, బ్యాంకు లేదా పోస్టాఫీసులు జారీ చేసిన పాస్‌బుక్‌లు, పాన్‌కార్డు, కార్మికశాఖ జారీ చేసిన స్మార్ట్ కార్డు, ఉపాధి హామీపథకం జాబ్‌కార్డు, కార్మికశాఖ జారీచేసిన ఆరోగ్య బీమా కార్డు, ఫొటోతో పాటు ఉండే పెన్షన్ డాక్యుమెంట్, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు అధికారికంగా జారీచేసే గుర్తింపుకార్డు, ఆధార్ కార్డు, సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ మంత్రిత్వ శాఖ జారీచేసిన యూనిక్ డిసేబిలిటీ ఐడీ కార్డులో ఏదో ఒకటి ఉంటే చూపితే చాలు.

- చిత్తూరు కలెక్టరేట్



నారా చంద్రబాబునాయుడు (టీడీపీ)

బాబు మెజారిటీ ఎంత?

● కుప్పంలో ఈ దఫా లక్ష ఓట్ల ఆధిక్యం కోసం టీడీపీ ప్రణాళికలు ● ప్రశాంత నియోజకవర్గంలో ఐదేళ్లుగా వైసీపీ ధ్వంస రచన
● చంద్రబాబు చేసిన అభివృద్ధి ఆనవాళ్లు లేకుండా చేసే యత్నం ● టీడీపీ కేడర్‌ను కకావికలం చేసే ఎత్తులు
● వందల మంది కార్యకర్తలపై అక్రమ కేసులు ● అంతా మంత్రి పెద్దిరెడ్డి పెత్తనమే ● స్వేచ్ఛ లేని వైసీపీ అభ్యర్థి భరత్

కీలకం

కుప్పం.. పరిచయమే అక్కర్లేని నియోజకవర్గం.. 1989 నుంచి టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబును అప్రతిహతంగా గెలిపిస్తూ వస్తున్నారు. ఈసారి ఇక్కడ ఆయన విజయం గురించి కాకుండా ఆయనకు ప్రజలిచ్చే మెజారిటీ ఎంత అనే అంశంపై చర్చ నడుస్తుండడం విశేషం. గత ఎన్నికల్లో ఆయన మెజారిటీ 30 వేలకు తగ్గడంతో.. ఈసారి లక్ష ఓట్ల ఆధిక్యానికి తక్కువ కాకుండా సాధించేందుకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు అహర్నిశలు పని చేస్తున్నాయి. గతంలో 2014, 19 ఎన్నికల్లో టీడీపీ అధినేతపై పోటీచేసి ఓడిపోయిన కె.చంద్రమౌళి కుమారుడు భరత్‌ను వైసీపీ బరిలోకి దించింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపైనే ఈయన పూర్తిగా ఆధారపడ్డారు. ఏ విషయంలోనూ ఆయనకు స్వేచ్ఛ ఇవ్వకుండా ఆయన్ను ముందుంచి పెద్దిరెడ్డి చక్రం తిప్పుతున్నారు.

డిపాజిట్ సొమ్ము చెల్లించేది ప్రజలే..

చంద్రబాబు ఇప్పటి వరకు ఇక్కడ ఏడుసార్లు విజయం సాధించారు. ఎనిమిదోసారి పోటీ చేస్తున్నారు. ప్రతి ఎన్నికల సమయంలోనూ నామినేషన్ వేసేందుకు ఆయన హాజరవరు. ప్రజలే చందాలేసుకుని మరీ ఆయన నామినేషన్ డిపాజిట్ ఖర్చు భరించడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి ఆయన సతీమణి భువనేశ్వరి వచ్చి అట్టహాసంగా చంద్రబాబు తరఫున నామినేషన్ దాఖలు చేశారు. గతంలో ఎన్నడూ ఎన్నికల ప్రచారంలో పాల్గొనని ఆమె.. ఇప్పుడు కుప్పంపై ప్రత్యేక దృష్టి సారించి విస్తృతంగా పర్యటిస్తున్నారు.

అన్నింటికీ కుప్పమే వేదిక

చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ప్రతి కార్యక్రమాన్ని, పథకాన్ని కుప్పం వేదికగా ప్రారంభించేవారు. ఇజ్రాయెల్ తరహా వ్యవసాయ విధానాన్ని ఇక్కడి ప్రజలకు పరిచయం చేశారు. బిందు, తుంపర్ల సేద్యానికీ ఇక్కడి నుంచే నాంది పలికారు. తాజాగా ఎన్నికల ప్రచార కార్యక్రమం ప్రజాగళాన్ని కూడా కుప్పం నుంచే ప్రారంభించారు. గతేడాది జనవరిలో లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రకూ కుప్పమే వేదికైంది. మూడు రాష్ట్రాలకు కూడలిగా ఉన్న కుప్పం చంద్రబాబు రాకముందు బాగా వెనుకబడిన ప్రాంతంగా ఉండేది. ఈ 35 ఏళ్లలో ఆయన కుప్పాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేశారు. అన్ని గ్రామాల్లో తారు రోడ్లు, సీసీ రోడ్లు నిర్మించడంతో పాటు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలు, గురుకులాలు, ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలతో ప్రతిష్ఠాత్మక ద్రవిడ విశ్వవిద్యాలయాన్నీ ఇక్కడే నెలకొల్పారు. దీంతో పాటు ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా అనేక కార్యక్రమాలు చేస్తున్నారు. 'నేను మూడుసార్లు సీఎంగా పనిచేసి ప్రపంచ దేశాలు తిరిగి రాష్ట్రాభివృద్ధికి కృషి చేశానంటే దానికి కుప్పం ప్రజలే కారణం. వారి రుణాన్ని ఎప్పటికీ తీర్చుకోలేను' అని చంద్రబాబు నిత్యం గుర్తు చేసుకుంటూ ఉంటారు.



కేఆర్‌జే భరత్ (వైసీపీ)

ఐదేళ్లుగా వైసీపీ విధ్వంసం..

వైఎస్ సహా గతంలో కాంగ్రెస్ సీఎంలుగా పనిచేసిన వారంతా కుప్పం జోలికి వెళ్లలేదు. చంద్రబాబును ఇబ్బంది పెట్టలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ మంత్రి పెద్దిరెడ్డి కుప్పాన్ని టార్గెట్ చేసి ఈ ఐదేళ్ల పాటు విధ్వంసం సృష్టించారు. ఆయన అండతో శాంతిపురం మండలం 81.ముద్దనపల్లెలో వైసీపీ నేతలు సుమారు 250 ఎకరాల్లో విచ్చలవిడిగా అక్రమ క్వారీలను నిర్వహించి ప్రకృతి సంపదను కొల్లగొట్టారు. 2022 జనవరిలో చంద్రబాబు ఆ ప్రాంతాన్ని పరిశీలించి జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ)కి ఫిర్యాదు చేయడంతో దోపిడీకి అడ్డుకట్ట పడింది. స్థానిక ద్రవిడ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోనూ మైనింగ్ చేసి ఛిద్రం చేశారు. నియోజకవర్గంలో చిన్న కుంట, చెరువు కనిపించినా మట్టిని అక్రమంగా తవ్వేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేశారు. కర్ణాటక మద్యం అక్రమ వ్యాపారం ద్వారా నెలకు రూ.కోటి సంపాదించుకుంటున్నారు. కుప్పం గ్రామీణ విద్యుదీకరణ సంస్థ (రెస్కో)లో ఒక్కో ఉద్యోగానికి రూ.10 లక్షలు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. 2023 జనవరిలో కుప్పంలో చంద్రబాబు పర్యటించకుండా జీవో నంబర్ 1 పేరుతో పోలీసులు అడ్డుకున్నారు. విధి నిర్వహణను అడ్డుకున్నారని 60 మంది టీడీపీ కార్యకర్తలపై కేసులు పెట్టారు. కుప్పంలోని అన్న క్యాంటీన్‌ను ధ్వంసం చేశారు. తిరిగి టీడీపీ నాయకులపైనే కేసులు పెట్టారు. 2022 ఆగస్టులో చంద్రబాబు పర్యటించే ప్రాంతాల్లో వైసీపీ శ్రేణులు ఆ పార్టీ జెండాలు కట్టి, టీడీపీ శ్రేణుల్ని రెచ్చగొట్టాయి. పరస్పరం ఘర్షణ జరిగితే 40 మంది టీడీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేశారు. ఇలా నియోజకవర్గంలోని వందల మంది కార్యకర్తలపై కేసులు పెట్టారు. రౌడీషీట్లు తెరిచారు. చివరికి మహిళలపైనా హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. చంద్రబాబు చేసిన అభివృద్ధిని కనిపించకుండా చేసేందుకు అనేక రకాలుగా విధ్వంసం చేశారు. కుప్పంలో టీడీపీ శ్రేణులను మానసికంగా దెబ్బ కొట్టేందుకు మంత్రి పెద్దిరెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీవినీ ఎరుగని అక్రమాలకు తెరదీశారు. తన నియోజకవర్గం పుంగనూరులో చేసుకున్నట్లు కుప్పంలోనూ అక్రమంగా ఏకగ్రీవాలు చేసుకున్నారు.టీడీపీ నేతలు నామినేషన్లు వేయకుండా.. బెదిరించి దాడులు చేసి అడ్డుకుని.. ఓటుకు ఐదేసి వేలు పంపిణీ చేసి..దొంగ ఓట్లతో కుప్పం మున్సిపాలిటీ సహా మెజారిటీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు వైసీపీ ఖాతాలో వేశారు. ఈ అరాచకాలు చూసి కుప్పం ప్రజలు బిత్తరపోయారు. వైసీపీకి బుద్ధిచెప్పాలని కృతనిశ్చయంతో ఉన్నారని టీడీపీ వర్గాలు అంటున్నాయి.

చంద్రబాబు బలాలు..

35 ఏళ్లుగా నియోజకవర్గ అభివృద్ధి.. 3 నెలలకోసారి వచ్చి ప్రజలతో మమేకం కావడం. భార్య భువనేశ్వరి ప్రచారం. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో బాబును అక్రమంగా అరెస్టు చేసి జైలు పాల్జేయడంపై ప్రజల్లో జగన్ పట్ల ఆగ్రహం.

బలహీనతలు..

టీడీపీ స్థానిక నేతల్లో విభేదాలు.. లోకల్‌గా జరిగే పరిణామాలు చంద్రబాబు వరకు వెళ్లకపోవడం.

భరత్ బలాలు..

వైసీపీ కేడర్.. మంత్రి పెద్దిరెడ్డి అండ..

బలహీనతలు..

ఐదేళ్లుగా వైసీపీ నేతలు సాగించిన విధ్వంసం.. జగన్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత.. స్థానిక నేతలతో సమన్వయం లేకపోవడం.. కొందరినే దగ్గరకు తీసి మిగిలిన వారిని దూరం పెట్టడంతో వర్గాలు తయారు కావడం. స్థానికేతరుడనే ముద్ర.

నియోజకవర్గ స్వరూపం..

(కుప్పం మున్సిపాలిటీ, కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాలు)

మొత్తం ఓటర్లు: 2,25,775
పురుషులు: 1,12,510.. మహిళలు: 1,13,247..
ట్రాన్స్‌జెండర్లు: 18

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

శ్రీకాళహస్తి
సత్యవేడు

ఎన్నికల నిర్వహణకు భారీ బందోబస్తు
80 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తింపు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రవిశంకర్ రెడ్డి

శ్రీకాళహస్తి, మే 11: నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణ కోసం భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి రవిశంకర్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఆయన కార్యాలయంలో శనివారం విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజక వర్గంలో మొత్తం 2,48,536 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. 293 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. నియోజకవర్గంలో 80 సమస్యాత్మక పోలింగ్ భూత్‌లను గుర్తించామని... అక్కడ ప్రత్యేక కేంద్ర బలగాలతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఆ పోలింగ్ బూతుల వద్ద వెబ్ కాస్టింగ్, ద్వార వీడియో చిత్రీకరించబడుతుందని వెల్లడించారు. పోలింగ్ బూత్ వద్ద నుంచి 100 మీటర్ల లోపల ఎవరికి అనుమతి లేదని, కేవలం ఓటు వేసే వ్యక్తి మాత్రమే ఈ 200 మీటర్ల లోపల రావాలని మిగతా ఎవరికి ఎటువంటి అనుమతులు ఉండద న్నారు. మే 13వ తేదీ పోలింగ్ ఉదయం 5:30 గంటలకు ఏజెంట్లు, ఎన్నికల అధికారులు సమక్షంలో మాక్‌పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. అనంతరం 7నుంచి సాయంత్రం 6 గంటలకు పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. 6 గంటల లోపల క్యూలైన్‌లోకి ప్రవేశించిన వారికి ఓట్లు వేసేందుకు అనుమతి స్తామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఓట్లు వేసే విధంగా అక్కడక్కడా యూత్ పోలీస్ స్టేషన్, పింక్ పోలీస్ స్టేషన్, ఉమెన్స్ పోలీస్ స్టేషన్, మోడ్రన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే దగ్గర్లో ఉన్న ఈ పోలీస్ స్టేషన్‌లో సంప్రదిస్తే వారికి పూర్తి రక్షణ కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లన్నీ పూర్తి చేశాం: ఆర్‌వో


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వో నరసింహులు

సత్యవేడు, మే 11: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సత్యవేడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నరసింహులు తెలిపారు. శనివారం బాలికల గురుకుల పాఠశాల ప్రాంగణంలో పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావుతో కలసి ఎన్నికల ఏర్పాట్లు, భద్రత పరంగా తీసుకున్న చర్యలు తదితర అంశాలను మీడియాకు వెల్లడించారు. నియోజకవర్గంలో 139 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, మరో 115 పోలింగ్ కేంద్రాల్లో వీడియో చిత్రీకరణ ఉంటుందన్నారు. మే 13న ఉదయం 7నుంచి సాయంత్రం 6 గంటలకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఓటరు స్లిప్పులతో పాటు ఎన్నికల సంఘం సూచించిన ఏదైనా గుర్తింపు కార్డును తీసుకెళ్లాల్సి ఉందన్నారు. పుత్తూరు డీఎస్పీ మాట్లాడుతూ పోలింగ్ జరిగే రోజున 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. శాంతియుత వాతావరణంలో పోలింగ్ జరగడానికి భద్రతాపరంగా 500 మంది సిబ్బందిని నియమించామన్నారు. నియోజకవర్గంలో గుర్తించిన 72 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అదనపు పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ఎన్నికల అధికారి రామాంజేయులు, సీఐ దివాకర్‌రెడ్డి, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో రవి తదితరులు పాల్గొన్నారు.

భూములు లాక్కోవడానికే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్


ఆదిమూలంను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

పిచ్చాటూరు, మే 11: ప్రజల భూములను లాక్కోవడానికే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చారని ఎన్డీఏ కూటమి సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం అన్నారు. పిచ్చాటూరులో శనివారం సాయంత్రం నిర్వహించిన ప్రచార ర్యాలీలో జనం పోటెత్తారు. పట్టణంలో ఎటు చూసినా పసుపు జెండాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆదిమూలం మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుమలరెడ్డి, ఇళంగోవన్‌రెడ్డి, సతీష్‌నాయుడు, పద్మనాభరాజు, రవినాయుడు, బుజ్జినాయుడుతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఈవీఎంల తరలింపునకు ఏర్పాట్లు

శ్రీకాళహస్తి, మే 11: ఎన్నికల నిర్వహణ కోసం ఈవీఎంలు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం సంబంధించిన ఈవీఎంలను పట్టణంలోని స్కిట్ కళాశాల స్ట్రాంగ్ రూముల్లో బద్రపరచిన విషయం తెలిసిందే. మొత్తం నియోజకవర్గ వ్యాప్తంగా 293 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన అధికారులకు ఆదివారం స్కిట్ కళాశాల నుంచి ఈవీఎం యంత్రాలను అప్పగించనున్నారు. వారు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆదివారం ఈవీఎంల తరలింపు ప్రక్రియ కోసం అవసరమైన ఏర్పాట్లు స్కిట్ కళాశాలలో పూర్తి చేశారు.

భావి తరాల కోసం
టీడీపీకి మద్దతు ఇవ్వండి: భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, మే 11: భావి తరాల భవిష్యత్తు, నగరి నియోజకవర్గ అభివృద్ధి, మీ పిల్లల భవిష్యత్తు కోసం రానున్న ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా నిలవాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ అభ్యర్థించారు. శనివారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. రెండు దఫాలు వైసీపీ గెలవడం వల్ల నియోజకవర్గంకు జరిగిన నష్టం, ఈ ఐదేళ్లలో జరిగిన అవినీతి, అటకెక్కిన అభివృద్ధిని ఓటు వేసే ముందు ప్రజలు ఒకసారి గుర్తు చేసుకోవాలని కోరారు. వైసీపీకి ఓటేస్తే ఉన్న ఆస్తులను కూడా పోగొట్టుకునే పరిస్థితి దాపురిస్తుందని ఆయన హెచ్చరించారు. ఎవరికి కష్టం వచ్చినా కుటుంబంలో ఒకడిగా ఉంటూ సేవలు అందిస్తానని వాగ్దానం చేశారు. వైసీపీ ప్రలోభాలకు, మాయ మాటలను నమ్మి మరోసారి మోసపోవద్దని, మీరు వేసే ప్రతి ఓటు ఐదేళ్ల మీ భవిష్యత్తును, మీ పిల్లల భవిష్యత్తును కూడా నిర్దేశిస్తుందనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. టీడీపీకి ఓటేసి నగరిలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టుకుందామని, నగరి అభివృద్ధితో పాటు మీ కుటుంబాలను కూడా ఆర్థికంగా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు.

శనీశ్వర స్వామికి విశేష పూజలు



శ్రీకాళహస్తి, మే 11: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వర స్వామికి శనివారం విశేష పూజలు జరిగాయి. ముందుగా అర్చకులు స్వామివారి సన్నిధిని శుద్ధి చేశారు. భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ పూజా ద్రవ్యాలతో పాటు శని ప్రీతి కోసం విశేషంగా తైలాభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించి విశేషాలంకారంతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

పిచ్చాటూరు, మే 11: పిచ్చాటూరు మండలం శేషంపేట గ్రామానికి చెందిన హేమాద్రినాయుడు(78) వడదెబ్బతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చంద్రబాబుకు స్వాగతం



రేణిగుంట, మే 11: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుకు రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శనివారం సాయంత్రం చిత్తూరులో ఎన్నికల ప్రచార సభ ముగించుకుని ప్రత్యేక హెలికాప్టర్‌లో రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న చంద్రబాబుకు కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి రవినాయుడు, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జనసేన నాయకులు స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు తిరుమలకు వెళ్లారు.

నారా లోకేష్‌కు...



రేణిగుంట, మే 11: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు ఘనస్వాగతం లభించింది. శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం తిరుపతిలో జరిగే రోడ్‌షోలో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లారు. రోడ్‌షో ముగిశాక విమానాశ్రయానికి చేరుకుని విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేస్తాం: సుధీర్ రెడ్డి


ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ కరపత్రాలతో నిరసన తెలుపుతున్న సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, మే 11: ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేస్తామని ఎన్డీఏ కూటమి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో శనివారం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రతులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైసీపీకి ఒక్క అవకాశం ఇస్తే ప్రజల హక్కులను హరించారని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు, ఆస్తులపై హక్కులను ప్రజలు కోల్పోయే చట్టాన్ని తీసుకురావడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లమాల సుధాకర్, విజయ్ కుమార్ కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణ శివారులోని మిట్ట కండ్రిగ నుంచి భారీ బైక్ ర్యాలీ ప్రారంభమైంది. పట్టణ పురవీధుల్లో కూటమి ర్యాలీ జయ జయ ధ్వానాలతో హోరెత్తింది. అడుగడుగునా స్థానిక ప్రజలు, వ్యాపారులు సుధీర్ రెడ్డికి మద్దతుగా పూల వర్షంతో స్వాగతం పలికారు. అఖండ మెజారిటీతో గెలుపొందాలని పలువురు ఆకాంక్షిస్తూ ఆయనకు ప్రచారంలో మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొజ్జల బృందమ్మ, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టీడీపీ నాయకులు పల్లమాల సుధాకర్, విజయ్ కుమార్, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మీ పిల్లల భవిష్యత్తు కోసం కూటమిని గెలిపించండి


ర్యాలీలో మాట్లాడుతున్న రిషితారెడ్డి

రేణిగుంట: మీ పిల్లల భవిష్యత్తు కోసం ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి కోరారు. శనివారం మధ్యాహ్నం రేణిగుంట పట్టణంలోని సంత గేటు నుంచి జీఎం బజారు, బస్టాండు, శ్రీకాళహస్తి రోడ్డు మీదుగా భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో రేణిగుంటలో అనేక పరిశ్రమలను తీసుకువచ్చి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. వైసీపీ పాలనలో అభివృద్ధి జాడే లేకుండా పోయిందన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే స్థానిక యువతకు పరిశ్రమల్లో 33శాతం ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. ఊరందూరులో ఇంటి పట్టాలు ఇచ్చిన వారికి రేణిగుంట చుట్టు పక్కల ఇంటి స్థలాలు ఇచ్చేందుకు కృషి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి తన భర్త సుధీర్‌రెడ్డిని, కమలం గుర్తుపై ఓట్లు వేసి ఎంపీ వరప్రసాదరావును గెలిపించాలని కోరారు.

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా రెడ్డివారి గురవారెడ్డి



శ్రీకాళహస్తి, మే 11: టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా రెడ్డివారి గురవారెడ్డిని నియమించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రెడ్డివారి గురవారెడ్డి టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. గత నాలుగేళ్ల నుంచి టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరించారు. రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన గురవారెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.

నేడు ఆదిశంకరాచార్యుల జయంతి

శ్రీకాళహస్తి, మే 11: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఈవో నాగేశ్వరరావు శనివారం ప్రకటనలో తెలిపారు. ముక్కంటి ఆలయంలోని బ్రహ్మగుడి ప్రాంగణంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు ఆదిశంకరాచార్యులకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులందరూ పాల్గొని దర్శించుకోవచ్చు అని తెలిపారు.

ర్యాలీలతో హై టెన్షన్

శ్రీకాళహస్తి, మే 11: శ్రీకాళహస్తిలో ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా ఇద్దరు ప్రధాన అభ్యర్థులు చేపట్టిన ర్యాలీలతో హై టెన్షన్ వాతావరణం నెలకొంది. ప్రచారం ముగింపు కావడంతో ఇటు టీడీపీ, అటు వైసీపీ పట్టణ వ్యాప్తంగా ర్యాలీలు చేసే కార్యక్రమానికి తెర తీశారు. వాస్తవానికి మూడు రోజుల క్రితమే టీడీపీ నేతలు బైక్ ర్యాలీ కోసం అనుమతి పొందారు. శనివారం అదే తరహాలో వైసీపీ నేతలు అనుమతి తీసుకున్నారు. రెండు ర్యాలీలు ఒకే సమయంలో పట్టణంలో ఒకే వీధుల్లో పలుచోట్ల ఎదురుపడేలా రెండు పార్టీలు ప్రణాళిక చేసుకున్నారు. దీంతో సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులంతా రంగంలోకి దిగారు. ఎన్నికల విధులు కోసం తమిళనాడు నుంచి వచ్చిన 60 మంది సిబ్బందిని అప్పటికప్పుడు ర్యాలీకి బందోబస్తుగా ఏర్పాటు చేసుకున్నారు. రెండు ర్యాలీలు ఎదురుపడకుండా నెమ్మదిగా సాగేలా వ్యవహరించారు. చివరలో పట్టణ నడిబొట్టు పెళ్లి మండపం కోడలి వద్ద రెండు ర్యాలీలు ఒకే చోట కలిసే విధంగా దగ్గరికి చేరుకున్నాయి. అప్పటికే పెళ్లి మండపం వద్దకు వైసీపీ ర్యాలీ సమీపించింది. బేరివారి మండపం వద్ద నుంచి పెళ్లి మండపం వైపు టీడీపీ ర్యాలీ రాకుండా బజారు వీధికి మళ్లించారు. ఎక్కడా రెండు ర్యాలీలు ఎదురుపడకుండా ప్రశాంతంగా సాగాయి.

జేపీ నడ్డాకు వీడ్కోలు



రేణిగుంట, మే 11: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు బీజేపీ నాయకులు వీడ్కోలు పలికారు. శనివారం తిరుపతిలో జరిగిన కూటమి రోడ్‌షోలో పాల్గొన్న అనంతరం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న నడ్డాకు బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు వీడ్కోలు పలికారు.

వైసీపీ పనైపోయింది: వరప్రసాదరావు


సభలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు

తిరుపతి, (ఉపాధ్యాయనగర్) మే 11: వైసీపీకి ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ పనైపోయిందని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. శనివారం టెంపుల్ టవర్ కాలనీలో వాకింగ్ చేస్తూ స్థానికులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డా, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, జనసేన ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు ఆధ్వర్యంలో జరిగి ఎన్నికల ప్రచారసభలో వరప్రసాద రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడ్డ వైసీపీ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. కేంద్ర పథకాలకు తమ బొమ్మలు వేసుకొని తామే ఇస్తున్నట్లుగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గనులను లూటీ చేశారని అడ్డువచ్చిన వారిపై కేసులు నమోదు చేసి జైలుపాలు చేశారని అన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ 10 రూపాయలు ఇచ్చి 100 రూపాయలు దోచుకున్నారని ఇంతటి దౌర్జన్యకర ప్రభుత్వాన్ని ఈ రాష్ట్ర ప్రజలు ఎవరూ ఇంతవరకు చూడలేదని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలంటే ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని ఎంపీ అభ్యర్థిగా తనకు, తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్న జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకుముందు శనివారం ఉదయం టెంపుల్‌టవర్ కాలనీలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించాలంటూ కోరారు.

'టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటా'

పుత్తూరు అర్బన్, మే 11: టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు అన్నారు. శనివారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో ముఖ్య అనుచరులతో సమావేశమయ్యారు. రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థుల గెలుపు కోసం అందరూ కష్టించి పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రవినాయుడు, ఎంపీటీసీ శ్రీజ, బాలాజీనాయుడు, ధనపాల్, సుమన్‌నాయుడు, చంద్రాయాదవ్, అరవ ప్రకాష్, దాసరి విజయ్ చౌదరి, బాబు రాయల్, అప్పయ్య, మునిరత్నం, రవియాదవ్, మణి, రమేష్ పాల్గొన్నారు.

వైసీపీ తరపున
నగదు పంచిన వలంటీర్

వడమాలపేట, మే 11: మండల పరిధిలోని బుట్టిరెడ్డి కండ్రిగలో వలంటీర్ జ్ఞానేంద్రరెడ్డి శనివారం వైసీపీ తరపున నగదును పంచడం పట్ల గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గనకుండా కమిషన్ ఆంక్షలు విధించినా నగరి నియోజకవర్గంలో మాత్రం అమలు కావడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో పలువురు వలంటీర్లు వైసీపీ తరపున ప్రచారం నిర్వహిస్తూ సస్పెండ్ అయ్యారు. అయినప్పటికీ వారి తీరులో మాత్రం మార్పు రాలేదు. ప్రస్తుతం నగదు పంపిణీ వ్యవహారంలో చురుగ్గా పనిచేస్తూ పోలింగ్ రోజున ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు తెగించి పనిచేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. వలంటీర్లు నిబంధనలు ఉల్లంఘిస్తుండడంపై ఎన్నికల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



నగరిలో హోరాహోరీ

- ముగిసిన ప్రచార పర్వం
- ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పార్టీలు
- గెలుపుపై ఇరుపార్టీల్లోనూ ధీమా

పుత్తూరు అర్బన్, మే 11: నగరి నియోజకవర్గంలో హోరాహోరీ పోరుకు రంగం సిద్ధమైంది. టీడీపీ తరపున గాలి భానుప్రకాష్, వైసీపీ తరపున రాష్ట్ర మంత్రి రోజా బరిలో ఉన్నారు. ప్రధాన పార్టీలు ప్రచారపర్వం పూర్తి చేసుకుని ప్రలోభాల పర్వానికి తెరతీశారు. తాయిలాల రూపంలో ఓటరు దేవుడిని ప్రసన్నం చేసుకునే పనిలో బిజీగా ఉన్నారు. మరోవైపు పోలింగ్‌కు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తుండగా, అభ్యర్థులు కీలకమైన పోల్‌మేనేజ్‌మెంట్‌పై గురిపెట్టారు.

పుంజుకున్న టీడీపీ

టీడీపీ గత నెలరోజుల్లో అనూహ్యంగా పుంజుకుంది. వైసీపీకి గట్టి పట్టున్న వడమాలపేట మండలంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఆ పార్టీ నుంచి టీడీపీలోకి చేరికలను ప్రోత్సహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా వైసీపీ అభ్యర్థి రోజాపై అసమ్మతితో ఉన్న కీలకమైన నాయకులను తనవైపు తిప్పుకోగలిగారు. మొదలియార్ సామాజికవర్గంలో బలమైన నాయకుడు డీఎన్ ఏలుమలై, శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఆయన సోదరుడు రెడ్డివారి భాస్కర్‌రెడ్డి, వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, విజయపురానికి చెందిన లక్ష్మీపతిరాజు, రవిశేఖర్‌రాజు, పదుల సంఖ్యలో సర్పంచులు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లను టీడీపీ వైపు ఆకర్షించడంలో సఫలమయ్యారు. తొలి నుంచి ఉన్న టీడీపీ నాయకులతో పాటు కొత్త నాయకుల చేరికలతో రెట్టించిన బలంతో ఎన్నికలకు సిద్ధమయ్యారు. గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోవడంతో ఓటర్లలో గాలి భానుప్రకాష్ వైపు సానుభూతి బలంగా వీస్తోంది. అలాగే ప్రత్యర్థి రోజాపైన, ప్రభుత్వంపైన ఉన్న వ్యతిరేకత, పవర్‌లూమ్స్‌కు నెలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్తు, నెలకు పింఛన్ రూ.4 వేలకు పెంపు తదితర పథకాలు తనకు కలిసి వస్తాందనే అంచనాలతో గెలుపుపై ధీమాతో భానుప్రకాష్ ఉన్నారు.

ప్రతికూలతల నడుమ పోలింగ్‌కు....

వైసీపీ అభ్యర్థి రోజాకు ఈ ఎన్నికలు చెమటలు పట్టిస్తున్నాయి. తొలి నుంచి పార్టీలో ఉన్న అసమ్మతి నాయకులను తట్టుకుని టికెట్ అయితే సాధించారు కానీ, వారిని తనకు అనుకూలంగా మలుచుకోవడంలో విఫలమయ్యారు. వీరికి తోడు ప్రతి మండలంలో అసంతృప్తులు ఎక్కువ కావడంతో వారితో సర్దుబాటు చేసుకునేందుకే పుణ్యకాలం కరిగిపోయింది. దీంతో ప్రచారంలో బాగా వెనుకబడ్డారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబ పెత్తనం, అవినీతి ఆరోపణలు, కీలక నేతలు టీడీపీ కండువా కప్పుకోవడం ప్రతికూలతల నడుమ పోలింగ్‌కు సిద్ధమవుతున్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులు, సంప్రదాయ ఓట్లు, విచ్చలవిడిగా వెదజల్లుతున్న నగదు, ఏరులైపారుతున్న మద్యం, అనుకూలంగా ఉన్న అధికార యంత్రాంగం తనను గట్టెక్కిస్తాయనే ధీమాలో రోజా ఉన్నారనే ప్రచారం జరుగుతోంది.

కూటమితోనే నాయీ బ్రాహ్మణుల అభివృద్ధి

టీటీడీ మహిళా క్షురకుల సంఘం అధ్యక్షురాలు రాధాదేవి



విలేకరులతో మాట్లాడుతున్న రాధాదేవి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 11: కూటమి అధికారంలోకి వస్తేనే నాయీ బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతాయని టీటీడీ మహిళా క్షురకుల సంఘం అధ్యక్షురాలు రాధాదేవి పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో నాయీ బ్రాహ్మణులపై దాడులు తీవ్రమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్మార్గాన్ని అడ్డుకోవడానికి కూటమికి ఓటు వేయాలని కోరారు. తిరుపతిలో కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు విజయానికి తోడ్పడతామన్నారు. కూటమికి నాయీ బ్రాహ్మణులు, అన్ని వర్గాల ప్రజలు ఓటు వేసి గెలిపించాలని రాధాదేవి కోరారు. ఈ సమావేశంలో భువనేశ్వరి, శ్యామల, అరుణ, మునెమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

దొంగ ఓటర్లు జైలుకెళ్లడం ఖాయం: జనసేన



సమావేశంలో మాట్లాడుతున్న కీర్తన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 11: ఎన్నికల్లో దొంగ ఓట్లు వేస్తే ఎవరైనా జైలుకెళ్లడం ఖాయమని జనసేన హెచ్చరించింది. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తన శనివారం మీడియాతో మాట్లాడుతూ.. అభం, శుభం తెలియని వారు వైసీపీ నాయకుల ప్రలోభాలకు తలొగ్గి దొంగ ఓట్లు వేయడానికి ప్రయత్నించవద్దని కోరారు. దొంగ ఓట్లు వేయాలనుకుంటే జైలుకెళ్లక తప్పదని స్పష్టంచేశారు. కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్ర భవిష్యత్తుకు ఓటర్లు కృషి చేయాలని కోరారు. సమావేశంలో నేతలు హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

ఏ పార్టీ గెలిచినా ఇంటికో ఉద్యోగం ఇవ్వాలి

భారతీయ దేశభక్తుల ఐక్యవేదిక నేత మాసుమయ్య



విలేకరులతో మాట్లాడుతున్న మాసుమయ్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 11: దేశంలో, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారాన్ని చేపట్టినా చదువుకున్న వారికి ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని భారతీయ దేశభక్తుల ఐక్య వేదిక అధ్యక్షుడు మాసుమయ్య కోరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో అమలు చేస్తున్న ఉచితాలు అన్నింటినీ రద్దు చేయాలన్నారు. విద్య, వైద్యం, ఉపాధి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకుల సురేష్, పూర్ణచంద్ర, రఫీ, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా మాతృ దినోత్సవం



తిరుపతి(విద్య), మే 11: బైరాగిపట్టెడలోని ఆర్‌కేఎస్ వీక్ష ద స్కూల్‌లో శనివారం మాతృదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు చిన్నారులు మాతృమూర్తులకు పాదపూజచేసి వారి ఆశీర్వాదం పొందారు. స్కూల్ చైర్మన్ డాక్టర్ టి.రామకృష్ణారెడ్డి, అన్నమయ్య నృత్య కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్రీరామ్, డైరెక్టర్ ఆర్‌కే విమలారెడ్డి, టీచర్లు పుష్ప, కల్పన, నదియ, ప్రేమావతి, అరుణ, అనూష, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

కూటమికి తమిళ సంఘం మద్దతు



విలేకరులతో మాట్లాడుతున్న తమిళ సంఘం నేతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 11: రాష్ట్రంలో ఎన్డీయే కూటమికి తాము మద్దతు తెల్పుతున్నట్లు తమిళ సంఘం స్పష్టం చేసింది. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో తమిళ సంఘం నాయకులు రామ్‌కుమార్ నాడార్ శనివారం మీడియాతో మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచీ విడిపోయిన సందర్భంలో కొందరు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. అనేక మంది రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలోనే ఆస్తులు, ఓట్లు కలిగి రాష్ట్ర ఉన్నతి కోసం పని చేస్తున్నారని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో కూటమికి మద్దతు తెలియచేస్తున్నామని అన్నారు. కూటమి గెలుపుతోనే తమకు అన్ని విధాలుగా మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తమిళ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రుయా నేత్ర నిధికి కళ్లు దానం



మృతురాలి కళ్లను దానం చేస్తూ కుటుంబ సభ్యులు అందజేస్తున్న అంగీకార పత్రం

తిరుపతి(వైద్యం), మే 11: గుండెపోటుకు గురైన మహిళ రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించడంతో ఆమె కళ్లను అదే ఆస్పత్రిలోని నేత్ర నిధికి శనివారం మృతురాలి కుటుంబ సభ్యులు దానం చేశారు. తొండవాడకు చెందిన సి.కోమలవల్లి(40) గుండెపోటు కారణంగా రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న నేత్ర నిధి విభాగాధిపతి డాక్టర్ చలపతిరెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను కలిసి నేత్రదానం గురించి అవగాహన కల్పించారు. ఈ క్రమంలో మృతురాలి కుమార్తె భార్గవి, కుమారుడు భరద్వాజ్ తమ తల్లి కళ్లను దానం చేసేందుకు అంగీకరించారు. దీంతో మృతురాలి కళ్లను సేకరించి రుయాస్పత్రిలోని నేత్ర నిధిలో భద్రపరిచారు. తీరని దుఃఖంలోనూ తమ తల్లి కళ్లను దానం చేసేందుకు ముందుకు వచ్చిన వారిని సూపరింటెండెంట్ రవిప్రభు అభినందించారు. ఇలా మృతిచెందిన వారి అవయవాలను దానం చేసేందుకు ముందుకు వస్తే వాటితో మరొకరికి జీవితం ప్రసాదించే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నేత్ర నిధి టెక్నీషియన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో కూటమి నేతల ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో ఆరణి శ్రీనివాసులు కుటుంబ సభ్యులు, కార్యకర్తలు

తిరుమల, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కుటుంబ సభ్యులు శనివారం తిరుమలలో బాలాజీనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీ గ్లాస్‌పై ఓటు వేసి తమ మావయ్య ఆరణి శ్రీనివాసులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోడలు శిరీష, కుటుంబ సభ్యులు శ్రావణి, రాజ్యలక్ష్మీ, పద్మజ, సంధ్య తిరుమల ఓటర్లను అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, నాయకులు రాజుయాదవ్, కేశవులు, శివషణ్ముగం, దేవరాజ్, ఆనంద్, బాలాజీ, రామచంద్రరాజు, కొండా రవి, విశ్వనాథం, రాఘవ, పవన్, మధు, సంతోష్ అశోక్‌కుమార్, జీవన్, రమణ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి పరపతి దక్కేదెవరికి?

ఎన్డీఏ కూటమివైపే కనిపిస్తున్న నగర ప్రజల మొగ్గు

తిరుపతి వర్తమానం

ప్రసిద్ధ ఆధ్యాత్మిక రాజధానిగా గుర్తింపు పొందిన తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం ఎంతోమంది ఉద్దండులను చూసింది. టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత ఎన్టీఆర్ తిరుపతినుంచే పోటీ చేసి గెలుపొందారు. ప్రజారాజ్యం పార్టీ తిరుపతిలోనే పురుడుపోసుకుంది. చిరంజీవి కూడా ఇక్కడి నుంచే ఎమ్మెల్యేగా గెలుపొందారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తిరుపతిలోనే రాజకీయ పాఠాలు నేర్చుకున్నారు. తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గానికి సార్వత్రిక, ఉప, మధ్యంతర కలిపి 16సార్లు ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్, కాంగ్రెస్ ఐ కలసి ఏడుసార్లు, టీడీపీ ఐదుసార్లు, వైసీపీ ఓసారి, స్వతంత్ర పార్టీ ఓసారి, ప్రజారాజ్యం పార్టీ ఒకసారి గెలుపొందాయి. రెండుసార్లు అసెంబ్లీకి గెలిచిన అగరాల ఈశ్వరరెడ్డి అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2014 ఎన్నికల్లో సుగుణమ్మ భర్త వెంకటరమణ ఎమ్మెల్యేగా టీడీపీ నుంచి పోటీచేసి గెలుపొందారు. దురదృష్టవశాత్తూ అనారోగ్యంతో ఆయన మృతిచెందడంతో తిరుపతి ఉప ఎన్నిక జరిగింది. దీంతో ఎమ్మెల్యే టికెట్ వెంకటరమణ భార్య సుగుణమ్మకు దక్కింది. కాంగ్రెస్ అభ్యర్థి శ్రీదేవిపై భారీ మెజారిటీతో సుగుణమ్మ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 85.69 శాతం ఓట్లను టీడీపీ ఈఉప ఎన్నిక ద్వారా సొంతం చేసుకుంది. 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సుగుణమ్మపై వైసీపీ అభ్యర్థి భూమన కరుణాకర రెడ్డి చావుతప్పి కన్నులొట్టపోయినట్టు 708 ఓట్ల ఆధిక్యంతో బయటపడ్డారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి అసెంబ్లీకి ఈసారి మళ్లీ సార్వత్రిక సమరం వచ్చింది. బరిలో వున్న ప్రధాన పార్టీ అభ్యర్థులు ఎన్డీఏ కూటమి నుంచి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, వైసీపీ నుంచి కరుణాకరరెడ్డి కుమారుడు అభినయ రెడ్డి మధ్య బిగ్ ఫైట్ నడుస్తోంది. ఆరణికి తొలుత అసమ్మతి సెగ పుట్టినప్పటికీ టీడీపీ, జనసేన అధినేతల జోక్యంతో అంతా సర్దుకున్నారు. ఇటీవల చంద్రబాబు, పవన్ తిరుపతి పర్యటనతో కూటమిలో రెట్టింపు ఉత్సాహం కనిపించింది. ఆరణి గెలుపుకోసం కూటమి కేడర్ మొత్తం ప్రచారపోరులో కనిపిస్తున్నారు. వైసీపీ అభ్యర్థి అభినయ్ రెడ్డి తరపున తండ్రి కరుణాకరరెడ్డి, కొందరు కార్పొరేటర్లు, కార్యకర్తలుమాత్రమే ప్రధానంగాకనిపిస్తున్నారు. భూమనతో పొసగలేక ఇప్పటికే ఐదుగురు కార్పొరేటర్లతోపాటు నిత్యం ఏదో ఒక డివిజన్లో వైసీపీ శ్రేణులు పెద్దమొత్తంలో కూటమిలో చేరిపోయారు.దీంతో వైసీపీలోఓటమిభయం పట్టుకుందని, గెలుపు మాదేనన్న ధీమా కూటమిలో వ్యక్తమవుతోంది.

ఆరణి శ్రీనివాసులు (జనసేన)



బలాలు

- అసంతృప్తితో వున్న ఆశావహులంతా ఏకతాటిపై నిలవడం
- తిరుపతిలో టీడీపీకి బలమైన క్యాడర్ వుండడం, జనసేన యువ శక్తి తోడవడం, బీజేపీ వ్యూహాలు కలిసిరావడం.
- మృదుభాషి, ఆర్థికంగా బలంగా వుండటం, బలమైన సామాజికవర్గం కలిగివుండడం
- చంద్రబాబు, పవన్‌ల రోడ్ షో, బహిరంగ సభలతో కేడర్‌లో ఉత్సాహం

బలహీనతలు

- నాన్ లోకల్ అంటూ ప్రత్యర్థులు ప్రచారం చేయడం

భూమన అభినయ్ రెడ్డి (వైసీపీ)



బలాలు

- తండ్రి టీటీడీ చైర్మన్‌గా, తాను డిప్యూటీ మేయర్‌గా బలమైన సంస్థాగత నిర్మాణాన్ని ఏర్పాటుచేసుకోవడం.
- ఆర్థికంగా బాగా కుదురుకోవడం
- అభివృద్ధి చేశామంటూ ప్రచారం చేసుకోవడం

బలహీనతలు

- జగన్ రెడ్డి పాలనపై తీవ్ర అసంతృప్తి
- తండ్రీ, తనయులపై అవినీతి, అహంకారులుగా ముద్రపడడం
- గంగజాతర సంప్రదాయాలను మార్చేయడం
- వైసీపీ కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున జారుకోవడం
- ఓటమి ఖాయమన్న ప్రచారం విస్తృతంగా జరగడం

కూటమి శ్రేణుల బైక్‌ర్యాలీ





రోడ్ షోలో పాల్గొన్న సినీనటి కస్తూరి - బైక్‌లో ర్యాలీలో పాల్గొన్న కిరణ్‌రాయల్ తదితరులు

తిరుపతి అర్బన్, మే 11: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో చివరి ఘట్టం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి చేపట్టిన బైక్ ర్యాలీ విజయవంతంగా సాగింది. శనివారం సాయంత్రం స్థానిక లీలామహల్ నుంచి వేలాదిగా బైక్‌లపై కూటమి నాయకులు, కార్యకర్తలు బయల్దేరారు. మున్సిపల్ కార్యాలయం, నాలుగుకాళ్ల మండపం, రైల్వేస్టేషన్, కర్ణాలవీధి, ప్రకాశంవీధి, బాలాజీకాలనీ, వెస్ట్‌చర్చ్, ఎంఆర్‌పల్లె కూడలి వరకు ర్యాలీ సాగింది. యువత పార్టీ జెండాలను ప్రదర్శిస్తూ జనసేన, పవన్‌కల్యాణ్‌కే జై, గాజుగ్లాసుకే మన ఓటు అంటూ నినాదాలు చేస్తూ ఓటర్లను ఆకర్షించారు. గాజుగుర్తుకు ఓటువేసి కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, సినీ నిర్మాత ఏఎం రత్నం, సినీనటి కస్తూరి, కిరణ్‌రాయల్, రాజారెడ్డి, పొలకల మల్లికార్జున, సుభాషిణి, కీర్తన, సుధ, మణి, శ్రావణ్, సుమన్, బలరాం, మూర్తి, మనోజ్, రాజేంద్ర, భానురాయల్, సిద్దు, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో ఎన్డీయే నేతల ప్రచారం

తిరుపతి(నేరవిభాగం), మే 11: జేపీ నడ్డా, నారా లోకేశ్, నాగబాబు రోడ్ షో మొత్తం నిఘా నీడలో జరిగింది. తిరుపతి పోలీసులతోపాటు తమిళనాడు నుంచి వచ్చిన దాదాపు 20 మంది సిబ్బంది, అప్పాలో శిక్షణ పొందుతున్న డీఎస్పీ, ఎస్‌ఐలు, కేంద్ర బలగాలు పెద్ద ఎత్తున బందోబస్తు విధుల్లో పాల్గొన్నాయి. కాగా.. టీడీపీ నాయకులు పులిగోరు మురళి, కంకణాల రజనీకాంత్ నాయుడు, ఊట్ల సురేంద్రనాయుడు, టీడీపీ 44వ వార్డు ఇన్‌చార్జి మధుయాదవ్, శరత్, బాలాజీ తదితరుల నేతృత్వంలో భారీ ర్యాలీలు జరిగాయి. ఎటు చూసినా పసుపు మయమైంది. ఎండను సైతం లెక్కచేయక దాదాపు 3.30 గంటల పాటు నాయకులు, కార్యకర్తలు బహిరంగసభ వద్ద వేచి ఉన్నారు.



తమిళనాడు పోలీసులు

శ్రీవారి శరణాగతే మోక్షమార్గం

తిరుపతి(కల్చరల్), మే 11: కర్మ, జ్ఞాన, భక్తి యోగాలకంటే వేంకటేశ్వరుడి శరణాగతి మార్గమే మోక్షానికి సులువైన మార్గమని ప్రముఖ పండితులు కె.సేతురామన్ అన్నారు. టీటీడీ, ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో భగవద్ రామానుజాచార్య అవతార మహోత్సవాల రెండవ రోజు శనివారం సాయంత్రం అన్నమాచార్య కళామందిరంలో జరిగిన సభలో రామానుజాచార్యులు - శరణాగతి గద్యం అనే అంశంపై సేతురామన్ వివరించారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుడు కె.చంద్రశేఖర్ హరికథా గానం ప్రేక్షకులను అలరించింది. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు అధికారి కోకిల, డీపీపీ కోఆర్డినేటర్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆదివారం సాయంత్రం 6 గంటలకు కె. రాజగోపాల్ ప్రసంగం, అనంతరం సరస్వతీ ప్రసాద్ గాత్ర కచేరి జరుగుతుంది.

పోలింగ్ సిబ్బందికి ఘుమఘుమలు

తిరుపతి(నేరవిభాగం), మే 11: పోలింగ్ విధుల్లో పాల్గొనే ప్రభుత్వోగులకు ఈసారి మంచి ఫుడ్ మెనూనే ఎన్నికల అధికారులు రూపొందించారు. మునుపెన్నడూ లేనివిధంగా తమ ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంపై సిబ్బంది విస్తుపోతున్నారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం అధికారులు, సిబ్బంది చేరుకుంటారు. సాయంత్రం స్నాక్స్‌గా వీరికి బోండాలు, వడలు, అల్పాహారం, మజ్జిగ లేకుంటే టీ ఇవ్వాలి. రాత్రికి 7.30 గంటలకు చపాతి, రోటీ, అన్నం, ఆకుకూర పప్పు, పచ్చడి, టమోటా ఆలుకూర, రసం, పెరుగు, వడియాలు, అరటిపండు ఇవ్వాలి. పోలింగ్ రోజు ఉదయం 4.30 గంటలకు టీ, 5 గంటలకు రెండు చట్నీలతో ఇడ్లీ, వడ, 9గంటలకు పండ్లు, మజ్జిగ లేకుంటే కొబ్బరి నీళ్ళు, 11 గంటలకు ప్లమ్ కేక్, టీ ఇవ్వాలి. 12.30 గంటలకు వెజిటబుల్ బిరాయానీ, పెరుగన్నం, నిమ్మబద్ద, మధ్యాహ్నం 3 గంటలకు బిస్కెట్లు, టీ లేకుంటే ఫ్రూట్ సలాడ్, సాయంత్రం 6 గంటలకు బోండా, వడలు, చట్నీ, టీ, మజ్జిగ ఇస్తారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో 15 మంది సిబ్బందికి మెనూ ప్రకారం స్థానికంగా ఫ్రెష్‌గా తయారు చేసి అందించాలని ఎన్నికల అధికారులు సూచించారు.

చిత్తూరును విద్యాకేంద్రంగా మారుస్తా

- అడవిపల్లె రిజర్వాయర్ నుంచి నగరానికి నీళ్లు
- ఇక్కడే చివరి మీటింగ్ పెట్టాలనుకుని వచ్చా
- స్మగ్లర్లకు నేను భయపడాలా..?
- ఎన్నికల ప్రచార ముగింపు సభలో చంద్రబాబు

వర్సిటీయే కాదు.. ప్రతిష్ఠాత్మక కాలేజీలూ తెస్తా



చంద్రబాబు సభలో మాట్లాడుతున్న దగ్గుమళ్ల, పక్కన గురజాల, సీకే బాబు

స్మగ్లర్‌కు జగన్ సీటిచ్చాడు

చిత్తూరు వైసీపీ అభ్యర్థి ఎర్రచందనం స్మగ్లర్. అతడు జైల్లో ఉండాలి. జగన్ స్మగ్లర్లకు సీటిచ్చి జిల్లా మొత్తం దోచుకుందాం అనుకుంటున్నాడు. ఇక్కడ మా వాళ్లను బెదిరిస్తున్నాడంట. బెదిరిస్తే భయపడతామా. నేను అనుకుని ఉంటే ఎప్పుడో ఎక్కడికో పోయేవాడు. దోచుకున్న డబ్బుల్లో రూ.2 వేలు పంపిణీ చేసేందుకు జగన్, పెద్దిరెడ్డి, స్మగ్లర్ కుట్ర చేశారు.

కుప్పంలో కేజీ బంగారమిచ్చినా వైసీపీకి ఓటేయరు

నా కుప్పంలో ఎక్కడ చూసినా కేజీఎఫ్ తరహాలో క్వారీలను తవ్వేసి రూ.వేల కోట్లను దోచుకున్నారు. ఇన్నాళ్లు ఇదంతా నాకే తెలీదు. కుప్పంలో ఓటుకు రూ.10 వేలు ఇస్తున్నారంట. అక్కడి ప్రజలకు కేజీ బంగారమిచ్చినా వైసీపీకి ఓటేయరు.

తిరుపతిలో జనసేనదే గెలుపు

'చిత్తూరులో గెలుపు జగన్మోహన్‌దే. మన వాడు పోగలుగుతాడా అనుకున్నాను. కానీ అందర్నీ కూడగట్టుకుని కురుక్షేత్ర యుద్ధానికి సిద్ధమైపోయాడు. కౌరవ వధ తప్పదు' అని చంద్రబాబు గురజాల గురించి చెప్పినప్పుడు సభికుల నుంచి పెద్దఎత్తున స్పందన వచ్చింది. 'మూడుసార్లు పూతలపట్టులో గెలవకపోయినా.. ఈసారి అక్కడ మురళీమోహన్ పక్కాగా గెలవబోతున్నారు. అలాగే, సమాజ సేవ కోసం రాజకీయాల్లోకి వచ్చిన మాజీ ఐఆర్‌ఎస్ అధికారి దగ్గుమళ్ల ప్రసాదరావు కూడా చిత్తూరు ఎంపీగా గెలవబోతున్నారు. చిత్తూరు ఎమ్మెల్యేగా పనిచేసిన ఆరణి శ్రీనివాసులు తిరుపతిలో జనసేన అభ్యర్థి. ఆయన తప్పకుండా గెలుస్తారు' అని చంద్రబాబు పేర్కొన్నారు.

నేనెప్పుడైనా హత్యా రాజకీయాలు చేశానా?

బాబాయ్‌ని చంపేసి నారాసుర రక్తచరిత్ర అంటూ నింద నా మీద నెట్టేసే ప్రయత్నం చేశారు. ఈ జిల్లా వాడిగా నా గురించి మీకు తెలుసు కదా. ఇన్నాళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడైనా హత్యా రాజకీయాలు చేశానా?

సీఆర్ రాజన్‌కు సముచిత స్థానం

'టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్‌కు ఈసారి ఎమ్మెల్యే సీటివ్వాలనుకున్నాను. కొన్ని కారణాల వల్ల ఇవ్వలేకపోయాను. ఆయనకు సముచిత స్థానమిచ్చే బాధ్యత నాది' అంటూ చంద్రబాబు హామీ ఇచ్చారు. ముందుగా గురజాల జగన్మోహన్, మురళీమోహన్, దగ్గుమళ్ల ప్రసాదరావు, సీఆర్ రాజన్‌తో చంద్రబాబు మాట్లాడించారు.

చిత్తూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): 'జిల్లా విభజన తర్వాత యూనివర్సిటీలన్నీ తిరుపతిలో ఉండిపోయాయి. జిల్లాలో ద్రవిడ వర్సిటీనే ఉంది. ఇక్కడ వర్సిటీనేకాదు ప్రతిష్ఠాత్మక కాలేజీలను నెలకొల్పి చిత్తూరును విద్యా కేంద్రంగా మారుస్తా' అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. చిత్తూరు నగరం మురకంబట్టు సర్కిల్ వద్ద శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార ముగింపు సభలో ఆయన ప్రసంగించారు. ఆయన మాటల్లోనే..

చిత్తూరు సభతో కొండంత ధైర్యం వచ్చింది

నాకు జన్మనిచ్చిన జిల్లా.. రాజకీయ ఓనమాలు నేర్పించిన జిల్లా.. చిత్తూరు. సామాన్యుడిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా, సీఎంగా ఇక్కడ పర్యటించాను. రాష్ట్రమంతటా తిరిగి చివరి మీటింగ్ చిత్తూరులో పెట్టాలనుకుని వచ్చా. చిత్తూరు సభలో పాల్గొన్నాక కొండంత ధైర్యం వచ్చింది. సభ అదరగొట్టింది. రాష్ట్రానికి ఊపునిచ్చింది. ఉమ్మడి జిల్లాలో 14 సీట్లనూ గెలిపించండి. చిత్తూరును అనేక రకాలుగా అభివృద్ధి చేయాలనుంది. మీరంతా ఓటేయకుంటే నేనేమీ చేయలేను.

పెద్దిరెడ్డి నొక్కిందంతా కక్కిస్తా..

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్ని అక్రమంగా ఏకగ్రీవాలు చేసుకున్నారు. అడ్డుకునేందుకు వస్తున్న నన్ను తిరుపతి ఎయిర్‌పోర్టులో అడ్డుకున్నారు. నేను అనుకుని ఉంటే రోడ్డు మీదకి కూడా రాలేరు. ఇక్కడ పాపాల పెద్దిరెడ్డి ఉన్నాడు. పదవులన్నీ ఆయనకే కావాలి. ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రి, కాంట్రాక్టర్లు అన్నీ ఆయన కుటుంబానికే. వీళ్లు నొక్కిన డబ్బంతా కక్కిస్తా.

నేను ఉంటే ఇంకా ఎంతో చేసేవాడిని


తిరుపతిని ఎలక్ట్రానిక్ హబ్‌గా మార్చి అనేక పరిశ్రమలు తెచ్చాను. జాతీయ విద్యా సంస్థలూ నా హయాంలోనే వచ్చాయి. చిత్తూరులో అపోలో నాలెడ్జ్ సిటీ నేను పెట్టిందే. నేను ఉంటే అడవిపల్లె రిజర్వాయరు నుంచి చిత్తూరుకు నీళ్లు వచ్చేవి. ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేవాడ్ని. వైసీపీ వాళ్లు ఐదేళ్లలో ఓ తట్ట మట్టి ఎత్తలేదు. చుక్కనీరు రాలేదు. జిల్లాలో నీటి ఎద్దడి లేకుండా ప్రతి ఎకరాకు నీళ్లిస్తా.

స్థానిక నాయకులకు ప్రశంస

ఉత్సాహంగా, స్వచ్ఛందంగా వచ్చి జగన్మోహన్‌ని గెలిపిస్తానని చెప్పిన వ్యక్తి మాజీ ఎమ్మెల్యే సీకే బాబు అని చంద్రబాబు ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రజలు కేకలు పెడుతూ పెద్దఎత్తున స్పందించారు. ఇక్కడ టీడీపీకి పెద్ద దిక్కు, ఎప్పటి నుంచో పార్టీ కోసం కష్టపడుతున్న సిన్సియర్ కార్యకర్త అంటూ మాజీ ఎమ్మెల్సీ దొరబాబును అభినందించారు. మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, మాజీ మేయర్ హేమలత, చంద్రప్రకాష్, త్యాగరాజు, బాలాజీ, డీఏ శ్రీనివాస్, బద్రి, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు అరుణ తదితరులు కష్టపడుతున్నారన్నారు.

సభ సక్సెస్

- ఎండను, వర్షాన్ని లెక్కచేయని జనం



వర్షంలోనూ చంద్రబాబు ప్రసంగం

చిత్తూరు సభ సక్సెస్ అయింది. చిత్తూరు టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపింది. షెడ్యూల్ కంటే గంటన్నర ఆలస్యంగా 4:45 గంటలకు మురకంబట్టు సర్కిల్‌కు చంద్రబాబు చేరుకున్నారు. అంతవరకూ జనం ఎండలోనే వేచి చూశారు. ప్రసంగం చివర్లో వర్షం పడినా కదల్లేదు. టీడీపీ గెలిస్తే అమలు చేసే పథకాలు, అభివృద్ధి.. జగన్ మళ్లీ వస్తే జరిగే ప్రమాదం గురించి చంద్రబాబు వివరించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు వ్యతిరేకంగా ఓ పాటను ప్రసంగం మధ్యలో ప్రజలకు వినిపించారు. దాని గురించి వివరించారు. చివర్లో ఈదురు గాలులు, వర్షం పడినా ప్రసంగం ఆపలేదు. ఐదు నిమిషాలు మాట్లాడారు. 'వర్షం పడుతోంది శుభారంభం. వరుణ దేవుడు దీవిస్తున్నాడు' అని చెప్పారు.

పురుగు మందు కొట్టమంటే... పైరు చంపేస్తారా..!

» ఓటమి నిర్ధారణతో వైసీపీ అబద్ధాలు: బీజేపీ

అమరావతి, మే 11(ఆంధ్రజ్యోతి): 'ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్.. పొలానికి పురుగు మందు కొట్టమంటే పైరు చచ్చే మందు కొట్టినట్లుంది. ఎన్నికల్లో ఓడిపోతున్నామనే స్పష్టత రావడంతో జగన్ అబద్ధాలపై అబద్ధాలు వల్లెవేస్తూ ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నం చేయాలని చూస్తున్నారు. అయినా ఉపయోగం లేదు' అని బీజేపీ వ్యాఖ్యానించింది. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ నేతలు పాతూరి నాగభూషణం, లంకా దినకర్, సాదినేని యామినీ శర్మ విలేకర్లతో మాట్లాడారు. 'అన్ని వర్గాలకు అన్యాయం చేసిన జగన్‌రెడ్డి అబద్ధాలతో ప్రతిపక్షాలపై నిందలేయడం తగదు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు కేంద్రం తెచ్చిందని చెప్పడం అతిపెద్ద అబద్ధం. అధికారులకు బాధ్యతలు ఉండాలని నీతి ఆయోగ్ చెప్పిన చోట.. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి లాంటి భూ కబ్జాదారులకు చోటు కల్పించేలా సవరణ చేశారు. అందుకనే ఆ చట్టాన్ని ఆమోదించే ప్రసక్తే లేదని కేంద్రం తిప్పి పంపింది. జగన్ తన పాలనలో రాష్ట్రంపై మోపిన అప్పుల భారం ఎంత? ఇసుక, మైనింగ్, లిక్కర్ ద్వారా తాను దోచుకున్నది ఎంత? అనేది ప్రజలకు చెబితే కనీస ప్రాయశ్చితం జరుగుతుంది. మార్చిలో బటన్ నొక్కి, పోలింగ్ ముందు బ్యాంకు ఖాతాలో డబ్బులు వేయాలన్న అధికార పార్టీ కుట్రకు సీఎస్ వంత పాడటం ఆయన స్థాయికి తగదు' అని ఆ నేతలు అన్నారు.

పాస్‌బుక్‌పై ఫొటో, సర్వేరాళ్లపై పేరు... కేంద్రమే చెప్పిందా?: జేపీ వల్లూరు

'సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్.. అనేది బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ నినాదం. అందరినీ దోచుకో.. అయిన వారితో పంచుకో.. అనేది రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వ విధానం. ఇలాంటి వాళ్లు చెప్పే అబద్ధాలు నమ్మే పరిస్థితిలో ఆంధ్రులు లేరు' అని జాతీయ లేబర్ బోర్డు చైర్మన్ వల్లూరు జయప్రకాశ్ నారాయణ అన్నారు. ఈమేరకు ఆయన శనివారం ఓ ప్రకటన చేస్తూ, 'ప్రజల ఆస్తులు లాక్కోమని కేంద్రం చెబుతుందా? పట్టాదారు పాసు పుస్తకాలపై ఫొటో వేసుకోమని కేంద్రం చెప్పిందా? సర్వే రాళ్లపై పేర్లు వేసుకోమని కేంద్రం చెప్పిందా? రైతు భరోసాలో మోదీ ఇచ్చే రూ.ఆరు వేలు కలిపేసుకోమని చెప్పిందా? కేంద్రమిచ్చే ఉచిత రేషన్ పంపిణీ వాహనాలపై స్టిక్కర్ వేసుకోమని వైసీపీ పెద్దలకు చెప్పిందా?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.

లాలూ తరహాలో జగన్ దోపిడీ: షానవాజ్

» రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్‌ను ఓడించండి: సుజనా

అమరావతి, మే 11(ఆంధ్రజ్యోతి): ఒకప్పటి లాలూ ప్రసాద్ యాదవ్ తరహాలో జగన్‌రెడ్డి దోపిడీకి రాచబాట వేసుకున్నారని బీజేపీ నేత, కేంద్ర మాజీ మంత్రి షానవాజ్ హుసేన్ వ్యాఖ్యానించారు. విజయవాడ పశ్చిమ కూటమి అభ్యర్థి సుజనా చౌదరి తరఫున ప్రచారం చేసేందుకు వచ్చిన ఆయన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. భారీ మెజారిటీతో ప్రధానిగా నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రిగా చంద్రబాబు జూన్ 4 తర్వాత ప్రమాణం చేయబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. ఐదేళ్లలో అభివృద్ధి చేయమని ప్రజలు ఓటేస్తే రాష్ట్రాన్ని సర్వనాశనం చేయవచ్చని జగన్ నిరూపించారంటూ సుజనా చౌదరి అన్నారు. రాజ్యాంగ వ్యవస్థల్ని లెక్క చేయకుండా, పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేసి రాష్ట్రాన్ని అరాచకాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని మండిపడ్డారు. ప్రచారంలో బెజవాడ ప్రజల పరిస్థితి చూస్తోంటే ఇంత అధ్వాన్నంగా పరిపాలన సాగించారా? అనిపించిందని సుజనా అన్నారు.

బొబ్బిలి కోటలో పోలీసుల హడావుడి

బొబ్బిలి, మే 11: విజయనగరం జిల్లా బొబ్బిలిలో ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీ నాయన) నివాసముంటున్న బొబ్బిలి కోటలో శనివారం పోలీసులు తనిఖీల పేరిట హడావుడి చేశారు. పోలింగ్‌కు 48 గంటలు ఉండనగా ప్రత్యర్థులు చేసిన తప్పుడు ఫిర్యాదులతో తనిఖీలకు వెళ్లారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు బొబ్బిలి కోటలో డబ్బులు, మద్యం, ఇతర సామగ్రి భద్రపర్చారని వారికి ఫిర్యాదు అందింది. ఆ మేరకు కోటలోకి ప్రవేశించి అన్ని గదుల్లో అణువణువునా పరిశీలించారు. అయితే అక్కడ ఎలాంటి నగదు, మద్యం దొరకలేదు. దీనిపై సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు వివరణ ఇస్తూ.. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు బొబ్బిలి కోటలో డబ్బు, మద్యం వంటివి పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో తనిఖీలు నిర్వహించామని, అయితే అక్కడ ఏమీ లభ్యం కాలేదని తెలిపారు.



బొబ్బిలి కోటలో తనిఖీ చేస్తున్న పోలీసులు

అక్కచెల్లమ్మలంటూనే అనుచిత వ్యాఖ్యలా?: వర్ల

అమరావతి, మే 11(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓటమి కళ్ల ముందు కనిపిస్తుండటంతో భయాందోళనకు గురవుతున్న జగన్‌రెడ్డి.. నైతిక విలువలు వదిలేసి, విపక్షాలపైన, అక్కచెల్లెమ్మల మీద దిగజారుడు దూషణలకు పాల్పడుతున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మండిపడ్డారు. 'పిఠాపురం ప్రచార సభలో సీఎం జగన్.. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. రాష్ట్రంలోని మహిళల శీలాన్ని శంకించేలా అనుచిత వ్యాఖ్యలు చేశారు' అని వర్ల అన్నారు.

దొంగ ఓట్లకు వైసీపీ స్కెచ్: కనకమేడల

న్యూఢిల్లీ, మే 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఉప ఎన్నికలో వైసీపీ ఏ విధంగానైతే దొంగ ఓట్లు వేసిందో.. ఈ సారి అలానే దొంగ ఓట్లు వేయాలని చూస్తోందని టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ఆరోపించారు. ప్రైవేటు సిబ్బంది, గుండాలను పెట్టుకొని ఓట్లు వేసుకోవాలని వైసీపీ స్కెచ్ గీసిందని ఆరోపించారు. శనివారం ఢిల్లీలో కనకమేడల మాట్లాడుతూ.. 'ఎన్నికలు సవ్యంగా జరుగుతాయో లేదో' అని జగన్ అంటున్నారని.. ఆయన అలా అన్నారంటే ఎన్నికలలో ఏదో చేయబోతున్నారని అనుమానం వ్యక్తం చేశారు. సొంత చెల్లెలను వైసీపీ సోషల్ మీడియాతో జగన్ పచ్చిబూతులు తిట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి జరగడంతో పాటు అమరావతి, పోలవరం పూర్తిఅవుతాయని అన్నారు.

ఏయూ అధికారుల కోడ్ ఉల్లంఘన

» విద్యార్థులకు భారీగా ఉద్యోగాలు కల్పించినట్టు పోస్టర్

» అధికార పార్టీకి లాభించేలా ఎన్నికల ముందు విడుదల

విశాఖపట్నం, మే 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులు అధికార పార్టీ సేవలో తరిస్తున్నారు. ఎన్నికల్లో వైసీపీకి మేలు చేద్దామనే రీతిలో వ్యవహరిస్తున్నారు. వర్సిటీలో పెద్దఎత్తున ఉద్యోగాలను కల్పించామంటూ వైస్ చాన్సలర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి, ఇతర అధికారులు శనివారం ఒక పోస్టర్ విడుదల చేశారు. ఇది ఒక రకంగా అధికార పార్టీకి ప్రయోజనం చేకూర్చే ప్రయత్నమేనని, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వర్సిటీ అధికారులు వ్యవహరిస్తున్నారని విపక్షాలు విమర్శలు గుప్పించాయి. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. గడచిన ఐదేళ్లలో నిరుద్యోగులకు తీరని అన్యాయం చేసిందన్న విమర్శ వైసీపీ ప్రభుత్వంపై ఉంది. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న జగన్మోహన్‌రెడ్డి ఒక్కసారి కూడా ఆ పని చేయలేకపోయారు. అదేవిధంగా ఐదేళ్లలో ఒక్క పర్యాయం కూడా ఉపాధ్యాయుల నియామకం చేపట్టలేకపోయారు. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వంపై నిరుద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. ఇటువంటి తరుణంలో రికార్డు స్థాయిలో ఉద్యోగాలు కల్పించామంటూ పోలింగ్‌కు రెండు రోజుల ముందు ఏయూ అధికారులు ప్రకటన విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది.

పాక్ సరిహద్దుల్లో 'దృష్టి-10' నిఘా

న్యూఢిల్లీ, మే 11: పాకిస్థాన్ సరిహద్దు వెంబడి నిఘాను పెంచే దిశగా భారత్ అడుగులు వేస్తోంది. భారత ఆర్మీ, నేవీ కోసం దృష్టి-10 డ్రోన్‌గా పిలిచే నాలుగు హెర్మెస్-900 స్టార్‌లైనర్ డ్రోన్లను కొనుగోలు చేసింది. అదానీ డిఫెన్స్ సిస్టమ్స్ ఈ డ్రోన్లను సరఫరా చేస్తుంది. తొలి డ్రోన్‌ను ఇప్పటికే ఈ ఏడాది జనవరిలో నావికాదళానికి అందించగా.. రెండో డ్రోన్‌ను జూన్ 18న హైదరాబాద్‌లో ఆర్మీ దళానికి అప్పగించనున్నారు. ఆ తర్వాత మిగిలిన రెండు డ్రోన్లలో ఒకదాన్ని నేవీకి, మరొకదాన్ని ఆర్మీకి సరఫరా చేస్తారని రక్షణ శాఖ అధికారులు తెలిపారు. భారత ఆర్మీ ఈ డ్రోన్లను భటిండా సైనిక స్థావరం వద్ద మోహరించనుందని, అక్కడి నుంచి పాకిస్థాన్‌తో ఉన్న మొత్తం పశ్చిమ సరిహద్దు ప్రాంతంపై నిఘా పెట్టవచ్చని వారు పేర్కొన్నారు. భారత ఆర్మీ ఇప్పటికే హెరాన్ మార్క్ 1, మార్క్ 2 డ్రోన్లను వినియోగిస్తోంది.

సొంతవారిని ముంచి.. పొరుగు సేవ!

రాష్ట్రంలోని స్థానిక డెయిరీలను దెబ్బకొట్టడానికి రంగంలోకి అమూల్ కమీషన్ల కోసం బైజూస్‌తో ఒప్పందం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రజలు, విద్యార్థులు, సంస్థల ప్రయోజనాలు అసలు పట్టవు. పైగా రాష్ట్రానికి చెందిన సంస్థలకు నష్టం చేకూర్చి, పొరుగు రాష్ట్రాల కంపెనీలకు మేలు చేయడం. కమీషన్లు దండుకుని ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించడం. ఇదీ జగన్ సర్కారు విధానం. బైజూస్, అమూల్ సేవలో తరించడమే ఇందుకు ఉదాహరణ. స్థానిక డెయిరీలను, ముఖ్యంగా చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ డెయిరీని దెబ్బతీయడానికి గుజరాత్‌కు చెందిన అమూల్‌ను తీసుకొచ్చారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల అమూల్‌కు అయాచిత లబ్ధి కలిగింది కానీ పాడి రైతులకు ఎలాంటి ప్రయోజనం కలగలేదు. ఇక విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ పేరిట కర్ణాటకకు చెందిన బైజూస్‌ను తీసుకొచ్చారు. బైజూస్‌కు మేలు చేయడంతో పాటు ట్యాబ్‌ల కొనుగోళ్లలో ప్రభుత్వ పెద్దలు కమిషన్లు దండుకున్నారు. కానీ విద్యార్థులకు పెద్దగా ప్రయోజనం కలగలేదు.

అమూల్‌పై ప్రత్యేక ప్రేమ

రాష్ట్రంలో సంగం, కృష్ణా, కర్నూలు, విజయ వంటి డెయిరీలు ఉన్నాయి. జగన్ అధికారంలోకి వచ్చాక స్థానిక డెయిరీలను దెబ్బతీయడానికి కుట్ర పన్నారు. ఇందుకోసం ఎక్కడో వేరే రాష్ట్రం నుంచి అమూల్‌ను తీసుకొచ్చారు. అమూల్ కోసం 3,600 కోట్లు ప్రజాధనం ఖర్చు చేసి మరీ మౌలిక సదుపాయాలు కల్పించారు. పాడి రైతులు అమూల్‌కే పాలు పోయాలని అధికారుల ద్వారా ఒత్తిడి చేశారు. సహకార రంగాన్ని పునరుద్ధరిస్తామని, సహకార డెయిరీకి పాలు పోసే పాడి రైతులకు లీటర్‌కు రూ.4 బోనస్ ఇస్తామని ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీని కూడా విస్మరించారు. ఖాయిలా పడ్డ ఒక్క సహకార డెయిరీని కూడా ఈ ఐదేళ్లలో పునరుద్ధరించలేదు. పాడిరైతులకు ఎలాంటి ప్రయోజనం కలగలేదు. గుజరాత్‌కు చెందిన అమూల్ సేవలో జగన్ సర్కారు తరిస్తోంది. సహకార రంగంలోని చిత్తూరు, ఒంగోలు డెయిరీలను అమూల్‌కు ధారాదత్తం చేసింది.

బైజూస్ కోసమే పథకం

కేవలం బైజూస్ కంపెనీకి మేలు చేయడం కోసం జగన్ సర్కారు ట్యాబ్‌ల పథకాన్ని ప్రవేశపెట్టింది. నాలుగు నుంచి పదో తరగతి విద్యార్థులకు కంటెంట్ ఇవ్వడం దీని ఉద్దేశం. దీనివల్ల ఏటా ప్రభుత్వంపై రూ.500 కోట్లు భారం పడుతోంది. బైజూస్ కంపెనీకి మాత్రం యూజర్లను భారీగా పెంచింది. యూజర్లను పెంచుకోవడం ద్వారా దేశవ్యాప్తంగా వ్యాపారం మెరుగుపరుచుకోవాలని బైజూస్ ప్రయత్నిస్తే... ట్యాబ్‌ల కొనుగోలుతో అధికార పార్టీ నేతల జేబులు నిండాయి. రూ.10,800కే ఇస్తామని ఓ కంపెనీ ముందుకొచ్చినా ప్రభుత్వం పట్టించుకోకుండా, ఎక్కువ రేటుతోనే బైజూస్ నుంచి కొనుగోలు చేసింది. ఏటా నేతలు రూ.50 కోట్లు కమీషన్ల రూపంలో జేబులు నింపుకొన్నారు.

అన్నొచ్చిండు!

15 ఏళ్ల తర్వాత కనౌజ్ నుంచి అఖిలేశ్ పోటీ

» గతంలో 3 సార్లు ఇక్కడ గెలిచిన ఎస్పీ చీఫ్

» ఈసారి చివరి నిమిషంలో ఎన్నికల బరిలోకి



"పార్టీ తరఫున ఇక్కడ ఎవరిని నిలిపినా గెలిపిస్తాం.. ఈసారి భయ్యాజీ (అన్నయ్య) తిరిగొచ్చిండు. ఇక విజయం మాదే".. ఇదీ యూపీలోని కనౌజ్ నియోజకవర్గం సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) శ్రేణుల మాట. అత్తరు పరిశ్రమకు పేరు గాంచిన ఈ స్థానం ఎస్పీకి కంచుకోట. ఆ పార్టీ ఆవిర్భావం తర్వాత తొమ్మిదిసార్లు ఎన్నికలు జరిగితే ఏడుసార్లు గెలిచింది. ఎస్పీ వ్యవస్థాపకుడు ములాయంసింగ్ యాదవ్ ఒకసారి, ఆయన కుమారుడు, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ వరుసగా మూడుసార్లు గెలిచారు. అఖిలేశ్ భార్య డింపుల్ రెండుసార్లు నెగ్గారు. గత ఎన్నికల్లో ఆమె.. బీజేపీ అభ్యర్థి సుబ్రత్ పాఠక్ చేతిలో ఓడారు. 2009లో గెలిచిన అఖిలేశ్.. 2012లో యూపీ సీఎం కావడంతో రాజీనామా చేశారు. 15 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం ఈసారి కనౌజ్ బరిలో నిలిచారు. ఈ నియోజకవర్గంలో 13న సోమవారం పోలింగ్ జరగనుంది.

'ఇది ఇండియా-పాక్ ప్రపంచ కప్ మ్యాచ్'

అఖిలేశ్ రాకతో కనౌజ్‌లో ఎన్నికల వాతావరణం మారిపోయింది. పోటీని అఖిలేశ్ వర్సెస్ పాఠక్, అఖిలేశ్ వర్సెస్ మోదీగా పేర్కొంటున్నారు. దీనిని మరింత వేడెక్కించేలా బీజేపీ సిటింగ్ ఎంపీ సుబ్రత్ పాఠక్ వ్యాఖ్యలు చేశారు. 2009, 2012 (ఉప ఎన్నిక), 2014లో హ్యాట్రిక్ ఓటములు మూటగట్టుకున్న ఆయన 2019లో డింపుల్‌పై నెగ్గి ప్రతీకారం తీర్చుకున్నారు. అఖిలేశ్‌తో పోటీని ఏకంగా ఇండియా-పాకిస్థాన్ ప్రపంచ కప్ మ్యాచ్‌గా అభివర్ణించారు. కాగా, సుబ్రత్‌పై 2014లో డింపుల్ 19,907 ఓట్లతో నెగ్గారు. ఆమెను సుబ్రత్ గత ఎన్నికల్లో 12,353 ఓట్లతో ఓడించారు. ఈసారీ ఎవరు గెలిచినా ఆధిక్యం మాత్రం స్వల్పమేనని అత్తరు వ్యాపారి ధీరేంద్ర మిశ్రా తెలిపారు. ఎస్పీ, బీజేపీ మాత్రం లక్షన్నర నుంచి 2 లక్షల ఓట్ల మెజారిటీతో తాము గెలుస్తామని చెప్పుకొంటున్నాయి. కనౌజ్, ఔరయా, కాన్పూర్ దెహాత్‌లో విస్తరించిన ఉన్న కనౌజ్ నియోజకవర్గంలో 19 లక్షల మంది ఓటర్లున్నారు. ముస్లింలు 3 లక్షలు, బ్రాహ్మణులు, యాదవులు 2.5 లక్షల చొప్పున ఉన్నారు. కానీ, 4 లక్షల పైగా ఉన్న దళితులే గెలుపు నిర్ణేతలు. కానీ, ఇక్కడినుంచి బీఎస్పీ ఒక్కసారి కూడా గెలవకపోవడం గమనార్హం. దళితులు కులాన్ని బట్టి కాక, అభివృద్ధికి ఓటేయడమే దీనికి కారణం. బీఎస్పీ ఇమ్రాన్ బిన్ జాఫర్‌కు టికెటిచ్చింది. ఈయన ముస్లిం ఓట్లను చీల్చే చాన్సుంది.

- సెంట్రల్ డెస్క్

అబ్బాయ్‌ని కాదని బాబాయ్..

కనౌజ్ టికెట్‌ను ఎస్పీ తొలుత ములాయం పెద్దన్న మనవడు తేజ్‌ప్రతాప్ సింగ్ యాదవ్‌కు కేటాయించింది. కానీ, చివరి నిమిషంలో అబ్బాయిని కాదని బాబాయ్ అఖిలేశ్ రంగంలోకి దిగారు. దీంతో ఎస్పీ శ్రేణుల్లో ఉత్సాహం వచ్చింది. "తేజ్‌ప్రతాప్ అయినా గెలిచేవారే. కానీ, కనౌజ్ అంటే భయ్యాజీ అఖిలేశే" అని సీనియర్ కార్యకర్త విజయ్‌సింగ్ యాదవ్ హర్షాతిరేకం వ్యక్తం చేశాడు. కాగా, నియోజకవర్గంలో అఖిలేశ్‌ను అభిమానించే యువత కూడా అధికమే. నియోజకవర్గంలో వీధికి ఒక్కరైనా ములాయం కుటుంబంతో వ్యక్తిగత పరిచయం ఉన్నవారే. వీరిలో వీధి వ్యాపారుల నుంచి ఉన్నత వర్గాల వారి వరకు ఉండడం గమనార్హం.

టెంపో బిలియనీర్ల చేతిలో ప్రధాని తోలుబొమ్మ రాజు

» రాహుల్ గాంధీ విమర్శ



న్యూఢిల్లీ, మే 11: ప్రధాని మోదీపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శనాస్త్రాలు సంధించారు. ఆయన "టెంపో బిలియనీర్ల" చేతిలో "తోలుబొమ్మ రాజు" అంటూ ఎద్దేవా చేశారు. అదానీ, అంబానీల నుంచి కాంగ్రెస్ టెంపోల్లో నగదు పొందుతున్నట్టు ప్రధాని వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఆయనపై రాహుల్ గాంధీ శనివారం మరోసారి విరుచుకుపడ్డారు. శుక్రవారం లఖ్‌నవూలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగం సారాంశాలతో కూడిన ఒక వీడియోను 'ఎక్స్'లో ఆయన పంచుకున్నారు. "నరేంద్ర మోదీ ప్రధాని కాదు.. ఆయన ఒక రాజు. టెంపో బిలియనీర్ల చేతిలో ఆయన తోలుబొమ్మ రాజు" అంటూ హిందీలో పోస్ట్ చేశారు. లఖ్‌నవూలో జరిగిన కార్యక్రమంలోనూ మోదీ ప్రధాని కాదు రాజు అంటూ రాహుల్ గాంధీ ఆరోపించారు. కాగా లోక్‌సభ ఎన్నికలపై బహిరంగ చర్చకు ఇద్దరు మాజీ జడ్జిలు, హిందూ పత్రిక మాజీ ఎడిటర్ ఎన్.రామ్ ఆహ్వానించడాన్ని స్వాగతిస్తున్నట్టు శనివారం రాహుల్ గాంధీ తెలిపారు. ఇది ప్రధాన రాజకీయ పార్టీలు తమ దార్శనికతను ఒక వేదిక ద్వారా దేశానికి తెలియజేసేందుకు దోహదపడే సానుకూల చొరవగా ఆయన అభివర్ణించారు. ఈ చర్చలో తాను లేదా తమ పార్టీ చీఫ్ ఖర్గే పాల్గొంటామని, ఇందులో ప్రధాని కూడా పాల్గొంటారని ఆశిస్తున్నామన్నారు. ప్రధాని మోదీ చర్చలో పాల్గొనాలని దేశం ఆశిస్తోందని 'ఎక్స్'వేదికగా రాహుల్ పోస్ట్ చేశారు. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శనివారం ప్రధానిపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి ముకేష్ అంబానీ, గౌతమ్ అదానీలు నల్లధనాన్ని పంపుతుంటే మోదీ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. అంబానీ, అదానీల విషయంలో కాంగ్రెస్ మౌనంగా లేదని, నిజాలను ప్రజలకు చెప్తోందని అన్నారు.

మొగ్గు మాకంటే మాకు

ఎన్డీఏకు మెజారిటీ రాదంటున్న ఇండియా.. 350 సీట్లు ఖాయమంటున్న బీజేపీ శిబిరం





న్యూఢిల్లీ, మే 11(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా మూడు దశల ఎన్నికలు ముగిశాయి.. సగం పైగా స్థానాల్లో పోలింగ్ అయిపోయింది..! మరి.. రాజకీయ వాతావరణం ఎలా ఉంది? బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమిపై ప్రభుత్వ వ్యతిరేకత ప్రభావం పడనుందా? కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ఇండియా కూటమి గాలి వీస్తోందా? దీనిపై ఆ రెండు పక్షాలు తమతమ వాదనలు వినిపిస్తున్నాయి. 'దేశంలో ఇండియా కూటమి సునామీ వీస్తోంది. బీజేపీకి మెజారిటీ సీట్లు లభించే అవకాశం లేదు' అని యూపీలో రాహుల్‌గాంధీ నొక్కి చెప్పారు. కాషాయ పార్టీకి గతం కంటే కనీసం వంద సీట్లు తగ్గుతాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పష్టం చేశారు. అయితే, "కాంగ్రెస్ 50 సీట్లు కూడా నెగ్గదు. ఎన్డీఏ అన్ని రికార్డులు అధిగమించి 400 పైగా స్థానాలు సాధిస్తుంది" అని ప్రధాని మోదీ చెప్తున్నారు. ఈ నేపథ్యంలో ఎవరి అంచనా సరైనదవుతుంది? అన్న ప్రశ్న ప్రతి ఒక్కరి మనసులో మెదులుతోంది. 543 లోక్‌సభ స్థానాలకు గాను ఇప్పటికి 3 దశల్లో 283 సీట్లకు ఓటింగ్ పూర్తయింది. సోమవారం 96 చోట్ల ఎన్నికలున్నాయి.

మోదీ మాట మారింది.. అదే నిదర్శనం

ఇండియా కూటమిలో ఏ నేతను కదిలించినా బీజేపీకి మెజారిటీ సీట్లు రావని చెబుతున్నారు. మూడు దశల పోలింగ్‌ను బట్టి ఇది స్పష్టమైందని, అభివృద్ధి, రామ మందిరం ఎన్నికల ప్రధానాంశాలుగా భావించిన ప్రధాని మోదీ.. ఓటమి భయంతో హిందూ-ముస్లిం, ఇతర అప్రధాన అంశాలను లేవనెత్తి సొమ్ము చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారని పేర్కొంటున్నారు. యూపీలోనే కాదు, ప్రతి రాష్ట్రంలోనూ ఎన్డీఏకు సీట్లు తగ్గుతాయని వివరిస్తున్నారు. బిహార్‌లో బీజేపీతో చేతులు కలిపిన నితీశ్‌కుమార్ పార్టీ జేడీయూ, మహారాష్ట్రలో ఏక్‌నాథ్ శిందే శివసేన, అజిత్‌పవార్ ఎన్సీపీని ప్రజలు తిరస్కరిస్తారని పేర్కొంటున్నారు. ఇక ప్రజ్వల్ రాసలీలల వీడియోలు బయటపడిన తర్వాత కర్ణాటకలో బీజేపీ-జనతాదళ్(ఎస్) గ్రాఫ్ పడిపోయిందని విశ్లేషిస్తున్నారు.

ఎన్డీఏకు దెబ్బ పడేది ఇక్కడే..

ఇండియా కూటమి నేతల లెక్కల ప్రకారం.. ప్రత్యర్థి కూటమికి యూపీలో 10, మహారాష్ట్రలో 20, బిహార్‌లో 20, రాజస్థాన్‌లో 10, కర్ణాటకలో 15, హరియాణాలో 5, పంజాబ్‌లో 4, ఢిల్లీలో 4, జార్ఖండ్‌లో 4, మధ్యప్రదేశ్‌లో 5, గుజరాత్‌లో 2, ఛత్తీస్‌గఢ్‌లో 2, ఈశాన్య రాష్ట్రాల్లో 10 సీట్లు (మొత్తం 111) తగ్గుతాయి. యూపీలో బీసీలు, మైనారిటీలు సమాజ్‌వాది పార్టీ-కాంగ్రెస్ వైపు సంఘటితం అవుతున్నారని చెబుతున్నారు. హరియాణ, పంజాబ్, గుజరాత్, ఢిల్లీ తదితరచోట ప్రతి రాష్ట్రంలోనూ బీజేపీ 2 నుంచి 5 సీట్లు కోల్పోతుందని అంచనా వేస్తున్నారు.

యూపీని స్వీప్ చేస్తాం..!

విపక్ష కూటమి వాదనను బీజేపీ నేతలు గట్టిగా తిప్పికొడుతున్నారు. రామ మందిర నిర్మాణంతో యూపీలో మోదీ ప్రభంజనం వీస్తోందని, రాష్ట్రంలో శాంతిభద్రతలు నెలకొన్న రీత్యా 75 సీట్లు గెలుచుకున్నా ఆశ్చర్యం లేదని చెబుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీకి పాతిక సీట్ల దాక వచ్చినా రావొచ్చని విశ్లేషిస్తున్నారు. సందేశ్‌ఖాలీ ఉదంతంతో రాష్ట్రంలో హిందూత్వ ప్రభంజనం వీస్తోందని, సీఎం మమతా బెనర్జీ ప్రభుత్వ అవినీతిపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని అంటున్నారు. కొన్ని రాష్ట్రాల్లో ఒకటో, రెండో సీట్లు తగ్గినప్పటికీ.. ఒడిశా, తెలంగాణ, ఏపీ, తమిళనాడులో పెరుగుతాయని వివరిస్తున్నారు.

తగ్గడం కాదు.. బలపడుతున్నాం

ఇప్పటికే అత్యధిక స్థానాలు సాధించిన రాష్ట్రాల సంగతి పక్కపెడితే.. కొత్తచోట్ల తాము బలపడనున్నామని బీజేపీ నేతలు పేర్కొంటున్నారు. ఒడిశాలో నవీన్ పట్నాయక్ ప్రభుత్వాన్ని తమిళనాడుకు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పాండ్యన్ నియంత్రించడంపై వ్యతిరేకత వస్తోందని, ప్రజలు తమ పార్టీ వైపు చూస్తున్నారని అంటున్నారు. ఈ రాష్ట్రంలో గతంలోని 9 సీట్లు 14కు పెరుగుతాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో 6 నుంచి 8, ఏపీలో 3 నుంచి 5 సీట్లు వస్తాయని చెప్పుకొస్తున్నారు. ఈ లెక్కన ప్రముఖ ఆర్థికవేత్త సుర్జీత్‌భల్లా అంచనా వేసినట్లు 350 సీట్లు వచ్చే అవకాశాలూ లేకపోలేదని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు.

రస్కిన్ బాండ్‌కు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం



న్యూఢిల్లీ, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆంగ్ల రచయిత రస్కిన్ బాండ్‌కు కేంద్ర సాహిత్య అకాడమీ ఫెలోషిప్‌ను ప్రదానం చేసింది. కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్, కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావు శనివారం ముస్సోరిలో రస్కిన్ బాండ్ నివాసానికి వెళ్లి ఆయనకు ఈ ఫెలోషిప్‌ను అందజేశారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని కసౌలీలో 1934 మేలో జన్మించిన రస్కిన్ బాండ్ గత 50 ఏళ్లుగా సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో రచనలు చేస్తున్నారు. పలు కథా సంకలనాలు, వ్యాసాలు, పిల్లల పుస్తకాలు రచించారు. వాగ్రంట్స్ ఇన్ ద వ్యాలీ, వన్స్ అపాన్ ఎ మాన్‌సూన్ టైమ్, యాంగ్రీ రివర్, స్ట్రేంజర్స్ ఇన్ ద నైట్, ఆల్ రోడ్స్ లీడ్స్ గంగా... మొదలైనవి ఆయన ప్రముఖ రచనలు, 1857 సిపాయిల తిరుగుబాటుపై ఆయన రచించిన చారిత్రక నవల ఆధారంగా జూనూన్ అనే చలన చిత్రాన్ని రూపొందించారు. ఆయన రచనలపై అనేక టీవీ సీరియల్స్ వెలువడ్డాయి.

అఫ్గాన్‌లో వరదలు 300 మంది మృతి

ఇస్లామాబాద్, మే 11: ఆకస్మిక వరదలతో అఫ్గానిస్థాన్ అతలాకుతలమవుతోంది. వరదల ధాటికి సుమారు 300 మంది చనిపోయారని, దాదాపు 1000పైగా గృహాలు ధ్వంసమయ్యాయని శనివారం ఐక్యరాజ్యసమితి తెలిపింది. భీకర వానకు ఉత్తర అఫ్గానిస్థాన్ తీవ్రంగా ప్రభావితమైంది. బఘ్లాన్, ఘోర్, హెరాత్, బదాక్షన్ ప్రావిన్సులు దారుణంగా దెబ్బతిన్నాయి. వర్షాలకు పలు ఇళ్లు నేలమట్టమయ్యాయి. వరదల ధాటికి వాహనాలు కొట్టుకుపోయాయి. రహదారులు, వీధులలో బురద పేరుకుపోయింది. ప్రాణ నష్టం భారీగా ఉండడంతో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.

లిక్విడ్ రామ్‌జెట్ ఇంధన పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ, మే 11: బ్రహ్మోస్ తరహాలో భారత్ సొంతంగా అభివృద్ధి చేస్తున్న సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ తయారీలో డీఆర్‌డీవో మరో కీలక ముందడుగు వేసింది. కాన్పూర్‌లోని డిఫెన్స్ మెటీరియల్, స్టోర్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఎంఎస్ఆర్‌డీఈ), డీఆర్‌డీవో దీనికోసం దేశీయంగా అభివృద్ధి చేసిన లిక్విడ్ రామ్‌జెట్ ఇంధనాన్ని ఈ నెల 8న విజయవంతంగా పరీక్షించింది. బ్రహ్మోస్ క్షిపణిని డీఆర్‌డీవో, రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ఈ రెండింటి మధ్య ఒప్పందం ప్రకారం బ్రహ్మోస్ క్షిపణిలోని రామ్‌జెట్ ఇంజన్లు, దాని ఇంధనం, ఇతర భాగాలను రష్యా నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. అయితే డీఆర్‌డీవో ఇప్పుడు దేశీయంగా సొంతంగా లిక్విడ్ రామ్‌జెట్ ఇంధన(ఎల్ఎఫ్ఆర్‌జే) ఇంజిన్, లాంగ్ రేంజ్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిని అభివృద్ధి చేసే పనిలో నిమగ్నమైంది. ఈ క్రమంలో దానిలో ఉపయోగించే లిక్విడ్ రామ్‌జెట్ ఇంధనాన్ని విజయవంతంగా పరీక్షించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

దానం కాదు.. పింఛను హక్కు

రిటైర్డ్ ఉద్యోగులకు పూర్తి పెన్షన్ ఇవ్వండి

» జాప్యం జరిగినందుకు 6% వడ్డీ కూడా ఇవ్వాలి

» రెండు వారాల్లో చెల్లింపులు పూర్తి చేయాలి

» తెలుగు అకాడమీలకు హైకోర్టు ఆదేశాలు

» సర్వీసు రికార్డులను ఇరు రాష్ట్రాలు మార్చుకోవాలని సూచన

హైదరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు అకాడమీలో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు హైకోర్టు భారీ ఊరట కలిగించింది. వారికి పెన్షన్ బకాయిలతో పాటు, జాప్యం జరిగినందుకు వడ్డీ చెల్లించాలని ఆదేశించింది. ఈ ప్రక్రియను రెండు వారాల్లో పూర్తి చేయాలని స్పష్టం చేసింది. పింఛను అనేది రిటైర్డ్ ఉద్యోగులకు ఇచ్చే దానమో, వరమో కాదని.. రాజ్యాంగబద్ధమైన హక్కు అని స్పష్టం చేసింది. ఫిర్యాదిదారైన బి.వరలక్ష్మి సహా మరో 14 మంది ఉమ్మడి రాష్ట్ర తెలుగు అకాడమీలో వివిధ పోస్టుల్లో ఉద్యోగాలు చేసి 2014 జూన్ 2 (అపాయింటెడ్ డే) తర్వాత రిటైర్ అయ్యారు. ఉమ్మడి తెలుగు అకాడమీ విభజన వివాదాలు పెండింగ్‌లో ఉండటం, నిధులు, ఉద్యోగుల పంపకాలు తేలకపోవడంతో పింఛన్లు సక్రమంగా చెల్లించలేదు. దాంతో వారు 2020లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న హైకోర్టు.. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు రెండు నెలల్లో పిటిషనర్లు సహా ఉద్యోగుల విభజనను పూర్తిచేయాలని ఆదేశాలు జారీచేసింది. ఆస్తులు - అప్పులను 58శాతం, 42 శాతం నిష్పత్తిలో రెండు రాష్ట్రాలు పంచుకోవాలని పేర్కొంది. ఈ తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని సుప్రీంకోర్టు చెప్పడంతో ఏపీ, తెలంగాణ ఉద్యోగుల విభజన, నిధులు, పెన్షన్ నిధుల విభజనపై ఒప్పందానికి వచ్చాయి. ఈ ఒప్పందం ప్రకారం పింఛర్లకు వారి స్థానికత ఆధారంగా ఆయా అకాడమీలు నేరుగా చెల్లింపులు చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత 2022 మే 1న తెలుగు అకాడమీని ఇరురాష్ట్రాల మధ్య విభజించి.. ప్రత్యేక తెలుగు అకాడమీలు ఏర్పాటు చేశారు. ఒప్పందం ప్రకారం తెలంగాణ 11 మందికి.. ఏపీ నలుగురికి పూర్తిస్థాయి పింఛను చెల్లించాల్సి ఉంది. దీనిపై తెలంగాణ తెలుగు అకాడమీ అభ్యంతరం తెలిపింది. విభజన చట్టం ప్రకారం పింఛనర్లు ఏ రాష్ట్రానికి కేటాయించినా.. 42 శాతం తెలంగాణ, మిగతా 58 ఏపీ చెల్లించాలని.. వారిని ఏ రాష్ట్రానికి కేటాయించారనేదాంతో సంబంధం లేదని పేర్కొంది. ఏపీ మాత్రం స్థానికత కలిగిన వారికి పూర్తిస్థాయి చెల్లింపులు చేస్తామని పేర్కొంది. ఈ వివాదం నేపథ్యంలో తమకు పూర్తిస్థాయి పింఛను రావడం లేదని పేర్కొంటూ పిటిషనర్లు మళ్లీ 2023 డిసెంబర్‌లో హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ తుకారాంజీల ధర్మాసనం.. సుప్రీంకోర్టు ఎదుట ఇరు రాష్ట్రాలు అంగీకరించిన ఒప్పందం ప్రకారం.. రెండు రాష్ట్రాలు వారి వైపు నుంచి లాంఛనాలను పూర్తిచేయాలని స్పష్టం చేసింది. ఉద్యోగుల కేటాయింపులకు అనుగుణంగా 15 రోజుల్లోగా ఉద్యోగులు, పింఛనర్ల సర్వీసు రికార్డులు, రిజిస్టర్లను ఒకరికొకరు బదిలీ చేసుకోవాలని పేర్కొంది. పిటిషనర్ల పింఛన్లను మళ్లీ లెక్కగట్టి.. మిగిలిన బకాయిలను రెండువారాల్లో చెల్లించాలని తెలిపింది. ఆలస్యం చేసినందుకు ఆరు శాతం వడ్డీని అదనంగా చెల్లించాలని పేర్కొంది. ఇరు రాష్ట్రాల తెలుగు అకాడమీలు ఈ ఆదేశాలను అమలు చేసి జూన్ 24 లోపు హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)కు నివేదికను సమర్పించాలని తెలిపింది. నివేదికలను ఇచ్చిందీ లేనిదీ పరిశీలించడానికి కేసును జూన్ 27న మళ్లీ లిస్ట్ చేయాలని సూచించింది.